ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 24.02.2026 | సంపుటి :12 సంచిక : 216 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## గచ్చిబౌలిలో చదరపు గజం రూ.1.76 లక్షలు

వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.34.27 కోట్ల ఆదాయం

హైదరాబాద్(జనంసాక్షి):నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న హౌసింగ్ బోర్డు భూములు అధిక ధరలు పలికాయి. గచ్చిబౌలి, భౌరంపేట్, బాలాజీ నగర్, చింతల్ తదితర ప్రాంతాల్లోని మొత్తం 14 స్థలాలను బహిరంగ వేలం వేశారు. వీటిలో గచ్చిబౌలిలోని భూమి చదరపు గజం రూ.1.76 లక్షలు, కూకట్‌పల్లి బాలాజీ నగర్‌లో మిగతా 2లో..

## తమిళనాడు ఓటర్లు 5.67కోట్లు

రాష్ట్రంలో 74 లక్షల మంది ఓటర్ల తొలగింపు

తుది జాబితా విడుదల చేసిన ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ(జనంసాక్షి):మరికొద్ది రోజుల్లో శాసనసభ ఎన్నికలు జరగనున్న తమిళనాడులో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్‌) పూర్తయ్యింది. ఈ క్రమంలోనే సోమవారం తుది ఓటరు జాబితాను ఈసీ విడుదల చేసింది. రాష్ట్రంలో మొత్తం 5.67కోట్ల మిగతా 2లో..




## ఇక మెట్రో బాధ్యత
# రాష్ట్ర సర్కారుదే

ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం

ఈ ప్రక్రియ పర్యవేక్షణకు భట్టి ఆధ్వర్యంలో ఉపసంఘం ఏర్పాటు



- మార్చి 31లోగా కార్యాచరణ పూర్తికి నిర్ణయం
- డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా వైద్యవిధాన పరిషత్
- ఖమ్మం జిల్లాలో టీటీడీ నిర్మాణాలకు 20 ఎకరాలు
- మహబూబాబాద్ జిల్లాలో జేఎన్‌టీయూకు 70 ఎకరాలు
- జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ కార్యాలయాలకు భూ కేటాయింపులు
- పారదర్శకంగా జనగణన నిర్వహించేందుకు నిర్ణయం
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు

హైదరాబాద్,ఫిబ్రవరి23(జనంసాక్షి): హైదరాబాద్ మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ క్యాబినెట్ నిర్ణయించింది. ఇప్పటికే దీనిపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. స్వాధీనం చేసుకునే పక్రియను పర్యవేక్షించడానికి మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఈ కమిటీలో.. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు సభ్యులుగా ఉంటారు.. ఇకపోతే మార్చి 16 నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి. 30 వరకు ఈ సమావేశాలు జరుగుతాయి. తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించిన గవర్నర్ ప్రసంగం ఉంటుంది. 20న బడ్జెట్ ప్రవేశ పెడతారు. దీనికి కేబినేట్ ఆమోదం తెలిపింది. ఇకపోతే మెట్రోకు సంబంధించ గత ఏడాది సూత్రప్రాయంగా జరిగిన ఒప్పందంలో రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా ఎల్అండ్‌టీకి చెల్లించేలా.. రూ.13 వేల కోట్ల రుణాలను మిగతా 2లో..

## మార్చి 16 నుంచి 30 వరకు అసెంబ్లీ సమావేశాలు

## 60 ఏళ్లలోపు ఉద్యోగి చనిపోతే అదనంగా రూ.10లక్షలు

ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

2లో..

## దిగుమతులపై సుంకాల విధింపు
# నిలిపివేత

సుప్రీం తీర్పుతో దారికొచ్చిన అమెరికా ప్రభుత్వం

మంగళవారం నుంచి నిలిపివేస్తున్నట్లు ప్రకటన

అమెరికా కస్టమ్స్ శాఖ ప్రకటన విడుదల



### సుప్రీం తీర్పును అలుసుగా తీసుకుని ఆటలాడితే మళ్లీ వడ్డింపులే..

భారీగా సుంకాలు విధిస్తాం:ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి): సుంకాల విషయంలో అమెరికా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అలుసుగా తీసుకుని ఏ దేశమైనా ఆటలాడాలని చూస్తే భారీ టారిఫ్‌లు విధిస్తానని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. తీర్పు విషయంలో సుప్రీం కోర్టును మరోసారి లక్ష్యంగా మిగతా 2లో..

వాషింగ్టన్(జనంసాక్షి): దిగుమతులపై సుంకాల విధింపును మంగళవారం నుంచీ నిలిపి వేయనున్నామని అమెరికా కస్టమ్స్ శాఖ తాజాగా ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్థిక ఎమర్జెన్సీ పేరిట ట్రంప్ ప్రభుత్వం విధిస్తున్న సుంకాలు చెల్లవంటూ అమెరికా సుప్రీం కోర్టు ఇటీవల తీర్పునిచ్చిన నేపథ్యంలో యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్స్ ప్రొటెక్షన్ శాఖ ఈ ప్రకటన విడుదల చేసింది. ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనమిక్ పవర్స్ చట్టం కింద సుంకాల వసూళ్లను నిలిపివేస్తున్నట్టు తెలిపింది. అమెరికా కాలమానం ప్రకారం, మంగళవారం అర్ధరాత్రి 12.01 నుంచి ఇది అమల్లోకి వస్తుందని పేర్కొంది.సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన మూడు రోజులకు కస్టమ్స్ శాఖ ఈ ప్రకటన విడుదల చేసింది. వెంటనే సుంకాల వసూలును ఎందుకు నిలిపివేయలేదో చెప్పలేదు. ఇప్పటివరకూ వసూలు చేసిన సుంకాల డబ్బును రీఫండ్ చేయడంపై కూడా క్లారిటీ ఇవ్వలేదు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగుమతులపై కొత్తగా 10 శాతం కనీస సుంకాన్ని ప్రకటించిన విషయం మిగతా 2లో..

## ఏఐసీసీకి ఏటీఎంలా తెలంగాణ

ఈ విషయాన్నే నేడు సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఒప్పుకున్నారు: కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణను ఏఐసీసీకి ఏటీఎంలా రేవంత్ రెడ్డికి మార్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. గత రెండేళ్లుగా తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంలా మారిందని తాము గతంలో అనేకమార్లు హెచ్చరించిన విషయాన్ని నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే స్వయంగా నిస్సిగ్గుగా ఒప్పుకున్నారని కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర సంపదను కాంగ్రెస్ అధిష్టానానికి ధారపోస్తూ, తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ వీధుల్లో తాకట్టు పెడుతున్నారని ఆయన మండిపడ్డారు.రైతన్నలకు,




### నా పేరుతో ఎలాంటి సంస్థలు లేవు

అలా సంస్థలు స్థాపించి కార్యకలాపాలు నిర్వహించేందుకు ఎలాంటి అనుమతులు లేవు: కేటీఆర్

2లో..



## తేజస్ కూలినట్లు వార్తలు.. ఖండించిన 'హాల్'

న్యూఢిల్లీ(జనంసాక్షి):స్వదేశీ తయారీ యుద్ధవిమానం ఎల్‌సీఏ తేజస్ ఈ నెల 7వ తేదీన కూలినట్లు వస్తున్న వార్తలను యుద్ధ విమానాల తయారీ సంస్థ హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ఖండించింది. యుద్ధ విమానం కూలిపోలేదని.. అందులో చిన్న సాంకేతిక లోపం మాత్రమే తలెత్తిందని స్పష్టతనిచ్చింది. లోపాన్ని సరిచేయడానికి తాము భారత వైమానిక దళంతో కలిసి పని చేస్తున్నామని తెలిపింది. మిగతా 2లో..

## రాహుల్‌ను ప్రధాని చేసేందుకు సిద్ధంకండి

దేశ సమస్యలకు అదొక్కటే పరిష్కారం

- రానున్న ఎన్నికల్లో అత్యధిక ఎంపీ స్థానాలు దక్కేలా కృషి
- డీసీసీ అధ్యక్షుల శిక్షణాశిబిరంలో డిప్యూటి సీఎం భట్టి



వికారాబాద్‌బ్యూరో(జనంసాక్షి):రాహుల్ ప్రధానమంత్రి అయితేనే ఈ దేశంలోనే రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందని, ఆయనను ప్రధానమంత్రిగా చేసే వరకు రెండు రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నిరంతరం పనిచేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రెండు రాష్ట్రాల్లో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకునేలా కృషి చేయాలని డిప్యూటీ సీఎంఅన్నారు. వికారాబాద్ లో నిర్వహిస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో సోమవారం ఆయన మాట్లాడారు. కుల సమస్యలు, రిజర్వేషన్లు, కాంగ్రెస్ వాదిగా కుల వివక్ష నిర్మూలనకు ఎలా పోరాటం చేయాలన్న అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. దేశంలో అంటరానితనం, వివక్ష సమస్య ఎక్కడ ఎదురైనా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షం అవుతారని తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల కుల వివక్షను భరించలేక బలవన్మరణానికి పాల్పడితే రాహుల్ గాంధీ నేరుగా యూనివర్సిటీకి చేరుకొని విద్యార్థులతో చర్చించి పోరాట విధానాన్ని ఖరారు చేశారని తెలిపారు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలను ఎవరిని కూడా యూనివర్సిటీలోకి రానివ్వలేదు అంటరానితనం సమస్యను సమస్యగా చూడాలి తప్ప రాజకీయ మిగతా 2లో..



## లీగల్ సమస్యలతోనే గౌరవెల్లి ఆలస్యం

కాలువల భూసేకరణ పూర్తి చేసి పనులు వేగవంతం చేయాలి

ప్రాజెక్టుపై మంత్రులు ఉత్తమ్,పొన్నం సమీక్ష

హైదరాబాద్(జనంసాక్షి):అనేక కారణాలు, లీగల్ సమస్యల వల్ల గౌరవెల్లి ప్రాజెక్టు..ఆలస్యం అవుతుందని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టుపై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్.. సచివాలయంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ ప్రాజెక్టు కాలువల భూసేకరణ పూర్తి చేసి పనులు వేగవంతం చేసేలా సమీక్షా సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పొన్నం ప్రభాకర్ గౌరవెల్లి ప్రాజెక్టు కోసం తమ మీద ఒత్తిడి తీసుకొస్తున్నారని తెలిపారు. సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ మూడు జిల్లాల కలెక్టర్‌లు, రాష్ట్ర అడ్వకేట్ జనరల్, ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించామని అన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టులో లీగల్ ఇబ్బందులు ఎలా క్లియర్ చేయాలో చర్చించామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు భూసేకరణ, పనుల వేగవంతంపై ఎలా ముందుకు వెళ్లాలో చర్చించామన్నారు. భూసేకరణ విషయంలో హామీ ఇచ్చామని తెలిపారు. సంబంధిత నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చామని అన్నారు. ఈ మేరకు బుధవారం నాడు మిగతా 2లో..

## వికసిత బెంగాల్ బాధ్యత నాది

- ఆందోళన కలిగించేలా బెంగాల్‌లో చొరబాట్లు
- బంగారు బంగ్లా కలలు సాకారం చేసుకుందాం
- బెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ బహిరంగ లేఖ



న్యూఢిల్లీ(జనంసాక్షి): పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరుగనున్న వేళ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బెంగాల్ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితిపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొద్ది నెలరోజుల్లో బెంగాల్ భవితను నిర్ణయించే కీలక ఎన్నికలు జరుగనున్నాయని, భావితరాల భవిష్యత్తును నిర్ణయించే ఈ ఎన్నికల్లో ప్రజలు వివేకవంతమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. బంగారు బంగ్లా కలల సాకారానికి తాను భరోసా ఇస్తున్నానని అన్నారు. జై మహాకాళి' అంటూ ప్రధాని తన లేఖను ప్రారంభించారు. 'మరి కొద్ది నెలల్లోనే బెంగాల్ భవిష్యత్తు నిర్ణయం కోబోతోంది. మీరు తీసుకునే తెలివైన నిర్ణయం పైనే భావితరాల భవిష్యత్తు, దిశానిర్దేశర ఆధారపడి మిగతా 9లో..

## మోస్ట్ వాంటెడ్ డ్రగ్ మాఫియా డాన్ ఎల్ మెంచో హతం

- స్పెషల్ ఆపరేషన్‌లో మట్టుబెట్టిన మెక్సికో ఆర్మీ
- నిరసనగా మెక్సికోలో చెలరేగిన హింసాకాండ
- ఆ దేశంలోని భారతీయులకు అడ్వైజరీ





మెక్సికోసిటీ(జనంసాక్షి): మోస్ట్ వాంటెడ్ డ్రగ్ మాఫియా డాన్ నెమెసియో ఒసెగుయెరా అలియాస్ 'ఎల్ మెంచో' హతమయ్యాడు. ఆదివారం జరిగిన ఆపరేషన్‌లో అతడిని మట్టుబెట్టినట్లు మెక్సికో ఆర్మీ వెల్లడించింది. దీంతో ఆ దేశంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగాయి.59 ఏళ్ల ఎల్ మెంచోను పట్టుకోవడం కోసం మెక్సికో సైన్యం నిన్న ఆపరేషన్ చేపట్టింది. అమెరికా నిఘా వర్గాల సమాచారంతో జాలిస్కో రాష్ట్రంలోని తపాల్ప పట్టణంలో అతడు నక్కిన ప్రాంతాన్ని చుట్టుముట్టి సోదాలు చేపట్టింది. ఈ క్రమంలోనే మెంచో అనుచరులు కాల్పులు జరపగా.. సైన్యం ఎదురుదాడి చేసింది. ఈ భీకర ఆపరేషన్‌లో మెంచో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని పట్టుకుని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్లు మెక్సికో సైన్యం వెల్లడించింది.ఎల్ మెంచోతో పాటు అతడి ముఠాకు చెందిన మరో ఆరుగురు ఈ మిగతా 2లో..

## జంటజలాశయాల్లో కాలుష్యంపై విచారణ

నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని జలమండలికి హైకోర్టు దేశం



హైదరాబాద్(జనంసాక్షి):హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాల కాలుష్యంపై హైకోర్టులో విచారణ జరిగింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. జలాశయాల్లో మురుగు, పరిశ్రమల వ్యర్థాలు చేరి.. నీళ్లు కలుషితమవుతున్నాయంటూ వార్తాపత్రికలో వచ్చిన కథనాన్ని సుమోటోగా తీసుకున్న సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. తాగునీటి జలాశయాల్లో వ్యర్థాలు చేరడంపై ఉన్నత న్యాయస్థానం జలమండలిని ప్రశ్నించింది. జలమండలి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, నీటిపారుదల శాఖ, జీహెచ్ఎంసీని ప్రతివాదులుగా చేర్చింది. జంట జలాశయాల నిర్వహణపై 4 వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

## హైదరాబాద్‌లో చిరుజల్లులు

పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షం 9లో..

## నేపాల్‌లో ఘోర ప్రమాదం

- నదిలో పడిన బస్సు.. 18 మంది మృతి
- మరో 28 మందికి గాయాలు

## తక్షణమే ఇరాన్‌ను వీడండి

భారత్ పౌరులకు కేంద్రం అడ్వైజరీ

## కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

ముగ్గురు జైషే ఉగ్రవాదుల మృతి

సరోగసి అక్రమాలపై విచారణ

## ఈడీ కస్టడీకి డాక్టర్ నమ్రత

కోర్టు ఆదేశాలతో విచారణకు సిద్ధం

రాజమండ్రిలో పాలకల్తీతో ఘటనలో

## నలుగురు మృతి

మరో నలుగురి పరిస్థితి విషమం వివరాలు 2లో

## 60 ఏళ్లలోపు ఉద్యోగి చనిపోతే అదనంగా రూ.10లక్షలు

హైదరాబాద్(జనంసాక్షి):ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 60 ఏళ్లలోపు ఉద్యోగి చనిపోతే రెగ్యులర్ బెనిఫిట్లతో పాటు అదనంగా రూ.10 లక్షలు వచ్చేలా చర్యలు చేపట్టినట్లు ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం పలు అంశాలపై చర్చించింది. మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాకు వెల్లడించారు. “ఉద్యోగుల ఆరోగ్య భద్రత, ప్రమాదాల విషయంపై కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులు, పింఛనర్లకు భారం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. రాష్ట్రంలో 7.56 లక్షల మంది ఉద్యోగులు, పింఛనర్లు ఉన్నారు.ఉద్యోగి చనిపోతే రెగ్యులర్ బెనిఫిట్లతో పాటు అదనంగా రూ.10 లక్షలు వచ్చేలా పథకం తీసుకొస్తాం. 17.7 లక్షల మంది ఉద్యోగులు, పింఛనర్లకు డిజిటల్ హెల్త్ ఎంప్లాయ్ కార్డులు అందజేస్తాం. 1998 వ్యాధులకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 652 ఆస్పత్రుల్లో చికిత్స అందేలా ఏర్పాట్లు చేస్తాం. రాబోయే 2-3 రోజుల నుంచి ఎంప్యానల్ ఆస్పత్రుల్లో చికిత్సకు ఏర్పాట్లు చేస్తాం. ఉద్యోగుల బేసిక్ పే నుంచి 1.5 శాతం ట్రస్టుకు జమ అయ్యేలా చర్యలు చేపడతాం. ఉద్యోగుల నుంచి రూ.528 కోట్లు సేకరిస్తాం. దీనికి అదనంగా ప్రభుత్వం మరో రూ.528 కోట్లు జత చేసి.. ట్రస్టు ఖాతాలో జమ చేస్తుంది. సీఎస్, సభ్యుల ఆధ్వర్యంలో ట్రస్టు నిర్వహణ ఉంటుంది” అని మంత్రి పొంగులేటి వివరించారు.

## తమిళనాడు ఓటర్లు 5.67కోట్లు

మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించింది. గత ఎన్నికలతో పోలిస్తే 74లక్షల మంది ఓటర్లు తగ్గడం గమనార్హం.గతేడాది అక్టోబరు చివరి నాటికి రాష్ట్రంలో 6.41కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. అయితే ‘సర్’ ప్రక్రియ పూర్తయిన తర్వాత గతేడాది డిసెంబరు 19న ముసాయిదా ఓటర్ల జాబితానుఈసీ విడుదల చేసింది.

## కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

**శ్రీనగర్(జనంసాక్షి):**జమ్మూకశ్మీర్ లోని కిస్ట్‌వార్ జిల్లా లో భద్రతాబలగాలకు, ఉగ్రవాదులకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఆ ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన జైష్ ఎ మహమ్మద్ కోసం పనిచేస్తున్నారని భద్రతాబలగాలు గుర్తించాయి. మంచుతో నిండిన ఛత్రూ అడవుల్లో ఓ కొండ దిగువన గల మట్టి ఇంట్లో ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న కచ్చితమైన సమాచారం అందుకున్న భద్రతాబలగాలు.. ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి ఆ స్థావరాన్ని చుట్టుముట్టాయి. భద్రతాబలగాలు లొంగిపోవాలని హెచ్చరించగా.. తొలుత ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దాంతో భద్రతాబలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఆ ఇంట్లో దాగి ఉన్న ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. మృతి చెందిన ఉగ్రవాదుల్లో కరుడుగట్టిన ఉగ్రవాది, జేఈఎం కమాండర్ సైఫుల్లా కూడా ఉన్నట్టు అనుమానిస్తున్నారు.

## గచ్చిబౌలిలో చదరపు గజం రూ.1.76 లక్షలు

చదరపు గజం రూ.1.64 లక్షలు పలికింది. వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.34.27 కోట్ల ఆదాయం సమకూ రింది. కేపీహెచ్‌బీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఈ వేలంలో 50 మంది బిడ్డర్లు పాల్గొన్నారు.

## సరోగసి అక్రమాలపై విచారణ

హైదరాబాద్(జనంసాక్షి):సృష్టి సరోగసీ అక్రమాల కేసులో అరెస్టైన డాక్టర్ నమ్రతపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తులో మరింత వేగం పెరిగింది. ఈ కేసులో డాక్టర్ నమ్రతను ఈడీ కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల ప్రకారం రెండు రోజుల పాటు ఈడీ కస్టడీలో విచారణ జరగనుంది. ఈ కేసు సరోగసీ పేరుతో అక్రమాలు, హవాలా, మనీలాండరింగ్ ఆరోపణలతో సంబంధం ఉండటంతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. డాక్టర్ నమ్రతను ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఈడీ కోర్టును కోరింది. అయితే కేసు వివరాలను పరిశీలించిన న్యాయస్థానం.. రెండు రోజుల పాటు మాత్రమే కస్టడీకి అనుమతించింది. కోర్టు ఆదేశాల ప్రకారం మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు ఈడీ అధికారులు డాక్టర్ నమ్రతను తమ కస్టడీలోకి తీసుకుని విచారణ చేపట్టనున్నారు. ఈ రెండు రోజుల విచారణలో కేసుకు సంబంధించిన కీలక అంశాలను వెలికితీసే ప్రయత్నం చేయనున్నారు. డాక్టర్ నమ్రతపై సరోగసీ సేవల పేరుతో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. చట్టబద్ధమైన విధానాలను పాటించకుండా, అక్రమంగా సరోగసీ వ్యవస్థను ఉపయోగించి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే పలు కీలక ఆధారాలను సేకరించినట్లు సమాచారం. ఈ కేసులో ముఖ్యంగా హవాలా, మనీలాండరింగ్ అంశాలపై ఈడీ అధికారులు దృష్టి సారించారు. డాక్టర్ నమ్రత భారీ మొత్తంలో డబ్బు సేకరించి, హవాలా మార్గం ద్వారా విదేశాలకు తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో డబ్బు లావాదేవీలు, బ్యాంక్ ఖాతాలు, విదేశీ సంబంధాలు వంటి అంశాలపై ఈడీ అధికారులు సమగ్ర విచారణ చేపట్టనున్నారు. ఈడీ కస్టడీ విచారణలో.. అక్రమంగా సేకరించిన డబ్బు తరలింపు మార్గాలు, ఇందులో పాల్గొన్న ఇతర వ్యక్తులు, విదేశీ సంబంధాలు వంటి అంశాలపై కీలక సమాచారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# ఇక మెట్రో బాధ్యత తెలంగాణ సర్కారుదే..

ప్రభుత్వం బదలాయించుకునేలా అవగాహనకొచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాతే స్వాధీన ప్రక్రియ మొదలైంది. మెట్రో ఆస్తులు, వాటి విలువను ఐడీబీఐ క్యాపిటల్.. రైళ్లు, ట్రాక్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థ వంటి సాంకేతిక అంశాలపై డీఎంఆర్‌సీ మదింపు చేసి ప్రాథమిక నివేదికలిచ్చాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రోపై తెలంగాణ క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోని నిర్వహిస్తున్న ఎల్‌అండ్‌టీ నుంచి పూర్తిగా ప్రభుత్వాధీనంలోకి తీసుకునేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ప్రకారం మార్చి 31వ తేదీలోపు మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఈ టేకోవర్ మొత్తం విలువ సుమారు రూ.15,000 కోట్లుగా అంచనా వేసింది. ఇందులో మెట్రోపై ఉన్న అప్పులు రూ.13,000 కోట్లు కాగా, ఎల్ అండ్‌టీ సంస్థ ఈక్విటీ వాటా రూ.2,000 కోట్లుగా ఉంది. మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలంటే మొదటి దశ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని కేంద్ర ప్రభుత్వం షరతు విధించింది. ఈ నేపథ్యంలోనే మెట్రోను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంతో హైదరాబాద్ మెట్రో విస్తరణకు మార్గం సుగమం కానుంది. నగరంలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆధీనంలోకి మెట్రో వచ్చిన తర్వాత.. మెట్రో విస్తరణ వేగవంతం అవుతుంది. ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుంది. రవాణా వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ ఉంటుంది.

భవిష్యత్ ప్రాజెక్టులకు కేంద్ర సహాయం పొందడం సులభం అవుతుంది. ఇది నగర అభివృద్ధికి కీలక నిర్ణయంగా భావిస్తోంది. ఇకపోతే ఈ సమావేశంలో రాష్ట్ర పురోగతికి సంబంధించి పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. వైద్య విధాన పరిషత్‌లో మార్పులు , భూ కేటాయింపులపై కేబినెట్ ముద్ర వేసింది. రాష్ట్రంలోని వైద్య రంగంలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 'తెలంగాణ వైద్య విధాన పరిషత్' పేరును ఇకపై 'డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్'గా మారుస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మార్పుతో పాటు, ఇప్పటివరకు పరిషత్ పరిధిలో ఉన్న ఉద్యోగులను పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులు గా పరిగణించాలని నిర్ణయించారు. దీనివల్ల వేలమంది వైద్య సిబ్బందికి లబ్ది చేకూరనుంది. రాజకీయ పార్టీల బలోపేతానికి సంబంధించి కూడా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల నిర్మాణానికి భూమిని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.మరికొన్ని కీలక భూ కేటాయింపులపై కూడా కేబినెట్ స్పష్టతనిచ్చింది. ఖమ్మం జిల్లాలో టీటీడీ ఆలయ నిర్మాణం లేదా ఇతర ఆధ్యాత్మిక సేవల కోసం 20 ఎకరాల భూమిని కేటాయించారు. మహబూబాబాద్ జిల్లా గుమ్మడూరు లో కొత్తగా జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణానికి గాను 70 ఎకరాల భారీ కేటాయింపుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరిపాలనా సౌలభ్యం కోసం , రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం తీసుకున్న ఈ నిర్ణయాలు తక్షణమే అమలులోకి రానున్నాయి. స్వల్ప అనారోగ్యం కారణంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశానికి హాజరు కాలేదు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన జనగణనపై మంత్రిమండలి భేటీలో కీలక చర్చ జరిగింది. ఈ చర్చలో జనగణన వివరాలను తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వెల్లడించారు. రెండు దశల్లో జనగణన పక్రియ 2027 ఫిబ్రవరిలో రెండో దశ ప్రారంభం కానుంది. జనగణన కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లపై మంత్రివర్గంలో చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన జన గణన పక్రియను చేపట్టేందుకు ప్రభుత్వం కీలక ఆమోదం తెలిపింది. ఈ భారీ కార్యక్రమాన్ని రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వసన్నద్ధమవుతోంది. ఈ సమావేశంలో ముఖ్యంగా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన తొలి విడత ఇండ్ల గణన అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ రామకృష్ణరావు ఈ పక్రియకు సంబంధించిన ఏర్పాట్లను కేబినెట్‌కు వివరిస్తూ, మే 11వ తేదీన ఈ గణనను ప్రారంభించి జూన్ 9వ తేదీ వరకు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ హౌజ్ లిస్టింగ్ పక్రియ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్దేశిరచిన 34 ప్రశ్నలతో కూడిన నమూనా పత్రాన్ని ప్రభుత్వం వినియోగించనుంది. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించేందుకు సుమారు 84 వేల మంది ఎన్యుమరేటర్లను, వారికి దిశానిర్దేశర చేసేందుకు నోడల్ ఆఫీసర్లను కలిపి మొత్తం 89 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులను ఈ విధుల్లో భాగస్వాములను చేయనున్నారు. తొలి దశ విజయవంతంగా ముగిసిన తర్వాత, అసలైన రెండో దశ జన గణన పక్రియను వచ్చే ఏడాది అంటే 2027 ఫిబ్రవరిలో చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల అంచనాకు ఈ గణన ఎంతో కీలకం కానున్న నేపథ్యంలో, ఎలాంటి లోపాలు లేకుండా ఈ పక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలో ఎన్యుమరేటర్లతో పాటు నోడల్ ఆఫీసర్లు మొత్తం 89 వేల మంది ఉద్యోగులు జనగణన పక్రియలో పాలుపంచుకుంటారని తెలిపారు.

## లీగల్ సమస్యలతోనే ‘గౌరవెల్లి’ ఆలస్యం

సుప్రీంకోర్టులో ఈ ప్రాజెక్టు కేసు విచారణ ఉందని ప్రస్తావించారు. సర్వోన్నత న్యాయస్థానంలో ఎన్వీరాన్‌మెంట్ కేసు గెలుస్తామనే విశ్వాసం తమకుందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును అన్ని విధాలుగా పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టు నీళ్లు హుస్నాబాద్ నియోజకవర్గానికి రావడానికి కావల్సిన పెండింగ్ పనులు పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, కరీంనగర్, సిద్దిపేట, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్ అధికారులు, ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఏఐసీసీకి ఏటీఎంలా తెలంగాణ

మహిళలకు, యువతకు, ఉద్యోగులకు మరియు రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చిన 420 హామీల అమలు విషయానికి వస్తే ప్రభుత్వం వద్ద రూపాయి నిధులు లేవని సాకులు చెబుతున్నారని కేటీఆర్ విమర్శించారు. అభివృద్ధికి నిధులు లేవంటున్న సర్కారు, కేవలం రెండేళ్ల కాలంలోనే మూడు లక్షల కోట్ల రూపాయల భారీ అప్పులు తెచ్చిందని, కానీ రాష్ట్రంలో కనీసం ఒక్క ఇటుక కూడా పేర్చిన దాఖలాలు లేవని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజల సొమ్మును ప్రజా ప్రయోజనాలకు వాడకుండా పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు.రాష్ట్రంలో సాగుతున్న భూ దోపిడీపై స్పందిస్తూ, మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇళ్లను, లగచర్లలో గిరిజనుల భూములను, చివరకు హెచ్‌సీయూ విశ్వవిద్యాలయ భూములను కూడా వదలడం లేదని కేటీఆర్ పేర్కొన్నారు. హిల్ట్ పాలసీ పేరిట పరిశ్రమల భూములను ‘అనుముల బ్రదర్స్’ కలిసి అంబుక్క పడుతున్నారని, ఒక పద్ధతి ప్రకారం రాష్ట్ర వనరులను లూటీ చేస్తున్నారని విమర్శించారు.ప్రస్తుత పాలనను ‘దండుపాళ్యం ముఠా’ తీరుతో పోల్చిన కేటీఆర్, తెలంగాణను దోచుకోవడం, సొంతానికి దాచుకోవడం మరియు తన పదవిని కాపాడుకోవడం కోసం ఢిల్లీకి సంచులు మోయడమే రేవంత్ రెడ్డి ఏకైక అజెండా అని ధ్వజమెత్తారు. ప్రజల కష్టార్జితాన్ని దారి మళ్లిస్తూ రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

## నా పేరుతో ఎలాంటి సంస్థలు లేవు

హైదరాబాద్(జనంసాక్షి):తన పేరుతో ఎలాంటి సంస్థలు లేవని, అలా సంస్థలు స్థాపించి కార్యకలాపాలు నిర్వహించేందుకు ఎలాంటి అనుమతులు లేవని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. కొంతమంది 'కేటీఆర్ సేవా సమితి', 'కేటీఆర్ సేన' లాంటి పేర్లతో సంస్థలను ఏర్పాటు చేసి కార్యకలాపాలు చేపడుతున్నట్లు తెలిసిన నేపథ్యంలో ఆయన పైవిధంగా స్పందించారు. 'నా పేరుతో ఎలాంటి సంస్థలకు అనుమతి లేదు. అలాంటి ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించబోం' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎవరైనా సేవా దృక్పథంతో పనిచేయాలనుకుంటే కచ్చితంగా భారత రాష్ట్ర సమితి పరిధిలోనే పనిచేయాల్సి ఉంటుందని స్పష్టంచేశారు.

## నేపాల్‌లో ఘోర ప్రమాదం

ఖాట్మండు(జనంసాక్షి):నేపాల్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ధాడింగ్ జిల్లాలో ఓ ప్రయాణికుల బస్సు లోయలో పడి 18 మంది మృతిచెందారు. మరో 28 మంది గాయపడ్డారు. పొఖారా నుంచి కాఠ్‌మాండూ వెళ్తుండగా సోమవారం తెల్లవారుజామున ఈ దుర్ఘటన జరిగింది. బస్సు అదుపుతప్పి త్రిశూలీ నదిలోకి దూసుకెళ్లింది.ప్రమాద సమయంలో బస్సులో 45 మందికి పైగా ప్రయాణికులున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో విదేశీయులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదు. అయితే, అతివేగం వల్లే ఈ ఘటన జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

## తేజస్ కూలినట్లు వార్తలు.. ఖండించిన ‘హాల్’

త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపింది. ప్రపంచంలోనే అత్యుత్తమ భద్రతా యుద్ధ విమానాల్లో ఒకటిగా తేజస్‌కు రికార్డు ఉందని పేర్కొంది. ఫైటర్ జెట్‌లోని బ్రేకింగ్ వ్యవస్థలో సమస్య కారణంగా.. సరిహద్దులకు అత్యంత సమీపంలోని వాయుసేన ఎయిర్‌బేస్‌లో రన్‌వేపై తేజస్ విమానం అదుపు తప్పినట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ప్రమాదంలో యుద్ధవిమానం కూడా దెబ్బతిన్నట్లు పేర్కొన్నాయి. దీంతో భారత వాయుసేన ముందు జాగ్రత్త చర్యగా ఈ ఫైటర్ జెట్లను పక్కనపెట్టినట్లు ఆంగ్లవార్తా ఏజెన్సీ పీటీఐ పేర్కొంది. ఇదీ చదవండి: దేశీయంగా కేసీ-390 విమానాల తయారీ!

## రాజమండ్రిలో పాలకల్తీతో ఘటనలో నలుగురు మృతి..

రాజమహేంద్రవరం(జనంసాక్షి): రాజమహేంద్రవరంలో కిడ్నీ సమస్యలతో ఆస్పత్రుల్లో చేరిన వారిలో మరో ఇద్దరు మృతిచెందారు. దీంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. చికిత్స పొందుతూ లాలాచెరువు చౌడేశ్వరినగర్‌కు చెందిన ఎన్.శేషగిరిరావు (72), రాధా కృష్ణమూర్తి (74) సోమవారం ఉదయం చనిపోయారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. వీరంతా పాలు కల్తీ కావడంతో మరణించారని తెలుస్తోంది. దీంతో పాలు పోసే వ్యక్తి గాణెళిశ్‌ను అరెస్ట్ చేశారు. పాలను పరీక్షలకు పంపారు. రాజమహేంద్రవరంలోని ఒకే ప్రాంతానికి చెందిన పలువురు కిడ్నీ వ్యాధి బారిన పడి ఆస్పత్రుల్లో చేరడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగిన సంగతి తెలిసిందే. లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వరినగర్ పరిసర ప్రాంతాల్లో ఈ నెల 15 తర్వాతి నుంచి వాంతులవడం, మూత్రవిసర్జన కాకపోవడం, పొట్ట ఉబ్బడం తదితర సమస్యలతో ఒక్కొక్కరుగా 14 మంది ఆసుపత్రిలో చేరారు. వీరిలో భాగిశెట్టి కనకరత్నం (76), తాడి కృష్ణవేణి (75) ఇప్పటికే మృతిచెందారు. బాధితుల్లో ఎక్కువ మంది 60 ఏళ్లు పైబడినవారే కాగా 5 నెలల శిశువు, మూడేళ్ల బాలుడు కూడా ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అనారోగ్యానికి గురవడంతో వారు అధికారులకు సమాచారం ఇచ్చారు.

# దిగుమతులపై సుంకాల విధింపు నిలిపివేత

తెలిసిందే. తాజాగా దాన్ని 15 శాతానికి పెంచారు. ఐఈఈపీఏ చట్టానికి బదులు వాణిజ్య చట్టం-1974లోని సెక్షన్ 122 కింద సర్‌చార్జ్ పేరిట ఈ సుంకాలకు తెరతీశారు. అయితే, అమెరికా చట్టసభల అనుమతి లేనిదే వీటిని కూడా 150 రోజులకు మించి పొడిగించే అవకాశం లేదు. ఇక జాతీయ భద్రత పేరిట స్టీల్, అల్యూమినియం, సెమీకండక్టర్స్, ఆటో రంగాలపై గతంలో విధించిన సుంకాలనూ ట్రంప్ కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శాశ్వత ప్రాతిపదికన సుంకాలు విధించేందుకు మార్గాలను అన్వేషించాలని వాణిజ్య విభాగానికి ఆయన సూచించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇకపోతే సుంకాల విధింపు చెల్లదంటూ అమెరికా సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వానికి కొత్త చిక్కులు మొదలయ్యాయి. సుంకాల వల్ల ఇప్పటివరకూ అధిక ధరలు చెల్లించిన అమెరికన్ కస్టమర్లు తమకు రీఫండ్స్ కావాలని పట్టుబడుతున్నారు. ఈ జాబితాలో ట్రంప్ రాజకీయ ప్రత్యర్థులతో పాటు కార్పొరేట్ కంపెనీలు కూడా ఉన్నాయి. అయితే, ఈ పక్రియ అంత సులభం కాదని అక్కడి నిపుణులు చెబుతున్నారు.తాను విధించిన సుంకాల భారం విదేశీ ఎగుమతిదారులపై తప్ప సామాన్య అమెరికన్లు, అమెరికా దిగుమతి దారులపై లేదని ట్రంప్ ఇప్పటివరకూ చెబుతూ వచ్చారు. అయితే, ఆయన రాజకీయ ప్రత్యర్థులు మాత్రం ఈ వాదనతో మొదటి నుంచీ విభేదిస్తున్నారు. అధిక సుంకాల భారాన్ని సామాన్య అమెరికన్లే భరించాల్సి వచ్చిందని మండిపడేవారు. ఇక సుప్రీం తీర్పు తరువాత ఇల్లినాయ్ రాష్ట్ర గవర్నర్ సుంకాల రీఫండ్స్ కోరుతూ ట్రంప్‌నకు బిల్లులు పంపించారు. సుంకాల కారణంగా తమ రాష్ట్రం 9 బిలియన్ డాలర్లు అధికంగా చెల్లించాల్సి వచ్చిందని అన్నారు. తమ రాష్ట్రంలోని ఒక్కో కుటుంబంపై సగటున 1,700 డాలర్ల అదనపు భారం పడిందని అన్నారు. ఇక కార్పొరేట్ కంపెనీలు కూడా రీఫండ్స్‌కు సిద్ధమవుతున్నాయి. కాస్ట్‌కో, రెవ్లాన్ వంటి పలు సంస్థలు ఇప్పటికే కేసులు దాఖలు చేశాయి. ఇప్పటివరకూ ట్రంప్ ప్రభుత్వం సుంకాల పేరిట 133 బిలియన్‌ల నుంచి 175 బిలియన్ డాలర్ల మేర వసూలు చేసి ఉంటుందని అమెరికా వర్గాలు భావిస్తున్నాయి. సుంకాల డబ్బులో ఎంతో కొంత తిరిగిస్తామని ట్రంప్ వర్గం ఇప్పటికే పలుమార్లు తెలిపింది. అయితే, ఇది అంత ఆషామాషీ వ్యవహారం కాదని అక్కడి నిపుణులు చెబుతున్నారు. సామాన్య ప్రజలకు నేరుగా రీఫండ్స్ అందే అవకాశాలు తక్కువని ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్ కూడా పేర్కొన్నారు. రీఫండ్స్‌లో అధికభాగం దిగుమతిదారులు, అమెరికన్ కంపెనీలకే వెళుతుందని చెబుతున్నారు. విదేశీ ఉత్పత్తుల దిగుమతి సమయంలో వీరే కస్టమ్స్ శాఖకు నేరుగా సుంకాల రూపంలో అధిక ధరలను చెల్లించారని వివరిస్తున్నారు. రీఫండ్స్ పక్రియ కూడా సంక్లిష్టంగా ఉంటుందని ఇప్పటికే జస్టిస్ ఏమీ కోనీ బేరెట్, జస్టిస్ బ్రెట్ కేవనా హెచ్చరించారు. ఈ విషయంలో కోర్టు కేసులు కొలిక్కి వచ్చేసరికి రెండు నుంచి నాలుగేళ్ల సమయం పడుతుందని ట్రంప్ కూడా ఇటీవల ఓ సందర్భంలో స్వయంగా అంగీకరించారు. వేల కొద్ది దిగుమతిదారుల రీఫండ్స్ అభ్యర్థనలను పరిశీలించడం కస్టమ్స్ శాఖకూ భారంగా మారుతుందని అంటున్నారు. ఇక అంతర్జాతీయ స్థాయిలో కూడా ట్రంప్ సర్కారు పలు కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాణిజ్య నిపుణులు చెబుతున్నారు. న్యూయార్క్ ఫెడ్, జేపీ మోర్గన్, కీల్ ఇన్‌స్టిట్యూట్ అంచనా ప్రకారం, కస్టమ్స్ శాఖ వసూలు చేసిన సుంకాల్లో 90 నుంచి 96 శాతం అమెరికన్ల జేబుల్లోంచే వెళ్లాయి. భారత్, చైనా, మెక్సికో లాంటి దేశాలు తమ ఉత్పత్తుల ధరల తగ్గింపు రూపంలో 4-10 శాతం మాత్రమే సుంకాల భారాన్ని భరించాయి.

### సుప్రీం తీర్పును అలుసుగా తీసుకుని ఆటలాడితే మళ్లీ వడ్డింపులే..

చేసుకున్నారు. తెలియకుండానే తనకు మరిన్ని అధికారాలు కట్టబెట్టిందని పేర్కొన్నారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో వరుస పోస్టులు పెట్టారు.“సుప్రీంకోర్టు తీర్పును అలుసుగా తీసుకుని ఆటలాడాలని చూసే దేశాలపై ఎన్నడూలేని రీతిలో సుంకాలు విధిస్తా. అమెరికాను దశాబ్దాలుగా కొల్లగొట్టిన దేశాలు.. ఇటీవల అంగీకరించిన దానికంటే భారీ సుంకాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. జాగ్రత్త! సుంకాల ఆమోదం పొందడానికి అధ్యక్షుడిగా నేను కాంగ్రెస్‌కు తిరిగి వెళ్లాల్సిన అవసరం లేదు” అంటూ ట్రంప్ హెచ్చరించారు.“అనేక ఏళ్లుగా అమెరికాను కొల్లగొట్టిన దేశాలపై ఇప్పుడు లైసెన్స్‌ల రూపంలో కఠిన చర్యలు తీసుకోవచ్చు. అయితే.. ఈ లైసెన్స్‌లకు ఫీజు వసూలు చేయడం కుదరదని తీర్పు చెబుతోంది. వాస్తవానికి ప్రతి లైసెన్స్‌కు ఒక ఫీజు ఉంటుంది. మరి మేం ఎందుకు వసూలు చేయకూడదు? అదేవిధంగా కోర్టు ఇతర సుంకాలను ఆమోదించింది. ఇప్పుడు వాటిని చట్టబద్ధంగా, కఠినమైన రీతిలో ఉపయోగించగలను. ఏదేమైనా.. కోర్టు తప్పుడు వ్యక్తులకు సాయం చేసింది. మున్ముందు ‘జన్మతః పౌరసత్వం’ విషయంలోనూ వ్యతిరేక తీర్పు ఇవ్వొచ్చేమో! ఇలాంటి తీర్పులు చైనా, ఇతర దేశాలకే ప్రయోజనాలు చేకూరుస్తాయి” అని మండిపడ్డారు.‘అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టం’ (ఐఈఈపీఏ)ను ఉపయోగించి ప్రపంచ దేశాలపై ట్రంప్ ఏకపక్షంగా టారిఫ్‌లు విధించడాన్ని అమెరికా సుప్రీంకోర్టు ఇటీవల తీవ్రంగా తప్పుబట్టిన సంగతి తెలిసిందే. అమెరికా కాంగ్రెస్ అనుమతి లేకుండా వేసిన ఈ సుంకాలు చెల్లవంటూ తీర్పు వెలువరించింది.

# డ్రగ్ మాఫియా డాన్ ‘ఎల్ మెంచో’ హతం

ఆపరేషన్‌లో మరణించినట్లు అక్కడి సైన్యం తెలిపింది. ఈ ఘటనతో మెక్సికోలోని పలు రాష్ట్రాల్లో హింసాత్మక ఆందోళనలు చెలరేగాయి. మాఫియా డాన్ అనుచరులు పలు ప్రాంతాల్లో వాహనాలను తగలబెట్టారు. రహదారులను దిగ్బంధించారు. సూపర్ మార్కెట్లు, బ్యాంకులను తగలబెట్టారు.ఎల్ మెంచో 2009లో జాలిస్కో న్యూజనరేషన్ కార్టెల్ అనే మాదకద్రవ్యాల ముఠాను ఏర్పాటు చేశాడు. గత దశాబ్ద కాలంలో మెక్సికోలో అత్యంత శక్తిమంతమైన నేర సిండికేట్‌గా మారాడు. అమెరికాకు ప్రధాన డ్రగ్స్ అక్రమ రవాణాదారుగా ఎదిగాడు. జాలిస్కో కార్టెల్‌ను అగ్రరాజ్యం ఉగ్ర సంస్థగా పరిగణించింది. మెంచో తలపై 15 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.136 కోట్లు) రివార్డు ప్రకటించింది. తాజా పరిణామాలపై వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ స్పందించారు. “ఎల్ మెంచోను పట్టుకోవడం కోసం మెక్సికో ప్రభుత్వానికి అమెరికా ఇంటెలిజెన్స్ సహకారం అందించింది. అతడు మా దేశానికి ఫెంటనిల్‌ను అక్రమంగా తరలిస్తున్నాడు. ఇలాంటి నార్కో టెర్రరిస్ట్‌లను అగ్రరాజ్యం ఎన్నటికీ సహించబోదు” అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

**భారత్ అడ్వైజరీ..**

మెక్సికోలో అల్లర్ల నేపథ్యంలో అక్కడి భారత పౌరులకు మన ప్రభుత్వం అడ్వైజరీ జారీ చేసింది. ప్రస్తుత హింసాత్మక పరిస్థితుల దృష్ట్యా మెక్సికోలోని భారత పౌరులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. తదుపరి నోటీసులు ఇచ్చేంత వరకు షెల్టర్లలోకి వెళ్లిపోవాలని పేర్కొంది. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, స్థానిక అధికారుల అప్‌డేట్లను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని తెలిపింది. సాయం కోసం ఎంబసీని సంప్రదించాలని సూచించింది.

పోలీసు నుంచి డ్రగ్ డాన్‌గా..

డ్రగ్ మాఫియా కింగ్, కరడుగట్టిన నేరస్థుడు ‘ఎల్ మెంచో’ మృతితో మెక్సికో అట్టుడుకుతోంది. తమ నాయకుడిని చంపేశారన్న కోపంతో అతడి ముఠా సభ్యులు హింసకు దిగారు. దుకాణాలకు నిప్పంటించడం, వాహనాలను దగ్ధం చేయడం వంటి ఘటనలతో మెక్సికో (ఓవలీతిఇనీ) అల్లకల్లోలంగా మారింది.

ఇంతకీ ఎవరీ ‘ఎల్ మెంచో’ ఎల్ మెంచో అసలు పేరు నెమెసియో ఒసెగుయెరా సెర్వాంటెస్. 1966లో మిచోకాన్‌లోని ఓ మారుమూల గ్రామంలో పుట్టాడు. ఈ ప్రాంతంలో అవకాడోతో పాటు గంజాయి, నల్లమందు వంటివి ఎక్కువగా సాగు చేస్తుంటారు. చిన్నతనంలో అవకాడో పొలాల్లో పనిచేసిన మెంచో.. ఆ తర్వాత 1980ల్లో అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించాడు. కాలిఫోర్నియాలో హెరాయిన్ సరఫరా చేస్తూ అగ్రరాజ్య పోలీసులకు దొరికిపోయాడు. కొన్నేళ్ల పాటు జైలుశిక్ష అనుభవించిన అనంతరం అతడిని అమెరికా యంత్రాంగం మెక్సికోకు అప్పగించింది. స్వదేశానికి వచ్చిన తర్వాత కొంతకాలం పాటు పోలీసుగా పనిచేశాడు. ఆ సమయంలో డ్రగ్ మాఫియా కాంటాక్టులు తెలుసుకుని మాదకద్రవ్యాల అక్రమ రవాణా వ్యాపారంలోకి అడుగుపెట్టాడు.

రక్త చరిత్రతో నేర సామ్రాజ్యం..

తొలుత మెక్సికోలో శక్తిమంతమైన సినావోలా డ్రగ్ కార్టెల్‌కు చెందిన ముఠాలో పనిచేశాడు. కొన్నేళ్ల తర్వాత అక్కడి నుంచి బయటకువచ్చి 2009లో సొంతంగా జాలిస్కో న్యూజనరేషన్ కార్టెల్‌ను ఏర్పాటు చేశాడు. ఈ ముఠా గత కొన్నేళ్లుగా అమెరికాకు ఫెంటనిల్ వంటి ప్రమాదకర మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేస్తోంది. డ్రగ్ సరఫరా ఒక్కటే కాదు.. ఈ ముఠా దోపిడీలు, కిడ్నాప్‌లు, హత్యల వంటి అనేక నేరాలకు పాల్పడింది. 2015లో కేవలం ఆరు వారాల వ్యవధిలోనే 20 మందికి పైగా పోలీసులను తలలు నరికి అత్యంత దారుణమైన రీతిలో చంపేసింది.

కన్పించకుండానే భయపెడుతూ..

డ్రగ్ కింగ్‌పిన్ ‘ఎల్ చాపో’ తర్వాత మెక్సికోలో అత్యంత శక్తిమంతమైన క్రిమినల్ బాస్‌గా ‘ఎల్ మెంచో’ మారాడు. అయితే, చాపో తరహాలో మీడియా సెలబ్రిటీ కాకుండా.. అజ్ఞాతంలో ఉంటూ తన నేర సామ్రాజ్యాన్ని విస్తరించాడు. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో దాక్కొనేవాడు. గతంలో రెండుసార్లు అతడిని పట్టుకునేందుకు మెక్సికో దళాలు ప్రయత్నించగా.. చిక్కినట్లే చిక్కి చేజారిపోయాడు. సామాజిక మాధ్యమాల్లో వీడియోలు విడుదల చేస్తూ అధికారులు, శత్రువులను భయపెట్టేవాడు.

## రాహుల్‌ను ప్రధాని చేసేందుకు సిద్ధం కండి

జోక్యం ఉండకూడదన్నది ఆయన ఆలోచన అని వివరించారు. ఆయన ఆలోచన మేరకు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో రోహిత్ వేముల చట్టం తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం రాగానే వనరులు సంపద సమానంగా పంచుతామని ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ప్రకటించారు ఆయన ప్రకటించినట్టుగా అధికారంలోకి రాగానే ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. దేశ స్వాతంత్రం అనంతరం ఎక్కడా జరగని కుల గణనను ప్రజా ప్రభుత్వం 50 రోజుల్లో పూర్తి చేసి శాసనసభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం పొందాలని వివరించారు.దేశానికి స్వాతంత్రం సాధించడంతోపాటు ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధించేందుకు అనేక విప్లవాత్మక చట్టాలు చేసిన కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని తెలిపారు. స్వాతంత్రం ముందు నుంచి దేశంలోని రుగ్మతల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న కాంగ్రెస్ పార్టీని దేశంలో లేకుండా చేసేందుకు బీజేపీ కాంగ్రెస్ ముక్తభారత్ చేస్తాం, రాజ్యాంగాన్ని మారుస్తాం అంటుంది అన్నారు. ఈ సమాజం సామాజికంగా, ఆర్థికంగా విభజన జరిగి ఇలాగే ఉండాలని కొన్ని రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయని తెలిపారు. కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవం, తాను కుల వివక్షణ ఎదుర్కొన్నానని వివరించారు. ఈ సమాజంలో కుల వివక్ష ఉంటుంది అన్న వాస్తవాన్ని మదిలో పెట్టుకుని బలమైన సంకల్పంతో అనుకున్న లక్ష్య సాధనకు ముందుకు పోతున్న క్రమం లో వివక్ష ఎదురైన అది మన లక్ష్యాలను దెబ్బతీయలేదని వివరించారు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ఒక రాజకీయ పార్టీగా మాత్రమే కాదు దేశంలో అంటరానితనం, బాల్య వివాహం, వితంతు వివాహం వంటి అనేక రుగ్మతలపై దశాబ్దాలుగా ప్రజలను చైతన్యం చేస్తూ ముందుకు పోతుందని తెలిపారు. దేశ స్వాతంత్ర సంగ్రామం ఒకవైపు, సామాజిక అంశాలపై ఆందోళనలో మరోవైపు ఈ దేశంలో రెండు అంశాలను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లిందని

## తక్షణమే ఇరాన్‌ను వీడండి..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**

ఇరాన్‌లో మరోసారి ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఏ క్షణమైనా అమెరికా దాడి చేయొచ్చన్న అంచనాలు, విద్యార్థుల ఆందోళనలతో పరిస్థితులు మళ్లీ గందరగోళంగా మారాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని భారత పౌరులకు మన దేశ ఎంబసీ తాజాగా అడ్వైజరీ జారీ చేసింది. తక్షణమే ఆ దేశాన్ని వీడాలని సూచించింది.“ఇరాన్‌లో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా.. జనవరి 5న భారత ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు కొనసాగింపుగా మళ్లీ అడ్వైజరీ జారీ చేస్తున్నాం. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారతీయులు (విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు, పర్యాటకులు) కమర్షియల్ విమానాలతో సహా అందుబాటులో ఉన్న ప్రయాణ మార్గాల ద్వారా ఇరాన్‌ను తక్షణమే విడిచిపెట్టి వెళ్లండి. భారతీయ పౌరులు, భారత సంతతి వ్యక్తులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించండి. ఆందోళనలు జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండండి. ఇరాన్‌లోని భారత ఎంబసీతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ ఉండాలని, అలాగే తాజా పరిణామాల కోసం స్థానిక మీడియాను గమనిస్తూ ఉండాలని సూచిస్తున్నాం.

# బ్రిడ్జిపై నుంచి బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

- 25 మంది ప్రయాణికులకు గాయాలు
- ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** ఆదిలాబాద్ నుంచి ఆసిఫాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్ ప్రెస్ బస్సు సోమవారం ఉదయం ఉట్నూర్ మండలం వైపు వెళ్తుండగా శ్యాంపూర్ శివారు ప్రాంతం లోగల రోడ్డు వద్ద బ్రిడ్జి పైనుంచి అదుపు తప్పి ఒక్కసారిగా బస్సు కింద పడి ఈప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాద సమయంలో బస్సులో 25 మంది వరకు ప్రయాణీకులు ఉన్నారు. డ్రైవర్ తో సహా బస్సులో ఉన్న వారందరూ కింద పడిపోయి తీవ్రగాయాలపాలయ్యారు. వెంటనే స్థానికులు సమాచారం 108 కి అందించడంతో వాహనం అక్కడకు చేరుకుని తీవ్రంగా గాయ పడిన క్షతగాత్రులను సిబ్బంది సహాయంతో వాహనంలో తీసుకెళ్ళి ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. కాగా బస్సు ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

# నడిగడ్డను నట్టేట ముంచారు

- అప్పుడు బీఆర్ఎస్ మోసం.. ఇప్పుడు కాంగ్రెస్ దగా
- కొత్త రాజకీయ శక్తి నడి గడ్డకు నీళ్లు తీసుకొచ్చే వజ్రాయుధం
- రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో జాగృతి పోటీ
- గద్వాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నడు నీయ్యత్ ఉంటే రాజీనామా చెయాలి
- గద్వాల రైతు సంఘర్షణ సభలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**గద్వాల (జనంసాక్షి) :** పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ, ఇప్పుడు పాలిస్తున్న నడిగడ్డను నిండా మోసం చేశాయని మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా అదే బాటలో నడుస్తోంది. ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. నీతి నిజాయితీ ఉంటే ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలన్నారు. ఇక్కడ అత్తా లేదా అల్లుడే ఎమ్మెల్యేలుగా ఉంటున్నారని అన్నారు. తాము ఒక ఆయుధాన్ని నూరుతున్నామని, కొత్తగా వచ్చే రాజకీయ శక్తి నడిగడ్డకు వజ్రాయుధమైతుందని అన్నారు. ఇక్కడి నుంచే మార్పు మొదలైతదని అన్నారు. రంజిత్ ఎమ్మెల్యే కావడం పక్కా అన్నారు. గద్వాలలో సోమవారం నిర్వహించిన రైతు దీక్షలో కల్వకుంట్ల కవిత మాట్లాడారు. త్వరలో జరగబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో జాగృతి అభ్యర్థులు బరిలో ఉంటారని, వారిని గెలిపించాలని కోరారు. 'ఎలక్షన్ అనంగానే అత్త, అల్లుడు వస్తరు.. మూటలు ముల్లెలు తీసుకొని దిగుతరు.. మీ నెత్తి కొట్టి సంపాదించనవే.. ఓటు మాత్రం జాగృతికి, రంజిత్ చెప్పిన మనుషులకు ఓటు వేయాలి' అని అన్నారు. జాగృతి పార్టీ ఆవిర్భవించక ముందే నారాయణపేట జిల్లాలో సర్పంచ్ పదవిని గెలుచుకుందని కవిత చెప్పారు. వడ్డేపల్లి మున్సిపాలిటీనే కైవసం చేసుకుందని సంతోషం వ్యక్తం చేశారు. ' వాళ్లు మనతో ఉన్నారా లేదా..? అనేది లెక్క కాదు.. వడ్డేపల్లిలో జాగృతి జెండా ఎగురంగానే సీఎం పిలిచి వాళ్లకు కండువాలు కప్పిండు..' అంటే గెలిచింది మనమే అన్నారు.

గద్వాల ఎమ్మెల్యే బీఆర్ఎస్ నుంచి గెలిచారని, నీయత్ ఉంటే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈయన నెలనెలా చందాలు ఇస్తున్నానని చెబుతున్నారని, ఈయన ఎట్ల ఇస్తుండు.. వాళ్లు ఎట్ల తీసుకుంటారని ప్రశ్నించారు. కృష్ణ, తుంగభద్ర నీళ్లు మన చేలకు చేరాలనే ఆకాంక్షతోనే జాగృతి పోరాడుతుందని ఆమె తెలిపారు. రాష్ట్రంలో 15 లక్షల మందికి కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయలేదని కవిత అన్నారు. ఎవరైనా ఇద్దరు అన్నలకే భయపడతారని, ఒకటి అడవిలో ఉండే అన్నలకు... రెండోది రైతన్నలకు అని అన్నారు. ఈ ప్రభుత్వానికి రైతులంటే లెక్కే లేదన్నారు. యూరియా కోసం యాప్?లో బుక్ చేసుకోవాలని చెబుతున్నారని, రైతుల దగ్గర ఆ ఫోన్లు ఉండవని అన్నారు. ఇందుకోసం ప్రభుత్వమే రైతులకు ఐఫోన్లు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. రైతు భరోసా ఎన్నికలకోసం ఇచ్చే గిఫ్ట్?లా తయారైందని అన్నారు. ఎన్నికలప్పుడే సీఎంకు రైతులు గుర్తొస్తున్నారని అన్నారు.

# పెండింగ్ లేకుండా సీఎంపీఎఫ్ సేవలు

- సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ హరి పచౌరి



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 23 (జనంసాక్షి) :** పెండింగ్ లేకుండా సిఎంపిఎఫ్ సేవలను త్వరితగతిన ఉద్యోగులకు అందించేందుకు కృషి చేస్తున్నామని సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ హరి పచౌరి అన్నారు. సోమవారం గోలేటి లోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్ లో ప్రయాస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎంపీఫ్ రీజినల్ కమిషనర్ హరి పచౌరి మాట్లాడుతూ సిఎంపీఎఫ్ లావాదేవీలు అన్ని సికేర్స్ (సి - కేర్స్ ) పోర్టల్ ద్వారా మాత్రమే జరుగుతున్నాయన్నారు. ఉద్యోగులు ఎలాంటి మధ్యవర్తులు లేకుండా సిఎంపీఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చని తెలిపారు. సిఎంపీఎఫ్ బెనిఫిట్స్ కు అర్హులు, పెన్షన్, రివైస్డ్ పెన్షన్ పట్ల అవగాహన కల్పించారు. ఉద్యోగుల సందేహాలకు సమాధానం ఇచ్చారు. పెన్షన్, సిఎంపీఎఫ్ దరఖాస్తులు పెండింగ్ ఉండకుండా చర్యలు చేపట్టామన్నారు. జీరో పెండింగ్ స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని చెప్పారు. నామిని పేర్లలో వ్యత్యాసం వచ్చిన సందర్భాల్లో ధ్రువీకరించే విధానంపై అవగాహన కల్పించారు. సిఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ హరి పచౌరి ఈ నెలలో పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా ఇంచార్జి జిఎం మచ్చగిరి నరేందర్ అధికారులతో కలిసి ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ కమిషనర్-2 గోవర్ధన్, డివైపీఎం ఎస్వి రాజేశ్వర్ రావు, సీనియర్ పర్సనల్ అధికారులు ఎం శ్రీనివాస్, డి ప్రశాంత్, సిఎంపీఫ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఢిల్లీకి మూటలు పంపేందుకే సీఎం దేవాదుల పర్యటన

- మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య




**హనుమకొండ ప్రతినిధి ఫిబ్రవరి 23 (జనంసాక్షి) :** ప్రాజెక్టు వ్యయం పెంచి కాంట్రాక్టర్లను మభ్యపెట్టి రూ.1000 కోట్ల నిధులను ఢిల్లీకి పంపేందుకే సీఎం రేవంత్ రెడ్డి దేవాదుల ప్రాజెక్టును సందర్శించారని తెలంగాణ మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య ఆరోపించారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్య వినయ్ భాస్కర్ తో కలిసి తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి మాటలు జోకర్ మాటలా ఉన్నాయని అన్నారు. హరీష్ రావు వచ్చిన 24 గంటలు దాటక ముందే భయపడి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో కలిసి వచ్చి వరంగల్ పర్యటన చేశారని అన్నారు. ఎమ్మెల్యే, మంత్రులు, ముఖ్యమంత్రి మాటలకు పొంతన లేకుండా ఎవరిష్టం వచ్చినట్టు వారు మాట్లాడుతున్నారని అన్నారు.ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్ మాట్లాడుతూ గతంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి మిగతా మంత్రులతో కలిసి వచ్చి దేవాదుల పర్యటించి గాలి మాటలు చెప్పి గాలిలో పోయారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు హరీష్ రావు పర్యటించిన 24 గంటలు గడవక ముందే ముఖ్య మంత్రి మంత్రులతో కలిసి వచ్చి దేవాదుల ప్రాజెక్టు పైన మాయమాటలు చెప్పి మరోసారి ఈ ప్రాంత ప్రజలను మోసం చేసేందుకు చూస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 30 వేల ఎకరాలను ప్రాజెక్టు నిర్మాణం కోసం భూసేకరణ చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తి అయిన కేవలం 3000 ఎకరాల భూసేకరణ కూడా చేయలేకపోయిందని విమర్శించారు. ఈ ప్రాంత ప్రజల మీద ఎలాంటి ప్రేమ లేని రేవంత్ రెడ్డి కేవలం ప్రాజెక్టు అంచనాలు పెంచి ఆ నిధులను ఢిల్లీకి పంపేందుకు మాత్రమే పర్యటించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కూడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, కార్పొరేటర్ సోదా కిరణ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకన్న, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, బీఆర్ఎస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పసుపు బోర్డుకు నిధులేవీ?

- టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి



**హైదరా బాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రం లోని నిజామా బాద్‌లో పసుపు బోర్డును కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ ఇటీవల పార్లమెంటులో ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో పసుపు బోర్డుకు నిధుల కేటాయింపులు జరుపకపోవడం శోచనీయమనీ టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ రైతాంగానికి తీవ్ర అన్యాయం జరిగిందనీ, తెలంగాణ రాష్ట్రానికి పసుపు బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ కేంద్ర బడ్జెట్లో పసుపు బోర్డుకు నిధుల కేటాయింపు పై ఏమాత్రం స్పష్టత లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి అధికంగా పన్ను చెల్లిస్తున్న తెలంగాణ రాష్ట్రానికి నిధుల కేటాయింపుల్లో పూర్తిగా మొండి చెయ్యి చూపిందన్నారు. పసుపు బోర్డు ప్రారంభోత్సవం సందర్భంగా రూ.10 వేల కోట్ల ఎగుమతులకు అవకాశాలు కల్పిస్తామని స్వయంగా కేంద్ర మంత్రి వెల్లడించినప్పటికీ, ఆ దిశగా చర్యలు శూన్యమని, ఈ ఏడాదిలో కేంద్ర బడ్జెట్లో పసుపు బోర్డుకు నిధులను కేటాయించకపోవడం విచారకరమని టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి పేర్కొన్నారు.

# చంటిపిల్లను హత్య చేసిన వారిని అరెస్టు చేయాలి




- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ..
- కుమ్మెర బాధిత కుటుంబాలకు పరామర్శ, ధర్నా

**నాగర్‌కర్నూల్ (జనంసాక్షి) :** నాగర్ కర్నూలు జిల్లా కుమ్మర జాతరలో రజకులు, దళిత కుటుంబాల మహిళలపై దాడి చేయడమే కాకుండా చంటి పిల్లను హత్య చేసిన భూస్వామ్య అగ్రకుల దొరలు శ్రీనివాసరెడ్డి, మధురెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సతీష్ రెడ్డి ఇతర గుండాలపై తక్షణమే హత్యానేరం కేసు నమోదు చేసి తక్షణం అరెస్టు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో సిపిఎం పార్టీ, దళిత, సామాజిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుమ్మెరలో ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో దాడి చేసిన అగ్రకుల భూస్వాములు అధికార పార్టీకి చెందిన వారు కావడంతోనే ఈ కేసును నీరు కార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. బాధితులకు అండగా రాష్ట్రవ్యాప్త ఆందోళనలు నిర్వహిస్తామని బాధిత కుటుంబాలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి సాగర్, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి ఆశయ్య, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మ నాయక్, ఆర్ శ్రీరాం నాయక్, నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి పర్వతాలు, నాయకులు దేశ్యా నాయక్, కందికొండ గీత, ఆంజనేయులు, రామయ్య, అశోక్, మధు, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు 8 వారాల్లో ఇండ్ల స్థలాలు, పెన్షన్లు ఇవ్వాలి

- హైకోర్టు ఆదేశాలు
- పిటీషనర్ల హర్షం



హైదరాబాద్ (జనంసాక్షి) : కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో ఉద్యమకారులు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు సోమవారం విచారించింది. ఉద్యమకారులకు 8 వారాల్లో ఇండ్ల స్థలాలు, పెన్షన్లు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ ఉద్యమకారులకు పెన్షన్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలంటూ గొల్లపల్లి నాగరాజు, అంబు రాథోడ్ , అనంతుల మధు,కాట్రావత్ శ్రీను, యాదగిరి, నాగరాజు, తిరుపతయ్య, గోపాల్ దేవరాణి 9మంది తెలంగాణ ఉద్యమ కారులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ల తరపున, ఉద్యమకారుల తరుపున హైకోర్టు న్యాయవాది జి,కరుణాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. ఇరువురి వాదనలు విన్న అనంతరం అభయహస్తం స్కీం కింద అప్లై చేసుకున్న ఉద్యమ కారులకు 8 వారాలలో ఇండ్ల స్థలాలు, పెన్షన్లు ఇవ్వాలంటూ ప్రిన్సిపాల్ సెక్రెటరీ, ఫ్రీడమ్ ఫైటర్ శాఖకు హైకోర్టు న్యాయమూర్తి విజయసేన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పిటిషనర్ లలో ఒకరైన అనంతుల మధు మాట్లాడుతూ హైకోర్ట్ ఆదేశాలు ఉద్యమకారులందరి విజయమన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తెలంగాణ ఉద్యమం లో పాల్గొన్న ప్రతి ఉద్యకారుడిని గుర్తించి ఆదుకోవాలని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నాటి విద్యార్థి జేఏసీ నాయకులు అనంతుల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

# కలుషిత ఆహారం పెట్టారంటూ విద్యార్థుల ఆందోళన

**హైదరాబాద్, ఫిబ్రవరి23 (జనంసాక్షి) :** రాష్ట్రంలో ప్రభుత్వ గురుకుల, ఆశ్రమ పాఠశాలల పరిస్థితితులు రోజురోజుకు దిగజారుతున్నాయి. నాణ్యత లేని, కలుషిత ఆహారం పెడుతున్నారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరచుగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలతో వందలాది మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై దవాఖానల పాలవుతున్నారు. ఇటీవలే నాగర్‌కర్నూల్ సంఘటన మరవకముందే జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడురు గిరిజన బాలికల వసతి గృహంలో విద్యార్థినులు ఆందోళన బాట పట్టారు. కలుషిత ఆహారం పెడుతున్నారని ఆరోపిస్తూ తరగతులు బహిష్కరించి రోడ్డెక్కారు. మంచి ఆహారం పెట్టి, కనీస వసతులు కల్పించాలని, ప్రిన్సిపాల్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ నిరసనకు దిగారు.

# ఏఐఎస్ జిపిఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడుగా పాలకుర్తి క్రిష్ణమూర్తి, కార్యదర్శిగా కళ్యాణం నాగేశ్వర్ రావు





**కురుక్షేత్ర (జనంసాక్షి) :** ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ రెండో జాతీయ మహాసభలు హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్రలో జరిగాయి. ఈ మహాసభలలో తెలంగాణ రాష్ట్రం నుండి 13 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఏఐఎస్ జిపిఎఫ్ జాతీయ అధ్యక్షులుగా సురేంద్ర చౌదరి బీహార్ నుండి, వజీర్ హర్యానా నుండి ప్రధాన కార్యదర్శులుగా ఎన్నిక కాగా తెలంగాణ నుండి టాప్ర ప్రధాన కార్యదర్శి పి.క్రిష్ణమూర్తి, జాతీయ ఉపాధ్యక్షులుగా, మరియు టాప్ర ఉపాధ్యక్షులు కె నాగేశ్వర్ రావు కార్యదర్శిగా ఎన్నికయ్యారు. పెన్షన్ వెలిడేషన్ యాక్ట్ 2005 ను వెంటనే రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల విభజన 1-1- 2026 కు ముందు, తరువాత అని తేడా లేకుండా అందరికీ ప్రయోజనాలు కల్పించాలని సభ తీర్మానించింది. దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల జఖా రికవరీ పీరియడ్ ను 11 సంవత్సరాలకు తగ్గించాలని తీర్మానించింది. దేశ అభివృద్ధికి రాష్ట్ర అభివృద్ధికి పాటుపడిన అన్ని రాష్ట్రాల ప్రభుత్వ పెన్షనర్ లందరికీ కేంద్ర ప్రభుత్వం సమగ్రమైన వైద్య విధానాన్ని అమలు పరచాలని, కంట్రిబ్యూషన్ లేని మెడికల్ ఇన్సూరెన్స్ ను ఏర్పాటు చేసి అన్ని రాష్ట్రాల్లోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో తక్షణ ఉచిత వైద్యం కల్పించే విధంగా ప్రధాన మంత్రి రాష్ట్ర ముఖ్యమంత్రులతో చర్చించి రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ లందరికీ సామాజిక న్యాయం, భద్రత, సంక్షేమం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# జిల్లాల్లో అకాల వడగండ్ల వర్షం

- పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం
- పంటలకు తీవ్రంగా నష్టంతో రైతుల ఆందోళన



**హైదరాబాద్, ఫిబ్రవరి23 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమవారం అకస్మాత్తుగా వడగళ్లతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి.. వడగళ్లు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సిద్దిపేట జిల్లా, నిర్మల్ జిల్లాల్లో వడగళ్ల వర్షం బీభత్సం సృష్టించింది. ఈ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా, విద్యుత్ సరఫరాకి కూడా అంతరాయం కలిగింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాంతంలో వడగళ్ల వాన తీవ్రంగా కురిసింది. భారీ గాలులు, వడగళ్ల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపడటంతో స్థానికంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, ఇతర వాణిజ్య పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులు ఒక్కసారిగా నష్టపోవడంతో ఆందోళన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూల్మిట్ట మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు చెట్లు విరిగిపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అలాగే సిద్దిపేట, దుబ్బాక పట్టణాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షపు నీటితో పలు రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో కూడా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షంతో కొన్ని ప్రాంతాల్లో చెట్లు విరిగిపడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడం వంటి సమస్యలు తలెత్తాయి. ఈ వర్షాలతో తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఇప్పుడిప్పుడే ఎండ తీవ్రత పెరుగుతుండగా.. ఒక్కసారిగా వడగళ్ల వాన, ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలకు ఉపశమనం లభించింది. అయితే రైతులకు మాత్రం తీవ్ర నష్టం కలిగింది. వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, కూరగాయల పంటలు, ఇతర వాణిజ్య పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వడగళ్ల వర్షంతో పంటలు నేలకూలిపోయాయి. అలాగే మరోవైపు ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తమయ్యారు. నష్టాలను అంచనా వేయడానికి సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపడుతున్నారు. రైతులకు నష్టం జరిగిన ప్రాంతాల్లో నివేదికలు సేకరిస్తున్నారు.

# తురకకాశ ముస్లింలకు చేయూతనందించాలి

- జమియతుల్ ఉలేమా జిల్లా ఉపాధ్యక్షుడు ముఫ్తి ఖియాస్ మొహియుద్దీన్ డిమాండ్



**కరీంనగర్ ఫిబ్రవరి 23 (జనంసాక్షి) :** తురక కాశ ముస్లింల జీవన ప్రమాణాలు మారడం లేదని, ప్రభుత్వం అందించే వెయ్యి రూపాయల టూల్ కిట్, వారి జీవితాలను ఏమాత్రం మార్చబోదని జమీయతుల్ ఉల్లేమా జిల్లా ఉపాధ్యక్షుడు ముఫ్తి ఖియాస్ మొహియుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలలోని చేతివృత్తులకు అందిస్తున్న పథకాలను సంచార జీవులుగా ఉన్న ఈ తురక కాశ ముస్లింలకు వర్తింపజేయాలని కంప్రెషర్లు ట్రాక్టర్లు సబ్సిడీపై మినీ గూడ్స్ వాహనాలను అందించి వారి జీవన ప్రమాణాలను మెరుగు పరచాలని డిమాండ్ చేశారు. సుత్తి శానం వంటి టూల్ కిట్స్ ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంటూందని ఆరోపించారు.

# చైనా వేగం-భారత విద్యకు హెచ్చరిక

భారతదేశం ప్రపంచంలో అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశం అని గర్వపడుతుంది. కానీ ఆ యువతకు అందుతున్న విద్యా నాణ్యత, పరిశోధనా సామర్థ్యం, మౌలిక వసతులు చైనాతో పోలిస్తే ఎంత వెనుకబడి ఉన్నాయో గణాంకాలు స్పష్టంగా చెబుతున్నాయి. భావోద్వేగ ప్రసంగాలు, అంతర్జాతీయ సదస్సులు, పెద్ద పెద్ద ప్రకటనలు ఒకవైపు ఉంటే, పాఠశాల స్థాయిలో ఉన్న కఠిన వాస్తవాలు మరోవైపు కనిపిస్తున్నాయి.

యునెస్కో మరియు ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం చైనా తన జీడీపీ (గ్రాస్ డొమెస్టిక్ ప్రోడక్ట్)లో సుమారు 4-6 శాతం వరకు విద్యకు కేటాయిస్తోంది. భారతదేశం సుమారు 3 నుండి 3.5 శాతం మధ్యే ఖర్చు చేస్తోంది. జాతీయ విద్యా విధానం 6 శాతం లక్ష్యాన్ని సూచించినప్పటికీ అది ఇప్పటికీ చేరుకోలేదు. పరిశోధన మరియు అభివృద్ధి (రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్) విషయంలో తేడా మరింత తీవ్రంగా ఉంది. చైనా తన జీడీపీ లో 2.4 శాతం కంటే ఎక్కువను పరిశోధనకు వెచ్చిస్తుండగా, భారత్ సుమారు 0.7 శాతం వద్దే నిలిచిపోయింది. ఈ ఒక గణాంకమే రెండు దేశాల భవిష్యత్తు దిశను అర్థం చేసుకోవడానికి సరిపోతుంది.

చైనాలో ఉన్న విశ్వవిద్యాలయాల సంఖ్య 3000కు పైగా ఉంది. ట్సింగ్హువా యూనివర్సిటీ, పేకింగ్ యూనివర్సిటీ వంటి సంస్థలు ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్ 50లో స్థానం సంపాదిస్తున్నాయి. మన దేశంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సి) వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఉన్నా, ప్రపంచ టాప్ 100లో నిలిచే సంస్థలు అరుదుగా కనిపిస్తున్నాయి. పరిశోధనా పత్రాల ప్రచురణ, పేటెంట్ల నమోదు విషయంలో కూడా చైనా ప్రపంచంలో రెండో స్థానంలో ఉంటే, భారత్ దూరంగా ఉంది.

ప్రాథమిక విద్య స్థాయిలో పరిస్థితి మరింత ఆందోళనకరం. దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో సింగిల్ టీచర్ పాఠశాలలు ఉన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో ఒకే ఉపాధ్యాయుడు అన్ని తరగతులకు బోధించే పరిస్థితి ఉంది. పాఠశాల భవనాలు పాడైపోవడం, వర్షం కారే పైకప్పులు, మరుగుదొడ్లు లేకపోవడం, తాగునీరు లేకపోవడం, విద్యుత్ సరఫరా లేకపోవడం వంటి సమస్యలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. అసలు (యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ ) నివేదికలు పలుమార్లు చూపించినట్లుగా, ఐదో తరగతి చదివే పిల్లలు రెండో తరగతి పాఠ్యాన్ని కూడా సరిగా చదవలేకపోతున్నారు. కొంతమంది పిల్లలు మధ్యాహ్న భోజనం కోసం మాత్రమే పాఠశాలకు వస్తున్నారు అన్న వాస్తవం మనం ఒప్పుకోవాల్సిందే.

ఇలాంటి పరిస్థితుల్లో కంప్యూటర్ ఆధారిత విద్య, కృత్రిమ మేధస్సు, డిజిటల్ లెర్నింగ్, స్కిల్ డెవలప్మెంట్ గురించి మాట్లాడటం ఎంతవరకు వాస్తవంగా ఉంటుంది ? గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిరంతరంగా లేని చోట, ఇంటర్నెట్ కనెక్టివిటీ సరిగా లేని చోట, కంప్యూటర్లు లేని పాఠశాలల్లో ఏఐ ప్రయోగాలు ఎలా సాధ్యం? చైనా గ్రామీణ ప్రాంతాల్లో కూడా డిజిటల్ మౌలిక వసతులు విస్తృతంగా అభివృద్ధి చేసింది. బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్‌లు ప్రభుత్వ ప్రణాళికలో భాగమయ్యాయి.

మన దేశంలో మరో సమస్య రాజకీయ ప్రాధాన్యతల లోపం. వందల వేల కోట్లు భారీ విగ్రహాల నిర్మాణానికి, ప్రచార కార్యక్రమాలకు వెచ్చిస్తుంటే, అదే స్థాయిలో విద్యా మౌలిక వసతులపై దృష్టి కనిపించడం లేదు. మతం, కులం, ప్రాంతీయత ఆధారంగా విద్వేషాలు రేపే రాజకీయ సంస్కృతి యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని బలహీనపరుస్తోంది. చైనా తన రాజకీయ వ్యవస్థపై విమర్శలు ఉన్నప్పటికీ, విద్యా మరియు పరిశోధన రంగాల్లో నిరంతర పెట్టుబడులు పెట్టింది. ఫలితంగా సాంకేతిక రంగంలో అతి తక్కువ సమయంలోనే వంద సంవత్సరాలలో అమెరికా సాధించిన ఘనతను ఢీకొట్టే స్థాయిలో సైలెంట్ గా, వేగంగా ఏలాంటి ఆర్భాటాలు, హంగామా ప్రకటనలు,ప్రచారాలకు దూరంగా పోటీపడి ఎదిగింది.



ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ ఏఐ సదస్సులో చైనా రోబో డాగ్‌ను ఒక కార్పొరేట్ యూనివర్సిటీ మార్కెట్‌లో కొనుగోలు చేసి, అది తమ స్వంత ఆవిష్కరణ అని ప్రచారం చేసిన ఘటన భారత ప్రతిష్ఠను అంతర్జాతీయంగా దెబ్బతీసింది. ఇలాంటి సంఘటనలు మన పరిశోధనా నైతికతపై ప్రశ్నలు లేవనెత్తుతాయి. నిజమైన ఆవిష్కరణకు దీర్ఘకాల పెట్టుబడులు, స్వతంత్ర ఆలోచన, శాస్త్రీయ సంస్కృతి అవసరం.

భారతదేశానికి ప్రతిభ లోపం లేదు. మన శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, డాక్టర్లు ప్రపంచవ్యాప్తంగా ప్రతిభ చాటుతున్నారు. కానీ దేశీయ వ్యవస్థలో పెట్టుబడులు, మౌలిక వసతులు, పారదర్శక విధానాలు లేకపోతే ప్రతిభ వలస వెళ్తుంది. మేధో వలస (బ్రెయిన్ డ్రెయిన్) సమస్య ఇప్పటికీ కొనసాగుతోంది.

ప్రభుత్వానికి, అన్ని రాజకీయ పార్టీలకు ఈ పరిస్థితి ఒక హెచ్చరిక. విద్యను ఎన్నికల వాగ్దానంగా కాకుండా జాతీయ ప్రాధాన్యతగా చూడాలి. జీడీపీ లో కనీసం 6 శాతం విద్యకు, 2 శాతం కంటే ఎక్కువ పరిశోధనకు కేటాయించే దిశగా తక్షణ చర్యలు తీసుకోవాలి. ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదల మొదటి అడుగు కావాలి. ప్రతి పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, డిజిటల్ కనెక్టివిటీ తప్పనిసరి చేయాలి. సింగిల్ టీచర్ పాఠశాలలను నిర్మూలించి, ఉపాధ్యాయ నియామకాలను పారదర్శకంగా నిర్వహించాలి.

విశ్వవిద్యాలయాలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలి.సిలబస్ లో మత విద్యను తొలగించి శాస్త్రీయ పరిశోధనకు నిధులు పెంచి, పరిశ్రమలతో అనుసంధానం బలోపేతం చేయాలి. కృత్రిమ మేధస్సు, బయోటెక్నాలజీ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి కోర్సులతో అధునాతన శాస్త్ర, సాంకేతిక రంగాల్లో జాతీయ స్థాయి మిషన్లు అమలు చేయాలి. అయితే ఈ సాంకేతిక ప్రగతి పునాది బలమైన ప్రాథమిక, హైస్కూల్ విద్యే అన్న విషయాన్ని మరువకూడదు.

మత, కుల రాజకీయాలు దేశాన్ని ముందుకు నెట్టవు. శాస్త్రీయ దృక్పథం, సమాన అవకాశాలు, నాణ్యమైన ప్రభుత్వ విద్య మాత్రమే దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాయి. చైనా మోడల్‌ను గుడ్డిగా అనుసరించడం అవసరం లేకపోయినా, దీర్ఘకాల ప్రణాళిక, భారీ పెట్టుబడులు, కఠినంగా అమలు చేయటం వంటి అంశాలు మనం నేర్చుకోవచ్చు.

ఇప్పటికైనా పాలకులు, ప్రతిపక్షాలు, మేధావులు కలిసి విద్యా విప్లవానికి కట్టుబడాలి. లేకపోతే ప్రపంచం ముందుకు దూసుకుపోతుండగా, మనం అంతర్గత విభేదాల్లో చిక్కుకుని వెనుకబడిపోతాం. భవిష్యత్తు తరాల కోసం ఇప్పుడే కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. లేకపోతే పతనం తప్పదు.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# మేల్కొనకుంటే మానవ మనుగడకు ముప్పే!

వేసవి రాకముందే మధ్యాహ్నం వేళల్లో వేడి పెరుగుతున్నది. దీంతో మార్చి తర్వాత పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన వ్యక్తమవుతున్నది. గత కొన్నేళ్లుగా దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగిపోయాయి. గతేడాది వేసవిలో ఢిల్లీ, రాజస్థాన్, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల మార్క్ ను దాటి రికార్డులు సృష్టించాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోనూ వడగాల్పులు పదుల సంఖ్యలో ప్రాణాలను బలి తీసుకున్నాయి. గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పుల వల్లే ఈ స్థాయిలో భూతాపం పెరుగుతున్నదని, ఇప్పటికైనా మానవ తప్పిదాలను సరిదిద్దుకోకపోతే 2070 నాటికి భూమిపై జీవరాశి మనుగడకే ముప్పు వాటిల్లుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.



### 56.7 రికార్డు ఉష్ణోగ్రత..

భూమ్మీద రికార్డయిన అత్యధిక ఉష్ణోగ్రత 56.7 డిగ్రీలు.. ఇది అమెరికాలోని కాలిఫోర్నియా డెత్ వ్యాలీలో 1913 జులై 10 న రికార్డయింది. ఇప్పుడు మహారాష్ట్రలోని నాగ్ పూర్ లో రికార్డయిన ఉష్ణోగ్రత దీనికి దగ్గరగా ఉన్నది. 2024 మే 29న ఢిల్లీలోని ఒక ప్రాంతంలో 52.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. 2016లో రాజస్థాన్లోని ఫలోడిలో 51 డిగ్రీలు, 2019లో రాజస్థాన్లోని చురూలో 50.8 డిగ్రీలు, 1956లో హర్యానాలోని సిర్సాలో 50.3 డిగ్రీలు భారతదేశంలో అత్యధిక ఉష్ణోగ్రతలు.

### ముున్ముందు మరింత పెరిగే ప్రమాదం

భారతదేశంలో సాధారణంగా వేసవి కాలమైన మార్చి నుంచి సెప్టెంబర్ వరకు వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. అయితే గ్లోబల్ వార్మింగ్ కారణంగా భారత్‌లో తీవ్రమైన హీట్‌వేవ్‌లు తరచుగా మారుతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూమి సగటు టెంపరేచర్ 15 డిగ్రీ సెంటీగ్రేడ్లు. కొన్ని దశాబ్దాలుగా ఇది క్రమంగా పెరుగుతున్నది. నాసా ప్రకారం.. భూమిపై సగటు ప్రపంచ ఉష్ణోగ్రత 1880 నుండి ఇప్పటివరకు కనీసం1.1 డిగ్రీల సెల్సియస్ పెరిగింది.

### మానవ శరీరం తట్టుకోవడం కష్టమే..

మానవ శరీరం సాధారణ ఉష్ణోగ్రత 37.5 డిగ్రీల సెల్సియస్ వద్ద ఎలాంటి ఇబ్బంది లేకుండా సక్రమంగా పని చేస్తుంది. బయట ఉష్ణోగ్రతలు పెరిగితే శరీరంపై ఒత్తిడి పెరుగుతుంది. రక్తనాళాలు ఎక్కువగా తెరుచుకుంటే బీపీ తగ్గుతుంది. దీనివల్ల గుండెపై భారం పెరుగుతుంది. శరీరానికి కావలసిన రక్తాన్ని సరఫరా చేయడానికి గుండె వేగం పెరుగుతుంది. దీంతో సమస్యలు మొదలవుతాయి. రక్తపోటు బాగా తగ్గిపోతే, అవయవాలకు కావలసిన రక్తం చేరుకోదు. హార్ట్ అటాక్ వచ్చే ప్రమాదముంటుంది. చెమటలు ఎక్కువగా పడితే శరీర సమతౌల్యం దెబ్బతింటుంది. తీవ్రమైన ఎండలతో ప్రజలు అనారోగ్యాల బారిన పడతారు. వడదెబ్బకు గురై ప్రాణాలు సైతం కోల్పోతున్నారు.

### పేదలపైనే ప్రభావమెక్కువ..

ఎండల తీవ్రతతో ఎక్కువగా నష్టపోతున్నది పేదలే. నిర్మాణ రంగంలో పనిచేసే వలస కూలీలు, దినసరి కార్మికులపై ఈ అధిక ఉష్ణోగ్రతల ప్రభావం ఎక్కువగా ఉంటున్నది. కార్మికులు, ఆటో, క్యాబ్ డ్రైవర్లు, ఫుడ్, గ్రాసరీ ట్రాన్స్ పోర్ట్ చేసే ఉద్యోగులు పని చేయడం కష్టంగా మారడంతో వారి జీవనోపాధిపై ప్రభావం పడుతుంది. వడదెబ్బలతో ఉపాధి కూలీలు మృతి చెందుతున్న వార్తలను తరచూ వింటున్నాం. నేచర్ కమ్యూనికేషన్స్ నివేదిక ప్రకారం హీట్ కారణంగా భారతదేశం ప్రతీ ఏడాది 101 బిలియన్ డాలర్లు (రూ. 7,73,064 కోట్లు) కోల్పోతున్నది. ప్రపంచంలో ఇదే అత్యధికం. పెరుగుతున్న వేడి, ఉక్కపోత కారణంగా కోల్పోయిన శ్రమ గంటలు 2030 నాటికి సుమారు 2.5-4.5% జీడీపీని ప్రమాదంలో పడేస్తాయని 2020 మెకిన్సే నివేదిక పేర్కొంది. బయట పనిచేయడానికి సురక్షితం కాని పగటి పని గంటల సంఖ్య 2030 నాటికి సుమారు 15 శాతం పెరుగుతుందని ఈ నివేదిక తెలిపింది.

### మానవ తప్పిదాలే..

వాతావరణ మార్పులకు ప్రధాన కారణం మానవ తప్పిదాలే అంటున్నారు శాస్త్రవేత్తలు. గ్లోబల్ వార్మింగ్‌కు 95 శాతం మనుషులే ప్రధాన కారణమని ఒక నివేదిక చెప్పింది. బొగ్గు, పెట్రోలియం, నేచురల్ గ్యాస్ వంటివి అవసరానికి మించి వినియోగిస్తుండడంతో.. గ్రీన్‌హౌజ్ వాయువులు ఎక్కువగా విడుదల అవుతున్నాయని చెబుతున్నారు. ఏసీలు, రిఫ్రిజిరేటర్ల వల్ల విడుదలయ్యే రసాయనాలు ఓజోన్ పొరను దెబ్బతీస్తున్నాయి. అంతేకాకుండా మనం వాడుతున్న కరెంటు ఎక్కువగా బొగ్గు, ఇంధనాన్ని మండించి తయారు చేస్తుండడంతో కార్బన్ డై ఆక్సైడ్, నైట్రస్ ఆక్సయిడ్ లు గాలిలో కలుస్తున్నాయి. కార్బన్ డై ఆక్సయిడ్ ను గ్రహించే అడవులు ప్రతి ఏడాది సుమారు 12 మిలియన్ హెక్టార్ల వరకు నాశనమవుతున్నాయి. కార్లు, ట్రక్కులు, ఓడలు, విమానాలు అధిక వాడకంతో కార్బన్- డై ఆక్సయిడ్ పెరుగుతున్నది. అంతేకాకుండా పంటలను పండించడానికి మితిమీరిన ఎరువులను వాడుతుండడం వల్ల మిథేన్ తోపాటు మరికొన్ని గ్రీన్ హౌజ్ వాయువులు వాతావరణంలో కలుస్తున్నాయి.

### కర్బన ఉద్గారాలను తగ్గించాల్సిందే..

వాతావరణ మార్పులపై ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ (ఐపీసీసీ)- 2023 మార్చిలో ఇచ్చిన ఒక నివేదిక ప్రకారం 'మానవ కార్యకలాపాలు, గ్రీన్‌హౌజ్ వాయువులే గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధాన కారణం. కర్బన ఉద్గారాలను తగ్గించలేకపోతే, భూతాపం అత్యంత వేగంగా పెరిగిపోయే ప్రమాదమున్నది' అని పేర్కొన్నది. వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సయిడ్ లాంటి గ్రీన్‌హౌజ్ వాయువులు పెరగడం వల్లే టెంపరేచర్లు పెరిగిపోతాయి. 19వ శతాబ్దం మధ్య నుండి రకరకాల కారణాల వల్ల గ్రీన్‌హౌస్ వాయువులు వాతావరణంలో చేరుతున్నాయి. ఈ వాయువులు ముఖ్యంగా పరిశ్రమలు, వ్యవసాయం, వాహనాల నుంచి వాతావరణంలో కలుస్తున్నాయి. దీంతో ఉండాల్సిన దానికంటే భూమి ఎక్కువగా వేడెక్కుతున్నది. ఉష్ణోగ్రతలు మరింత పెరిగితే.. భూమిపై జీవుల మనుగడకూ ప్రమాదం తప్పదు. రాబోయే కొన్ని దశాబ్దాల్లో ఎన్నో జాతులు అంతరించిపోయే ప్రమాదముంది.

మహమ్మద్ ఆరిఫ్, 7013147990

## కులాల కంచెలు తెంచుదాం

మానవత్వాన్ని పెంచుదాం
మనుషులంతా ఒక్కటే
ఏకులమైనా ఏ మతమైనా
అందరి పుట్టుక ఒకటే
శ్వాసించే గాలి తాగే నీరు
అందరికీ ఒకటే
ప్రకృతిలో లేని భేదం
మనిషికి ఎందుకు ?
మనుషుల మధ్య ఉన్న
కులాల కుంపటి ఎందుకు?
కులాల పునాదుల మీద
సాగే రాజకీయాలు
సమాజ వివక్షకు విభజనకు
ఆజ్యం పోస్తూ అభివృద్ధిని
అడ్డుకొనే బానిస మనస్తత్వాన్ని
పెంచిపోషిస్తున్నాయి
చెట్టుకు ఒక రంగు పువ్వు
పూసిన తోట అంతా ఒకటే
రెమ్మకోక ఒక తీరు ఆకు
ఉన్న వృక్షమంతా ఒకటే
నదులన్నీ వేరైనా
కలిసేది సాగరములోనే
శ్రమించే చెమట చుక్కలకు
కులం ఉండదు
కష్టపడే చేతులకు ఏభేదం
ఉండదు.
అక్షరం నేర్పిన జ్ఞానికి వర్ణం
ఉండదు
కలిసి ఉన్న చోట
ఏశక్తి మనల్ని విడదీయదు
కులం చూసి గాక గుణం
చూసి గౌరవిద్దాం కులం
విద్వేషపు గోడలను
కూల్చుదాం మమత
మానవీయ మన
జీవనశైలి కావాలి
ఆత్మీయత ఆధరణతో
గుండె గధుల్లోనింపుకో
ఐక్యతా మంత్రం
పారే ప్రవాహానికి
ఏ కులపు గుర్తింపు
ఉంటుంది?
ఆకలివేస్తే అన్నం
అడుగుధాం
కానీ కులం కాదు
మేధస్సుకు లేదు మసి
శ్రమకు లేదుకుల జాడ్యం
ప్రేమతో వెలిగిద్దాం
ప్రతి ఇంట ఐక్యతా దీపం
కులాన్ని గాకుండా
గుణానిబట్టి మనిషిని
ప్రేమించే రోజులు రావాలి
జాతి వైభవం చాటాలంటే
ఐక్యతే మార్గము
చేయి చేయి కలుపుదాం
నవ సమాజాన్ని నిర్మిద్దాం
కులమనే వృక్షాన్ని కూకటి
వేళ్ళతో పెకిలిద్దాం
స్వేచ్ఛగా విహరిద్దాం.
కులం కాదు గుర్తింపు ప్రతిభ
జ్ఞానమే నిజమైన గుర్తింపు
అలాంటి రోజులు రావాలి
అప్పుడే భారతావనికి
నిజమైన పండుగ
వికసిత భారత్ లక్ష్య
సాధనలో ప్రతిభ ప్రగతి
పురోగతియే అసలైన
జాతి సంపద సౌభాగ్యం
కావాలి



నేదునూరి కనకయ్య
ఫ్రీలాన్స్ రచయిత కాలమిస్ట్
ఆర్థిక సామాజిక రాజకీయ
విశ్లేషకులు. కరీంనగర్,
9440245771

# ది కేరళ స్టోరీ-2 సినిమాతో కేరళ అభివృద్ధిపై సంఘ్‌పరివార్ దాడి




భారతదేశ లౌకిక ప్రజాస్వామ్య సౌధాన్ని కూల్చివేసి, ఆ శిథిలాలపై ఒక మతోన్మాద రాజ్యాన్ని నిర్మించాలనుకునే ఆరెస్సెస్-బీజేపీ కూటమికి కేరళ ఒక అజేయమైన కోటలా నిలుస్తోంది. కేరళలో వాణఖీ ప్రభుత్వం సాధిస్తున్న విజయాలు, అక్కడి ప్రజల మధ్య ఉన్న విడదీయలేని వర్గ ఐక్యత సంఘ్ పరివార్ శక్తుల నిద్రను చెడగొడుతున్నాయి. అందుకే, రాజకీయంగా కేరళను ఎదుర్కోలేక, 'కేరళ స్టోరీ' వంటి కల్పిత గాథల ద్వారా సాంస్కృతిక దాడికి దిగుతున్నారు.

సినిమా పేరుతో విషాన్ని చుక్క చుక్కగా చిమ్మే రాజకీయ ప్రాజెక్ట్‌ను మళ్లీ ముందుకు తీసుకువచ్చారు "ది కేరళ స్టోరి-2" ట్రైలర్ విడుదలైన నిమిషాల వ్యవధిలోనే సోషల్ మీడియాలో తీవ్రమైన వ్యతిరేకతవచ్చింది. మొదటి భాగంతోనే ఈ ట్రైలర్ పట్ల తప్పుడుసమాచారం, మత విద్వేషాన్ని ప్రేరేపించడం, భయానక కథనాల సృష్టి వంటి ఆరోపణలు ఎదుర్కొన్న ఈ బృందం రెండో భాగంలో మరింత బహిరంగం గా రాజకీయ అజెండాతో ముందుకు వచ్చినట్లు ఈ ట్రైలర్ స్పష్టమవుతోంది.

ట్రైలర్‌లో బీఫ్ తినడానికి ఒక యువతిని బలవంతం చేస్తున్నట్లు చూపించిన సన్నివేశం కేవలం సినిమా సన్నివేశం కాదు. అది కేరళ సమాజంపై ఉద్దేశపూర్వకంగా చేస్తున్న దుష్ప్రచారం. కేరళలో ఆహార సంస్కృతి వైవిధ్యంతో కూడు కున్నది. హిందూ, ముస్లిం, క్రైస్తవ సముదాయాల మధ్య సహజీవనం చరిత్రాత్మకం. అలాంటి రాష్ట్రాన్ని ఒకే మతాన్ని లక్ష్యంగా చేసుకుని దుష్ప్రచార చిత్రంగా మలచడం, రాజకీయంగా లాభం పొందాలనే ప్రయత్నమే.

గతంలో 'కేరళ స్టోరీ' పేరుతో వచ్చిన చిత్రం సృష్టించిన విద్వేషాలు మరువక ముందే, ఇప్పుడు దానికి కొనసాగింపుగా వస్తున్న 'ఫైల్స్' వెనుక ఉన్న అసలు ఉద్దేశం వినోదం కాదు, విద్వేషం. 2026 కేరళ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, అక్కడ రాజకీయంగా పాగా వేయలేకపోతున్న శక్తులు సినిమా అనే అస్త్రాన్ని ప్రయోగిస్తున్నాయి. ఇది కేవలం ఒక చిత్ర నిర్మాత ఊహాజనిత కథ కాదు, ఇది ఒక పక్కాగా రూపొందించబడిన 'ఎలక్షన్ ఎజెండా'.

ఏదైనా ఒక విష ప్రచారాన్ని నమ్మించాలంటే దానికి గణాంకాల ముసుగు వేయడం ఫాసిస్టుల పాత పద్ధతి. గతంలో 32 వేల మంది మహిళలు మాయమయ్యారని ప్రచారం చేసి, చివరకు కోర్టులో ఆ సంఖ్యను కేవలం ముగ్గురేనని ఒప్పుకున్న చరిత్ర ఈ చిత్ర నిర్మాతలది. ఇప్పుడు రెండో భాగంలో కూడా ఇటువంటి తప్పుడు లెక్కలతో, ఉద్వేగభరితమైన సన్నివేశాలతో సమాజాన్ని విభజించే ప్రయత్నం చేస్తున్నారు.

ఇది కేవలం ఒక సినిమా సీక్వెల్ మాత్రమే కాదు, ఇది కేరళ అస్తిత్వంపై, అక్కడి అభ్యుదయ చరిత్రపై జరుగుతున్న క్రూరమైన దాడి. ఒక పథకం ప్రకారం కేరళను మత ఘర్షణల కేంద్రంగా చిత్రీకరించడం వెనుక ఉన్నది 'సాంస్కృతిక ఫాసి జం' తప్ప మరేమీ కాదు. మతాతీత మానవత్వాన్ని చాటిచెప్పే కేరళ గడ్డపై విద్వేషపు విత్తనాలు నాటడం ద్వారా దేశవ్యాప్తంగా రాజకీయ లబ్ధి పొందాలనేది వీరి నీచమైన వ్యూహం.

సోషల్ మీడియాలో "ఇదే నిజమైన కేరళ" అంటూ కేరళ యువత, ప్రజలు, మేధావులు కేరళ అభివృద్ధిని గురించి సాధించిన విజయాలను పోస్టు చేసస్తున్నారు. "మా ఆహారం మీద మీకు హక్కు లేదు", "మా సంస్కృతిని మత ద్వేషంతో కొలవకండి" అని అన్ట్రెండ్ చేస్తున్నారు.

కేరళ చరిత్రను చూసినవారికి ఈ దుష్ప్రచారం ఎంత అసంబద్ధమో కూడా అర్థమవుతుంది. సామాజిక సంస్కరణలు, అక్షరాస్యత, ఆరోగ్య రంగంలో పురోగతి, మత సామరస్య పరిరక్షణ-ఇవన్నీ కేరళ సమాజాన్ని ప్రత్యేకంగా నిలబెట్టాయి. అలాంటి రాష్ట్రాన్ని దేశ ద్రోహుల, ఉగ్రవాద కేంద్రంగా చూపించడం కేవలం అవమానం కాదు; అది దేశ లౌకిక తత్వంపై దాడి. భారతదేశ సమాజంలో మత సామరస్యానికి చిరునామాగా నిలిచే కేరళ రాష్ట్రంపై మతోన్మాద శక్తులు సాగిస్తున్న యుద్ధంలో 'కేరళ స్టోరీ-2' ఒక భాగం. ఇది కేవలం కళాఖండం కాదు, కేరళలో వేళ్లూనుకున్న ఎర్రజెండా చైతన్యాన్ని దెబ్బతీయడానికి సంఘ్ పరివార్ శక్తులు పన్నిన ఒక విషపూరితమైన రాజకీయ ఎజెండా., ఒక ప్రాంతంలోని భౌతిక అభివృద్ధిని, శ్రమజీవుల ఐక్యతను నేరుగా ఎదుర్కోలేనప్పుడు పాలక వర్గాలు ఇలాంటి సాంస్కృతిక దాడులను ఆశ్రయిస్తాయి. కేరళలో ఎల్డీఎఫ్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా అభివృద్ధి విప్లవాత్మక మార్పులు దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అవుతున్న తరుణంలో, ఆ రాష్ట్ర ప్రతిష్టను మంటగలిపేందుకు అబద్ధాలను వెండితెరపైకి తెస్తున్నారు.

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (చీజ=దీ) లెక్కల ప్రకారం కేరళలో మహిళల భద్రత ఇతర ఉత్తరాది రాష్ట్రాల కంటే మెరుగ్గా ఉంది. కానీ, ఆ వాస్తవాలను దాచిపెట్టి, ఒక పథకం ప్రకారం కేరళను 'ఉగ్రవాద కేంద్రం'గా చిత్రీకరించడం వెనుక పెద్ద రాజకీయ కుట్రే దాగి ఉంది. కేరళలో అక్షరాస్యత 96.2 శాతం ఉండగా, డబుల్ ఇంజన్ సర్కార్లని చెప్పుకునే రాష్ట్రాల్లో అది 75 శాతం కూడా దాటలేదు. శిశు మరణాల రేటు కేరళలో కేవలం 6గా ఉంటే, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అది 40 దాటిపోతోంది.

ఉత్తరప్రదేశ్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో క్రైమ్ రేటు ఎక్కువగా ఉన్నప్పటికీ, వాటిని వదిలేసి కేరళను ఉగ్రవాద కేంద్రంగా చూపాలనుకోవడం రాజకీయ కక్షపూరిత చర్య. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని ఆర్థిక సంక్షోభం, ధరల పెరుగుదల మరియు నిరుద్యోగం వంటి అంశాల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి, కేరళ వంటి ప్రగతిశీల రాష్ట్రాన్ని 'ఉగ్రవాద కేంద్రం'గా చిత్రించడం వీరి ప్రధాన ఎజెండా. ఎల్డీఎఫ్ ప్రభుత్వం తన పదేళ్ల పాలనలో పేదరిక నిర్మూలన, పిజి వరకు ఉచిత విద్య, వైద్యం మరియు సామాజిక భద్రతా పింఛన్ల ద్వారా ప్రజల మన్ననలు పొందింది. ఈ అభివృద్ధి నమూనాను దేశవ్యాప్తంగా చర్చా కాకుండా అడ్డుకోవడమే. నీతి ఆయోగ్ నివేదికల ప్రకారం కేరళ అన్ని సామాజిక సూచీల్లో అగ్రస్థానంలో ఉంటే, బీజేపీ పాలిత రాష్ట్రాలు అట్టడుగున ఉన్నాయి. ఈ వాస్తవాలు ప్రజలకు చేరకుండా ఉండటానికి, సంఘ్ పరివార్ శక్తులు భారీగా నిధులు వెచ్చించి ఇలాంటి చిత్రాలను ప్రమోట్ చేస్తున్నాయి. ఇది కేవలం ఓట్ల వేట మాత్రమే కాదు, కేరళలో దశాబ్దాలుగా ఉన్న మత సామరస్యాన్ని చెడగొట్టి, అక్కడ బీజేపీ అడుగు పెట్టడానికి దారులు వెతుక్కోవడమే

కేరళ ప్రభుత్వం అమలు చేస్తున్న 'లైఫ్ మిషన' (పేదలకు ఇళ్ళు), 'కె-ఫాన్' (ఉచిత ఇంటర్నెట్) వంటి విప్లవాత్మక పనుల గురించి దేశమంతా చర్చించుకుంటుంటే, దానికి విరుగుడుగా 'లవ్ జిహాద్' అనే కల్పిత సిద్ధాంతాన్ని తెరపైకి తెస్తున్నారు.లైఫ్ మిషన' ద్వారా 4 లక్షలకు పైగా పేదలకు ఇళ్లు నిర్మించింది, ప్రభుత్వ పాఠశాలలను హైటెక్ క్లాస్ రూమ్‌లుగా మార్చింది. ఇవన్నీ దేశవ్యాప్తంగా చర్చకు రాకుండా అడ్డుకోవడమే ఈ 'స్టోరీ'ల అసలు ఉద్దేశ్యం. రానున్న ఎన్నికల సమయంలో ప్రజలు నిరుద్యోగం, ధరల పెరుగుదల, విఫలమైన ఆర్థిక విధానాల గురించి ప్రశ్నించకుండా ఉండాలంటే, వారికి ఇలాంటి 'సినిమాటిక్ అబద్ధాలు' ఒక మత్తుమందులా పనిచేస్తాయి.

కేరళలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు కలిసికట్టుగా ఓనమ్ జరుపుకుంటారు, విపత్తులు వచ్చినప్పుడు ఒకరికొకరు అండగా నిలుస్తారు. ఈ సౌభ్రాతృత్వాన్ని చీల్చడం ద్వారా తప్ప, అక్కడ తమ రాజకీయ పబ్బం గడవదని భావిస్తున్న శక్తులు ఈ 'ఫైల్స్'కు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. కేరళ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న కొద్దీ ఇలాంటి చిత్రాల తాకిడి ఇంకా పెరుగుతుంది. కానీ, అక్షరాస్యతలో అగ్రస్థానంలో ఉన్న కేరళ ప్రజలు ఈ చౌకబారు కుట్రలను పసిగట్టలేరని అనుకోవడం పాలకుల భ్రమ. అబద్ధం ఎంత వేగంగా విస్తరించినా, వాస్తవం వెలుగులోకి వచ్చినప్పుడు అది కరిగిపోక తప్పదు. శ్రమజీవుల ఐక్యత, సామాజిక స్పృహ కలిగిన కేరళ సమాజం ఇలాంటి విద్వేష రాజకీయాలను ఎప్పుడూ తిప్పికొడుతూనే ఉంది. ఇక్కడ ఏ ఒక్క మతమో లేదా వర్గమో ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వదు. శబరిమల యాత్రకు వెళ్లే భక్తులు వావార్ మసీదును దర్శించుకోవడం, హిందూ దేవాలయాల ఉత్సవాల్లో ముస్లింలు పాలుపంచుకోవడం ఇక్కడి సంస్కృతి. ఈ సామరస్యాన్ని చెడగొట్టడం ద్వారా తప్ప తాము గెలవలేమని భావిస్తున్న శక్తులు ఈ 'ఫైల్స్'కు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. ఎన్నికల వేళ ఓట్ల వేట కోసం సమాజాన్ని చీల్చే ఈ రాజకీయ క్రీడ ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు. కేరళ చైతన్యం ఈ విద్వేష రాజకీయాలను పసిగట్టి అసెంబ్లీ ఎన్నికల్లో ఇలాంటి చౌకబారు కుట్రలకు తావులేదని ఇక్కడి ప్రజలు మరోసారి నిరూపించబోతున్నారు. అబద్ధాల పునాదులపై నిర్మించిన ఈ కల్పిత గాథలను తుత్తునియలు చేసి, వాస్తవ కేరళ వెలుగును ప్రపంచానికి చాటుతున్నారు.

నిజమైన 'కేరళ స్టోరీ' అంటే దేశంలోనే అత్యుత్తమమైన పబ్లిక్ ఎడ్యుకేషన్, కేరళలో అమలు అవుతున్న అత్యుత్తమ ప్రజా ఆరోగ్యం, మరియు 'లైఫ్ మిషన్' ద్వారా పేదలకు అందుతున్న గూడు. ఆకలి లేని రాష్ట్రంగా కేరళను తీర్చిదిద్దుతున్న ప్రజల అభివృద్ధి పాలనను చూసి ఓర్వలేక, ఈ ప్రగతిశీల నమూనాను బద్నాం చేయాలని చూస్తున్నారు.కేరళ చైతన్యం ఇటువంటి చౌకబారు ప్రచారాలకు లొంగదు. నారాయణ గురు, అయ్యన్ కాళి వంటి సంస్కర్తల స్ఫూర్తితో, కమ్యూనిస్టుల త్యాగాలతో నిర్మితమైన ఈ గడ్డపై మతోన్మాద శక్తుల ఆటలు సాగవు. అబద్ధపు 'ఫైల్స్'తో చరిత్రను మార్చలేరు. శ్రమజీవుల ఐక్యతే ఈ ఫాసిస్టు శక్తులకు అంతిమ సమాధానం. విద్వేష రాజకీయాలను తిప్పికొట్టి, కేరళ లౌకిక వారసత్వాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి. నిజమైన కేరళ స్టోరీ అంటే మతాతీత మాన వత్వం, విద్యా విప్లవం.కానీ మీరు చూపించేది కేవలం సంఘ్ పరివార్ ల్యాబొరేటరీలో తయారైన అబద్ధాల కల్పిత గాథ.



టి. నాగరాజు
SFI రాష్ట్ర కార్యదర్శి
ఫోన్:9490098292




## అందరికి భీమా

పేదల దగ్గర పైసాలేదు
ఆరోగ్యంపై ధ్యాసేలేదు
చేతినిండా పని కావాలి
ప్రాణశక్తికి తిండి కావాలి
ఇల్లుగడవాలి
తల్లిపిల్ల నవ్వాలి
బతకడం ముఖ్యం లక్ష్యం
సామాన్యుల ఆశల మార్గం...
నలభైకి కుక్కిమంచం
చేతికి చిక్కదు గంజి కంచం
ముసిరిన రోగాల ముళ్లకంచె
మందుమాకుకు లేదు కాంచనం...
కోట్లకు వృద్ధుల సంఖ్య
దాటుతున్నాయి రోగాల హద్దులు
పెరిగి పోతున్నాయి అప్పులు
మధ్యతరగతి మందహాసాలు...
అందరికి ఆరోగ్యబీమా
కావాలి కదా రామా
చికిత్సకు సహకరించాలి
ప్రజా ఆరోగ్యమే దేహ దేశ ఆరోగ్యం
ఆర్థికంగా జనానికి అండగ నిలబడాలి
ఉత్పత్తి కీర్తి రెంటికి మూలం
ప్రజాదేహ ఆరోగ్యం
దేశ సౌభాగ్య భాగ్యం

రేడియమ్
9291527757

## మల్లేశం మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం..



**చేర్యాల, ఫిబ్రవరి 23 (జనంసాక్షి) :** చేర్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో "మల్లేశం మల్టీ స్పెషాలిటీ" అనే ఓ ప్రైవేట్ ఆస్పత్రిని మున్సిపల్ చైర్ పర్సన్ ముస్త్యాల అరుణ బాలనర్సయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏరియా మండల పట్టణ ప్రజలకు సేవ చేయడానికి బింగి మల్లేశం ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఆసుపత్రిలో జనరల్ సర్జన్, గైనకాలజీ స్పెషలిస్టు, డాక్టర్ కిరణ్ మహి అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జనగాం జిల్లా ప్రధాన కార్యదర్శి అందె నాని బాబు మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి అనుభవం కలిగిన డాక్టర్లచే పేద మధ్యతరగతి బడుగు బలహీన వర్గాలకు వైద్య సేవలు అందించడమే ఏకైక లక్ష్యంగా ముందుకు వచ్చారని వారి సేవలను ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మేడిశెట్టి ఉమా శ్రీధర్, కౌన్సిలర్లు పోతుగంటి ప్రసాద్ గౌడ్, వీరబత్తిని సదానందం, నిమ్మ సుప్రజ, కొమ్ము రాజేశ్వరి, ఒగ్గు వెంకటమ్మ, మహమ్మద్ షరీఫా బేగం, కమలపురం గీతాంజలి, మహమ్మద్ ఇజాజ్ అహ్మద్, వెలుగల దుర్గయ్య, బుధారి సురేష్ వివిధ పార్టీల నాయకులు పట్టణ, మండల ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా ది మాస్టర్‌మైండ్స్ ఈ-టెక్నో పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు
- హాజరైన ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మున్సిపల్ చైర్మన్ అంజమ్మ



**సంగారెడ్డి, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** సదాశివపేటపట్టణంలోని ది మాస్టర్‌మైండ్స్ ఈ-టెక్నో పాఠశాల మొదటి వార్షికోత్సవ వేడుకలు మంగళవారం బసవసేవ సదన్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మున్సిపల్ చైర్ పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ హాజరైనారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల చేత భగవద్గీత శ్లోకాలు, దేశభక్తి గీతాలు, నాటికలు, లంబాడీ నృత్యాలు, ఫోక్ డాన్సులు వంటి కార్యక్రమాలతో విద్యార్థిని, విద్యార్థులు హోరెత్తిశిచారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ చింత గోపాల్, 12 వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు, 26 వ వార్డు కౌన్సిలర్ అపర్ణ శివరాజ్ పాటిల్, 22 వ వార్డు కౌన్సిలర్ కొత్త గొల్ల సోమశేఖర్, డైరెక్టర్ ఎం.నవనీత సంతోష్ గుప్త పాల్గొన్నారు.

## పాపయ్య కుంట కాలుష్య మురుగు నీటి సమస్యపై ప్రజావాణిలో ఫిర్యాదు

- హైడ్రా టీమ్‌కు పరిశీలన ఆదేశాలు



**నిజాంపేట్, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** కుతుబుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ సర్కిల్ పరిధిలో తురుక చెరువు నుండి పాపయ్య కుంటకు చేరుతున్న వర్షపు మురుగు నీటి కారణంగా పాపయ్య కుంట తీవ్రంగా కలుషితం అవుతోంది. అదేవిధంగా గుర్రపు డెక్క , పరిసర ప్రాంతాల భూగర్భ జలాలు కూడా కాలుష్యానికి గురవుతూ, దోమల సమస్య పెరుగుతోంది. ఈ పరిస్థితుల వల్ల శ్రీనివాస్ నగర్ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రాజధాని స్కూల్ నుండి బండారు లేఔట్ మార్గంగా వెళ్లే ఎస్ఎన్‌డీపీ (ఎస్ ఎన్ డి పి) లైన్‌లో తురుక చెరువు నీటిని మళ్లించాలని కోరుతూ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అలాగే హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం జరిగింది. ఇటీవల నిజాంపేట్ కార్పొరేషన్ పాపయ్య కుంట నుండి సిరి బాలాజీ వరకు ఎస్ఎన్‌డీపీ పనుల కోసం రూ. 3 కోట్ల నిధులు కేటాయించిన నేపథ్యంలో, రాజధాని ప్రాంతంలో అవసరమైన డైవర్షన్ పనులకు ఆ నిధులను వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రంగనాథ్ సార్ సంబంధిత అధికారులకు తక్షణమే హైడ్రా బృందం సంబంధిత జీహెచ్ఎంసీ ఇరిగేషన్ అధికారులతో కలిసి సంఘటనా స్థలాన్ని సందర్శించి పూర్తి స్థాయి పరిశీలన చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నల్ల జైశంకర్, అరుణ్ రావు, శ్రీరాములు, పులి బలరాం, శ్రీనివాస్ గౌడ్ పాండు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించండి

- శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్




**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 23 (జనంసాక్షి) :** ప్రజా సమస్యల పరిష్కారంకోసం అర్జిదారులు అందజేసే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే వివిధ విభాగాల జోనల్ స్థాయి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజావాణి కార్యక్రమం ఒక యజ్ఞంలా కొనసాగుతుందని, జిహెచ్ఎంసి పరిధిలోపల ప్రతి సర్కిల్ కార్యాలయం, జోనల్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం పది గంటలనుండి సాయంత్రంవరకు కీలక అధికారులు అంతా సమయాన్ని కేటాయిస్తూ అర్జీదారుల నుండి ఫిర్యాదులు అందుకోవడం జరుగుతుందని జెడ్సి హేమంత్ బోర్ఖడే వివరించారు. సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి 43 ఫిర్యాదులు ప్రజావాణికి అందగా శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం పరిధిలో మొత్తం 19 ఫిర్యాదులు అంతగా ఇందులో నేరుగా శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయానికి 04, శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో 09 ఫిర్యాదులు, నార్సింగి సర్కిల్ కార్యాలయంలో 01, మియాపూర్ సర్కిల్ కార్యాలయంలో 03 మరియు అమీన్పూర్ సర్కిల్ కార్యాలయం పరిధిలో 02 ఫిర్యాదుల చొప్పున అర్జీదారులు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలను విన్నవించుకోవడం జరిగిందన్నారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ తో పాటు జోనల్ సిటీ ప్లానర్, రెవెన్యూ విభాగం, జోనల్ వైద్య ఆరోగ్యశాఖ విభాగం, విద్యుత్తు, శానిటేషన్, ఇంజనీరింగ్ విభాగం, పట్టణ ప్రణాళిక విభాగం, ఇరిగేషన్, యుబిడి తదితర సెక్షన్ల నుండి అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని జెడ్సి మీడియాకు తెలియజేశారు. కాగా వీలైనంత త్వరగా వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని హేమంత్ బోర్ఖడే ఆదేశాలు జారీ చేశారు.

### మియాపూర్ సర్కిల్ కార్యాలయంలో...

శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సర్కిల్ ఉప కమిషనర్ డి. శశిరేఖ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం పది ఫిర్యాదులు ప్రజావాణి కార్యక్రమంలో నమోదు కాగా ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 04, యుబిడి 01, ఎలక్ట్రికల్ సెక్షన్ కు 01, టౌన్ ప్లానింగ్ విభాగానికి 03, రెవెన్యూ విభాగానికి 01 ఫిర్యాదులు అందినట్లు డిసి వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ విభాగం ఏఎంసి విజయ్ కుమార్, టిపిఎస్ రమేష్, డిఈ వశీధర్, సర్కిల్ వైద్యాధికారి శ్రీకాంత్ రెడ్డి, సానిటరీ సూపర్వైజర్ శ్రీనివాస్, ఇతర సంబంధిత విభాగాల నుండి పలువురు అధికారులు హాజరైనట్లు డిసి తెలిపారు.

## వైద్య సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



**యాచారం, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రి పిహెచ్సి నుండి సిహెచ్సికి మారిన క్రమంలో సిబ్బంది, వైద్య సౌకర్యాల కల్పించే విషయమై ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి సహకారంతో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి వైద్య విధాన పరిషత్ కు లేఖ రాసినట్టు సర్పంచ్ మస్కు అనిత శరణం తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని యాచారం సర్పంచ్ సందర్శించి ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మరిన్ని మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించేలా ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి సహకారంతో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేలా సన్నాహాలు చేస్తున్నామన్నారు. శిశువు మరణంతో వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించడంలో విఫలమయ్యారన్నది స్పష్టమవుతుందన్నారు. ఇకమీదట వైద్య సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సమస్యలు ఏమైనా తమ దృష్టికి తేవాలని చెప్పారు. మూడు రోజులుగా వీధి కుక్కలు పిల్లలపై పెద్దలపై తరచూ దాడులు చేస్తున్నాయని కుక్కలను నియంత్రించేలా వైద్య అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకొని కుక్కల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు సాజిద్, జోగు అంజయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మస్కు నరసింహ, కాంగ్రెస్ నాయకులు మస్కు రమేష్, చింతల సాయిలు, సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్లు మృదుల, శాంతికుమారి పాల్గొన్నారు.

## ప్రభాకర్ గుప్తా ఆత్మకు శాంతి చేకూరాలి

- తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి



**తాండూరు, ఫిబ్రవరి 23 (జనంసాక్షి) :** ప్రభాకర్ గుప్తా ఆత్మకు శాంతి చేకూరాలని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. తాండూర్ పట్టణ సీనియర్ నాయకుడు తాటికొండ పరిమల్ గుప్తా తండ్రి మాజీ మున్సిపల్ చైర్మన్ తాటికొండ స్వప్న పరిమల్ గుప్తా మామ ప్రభాకర్ గుప్తా స్వర్గస్తులైన విషయం తెలిసి సోమవారం తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పట్టణం లోని వారి నివాసానికి వెళ్లి ప్రభాకర్ గుప్తా పార్తివ దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తాటికొండ కుటుంబం తో ఉన్న సన్నిహిత్యాన్ని గుర్తు చేస్తూ వారి కుటుంబానికి ఓదార్చి ప్రభాకర్ గుప్తా ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. పట్నం మహేందర్ రెడ్డి వారితో పాటు బీదర్ రాజశేఖర్,పట్లోళ్ల నర్సిములు, మురళికృష్ణ గౌడ్, కౌన్సిలర్ మన్నపురం రామకృష్ణ, జూబైర్ లాల,బిర్కెట్ రఘు, భగవాన్ మాజీ కౌన్సిలర్స్ వెంకన్న గౌడ్, బోయ రవిరాజు, వెంకట్రాములు నాయక్,కోట్ల రాజ్ కుమార్, దవులయ్య మరియు తదితరులు పాల్గోన్నారు.

## ఉప్పల్‌లో మీడియా ప్రజల గొంతుకగా నిలవాలి




**ఉప్పల్, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** ఉప్పల్ ముద్రిత మరియు దృశ్య మాధ్యమాల సంఘం నూతన కమిటీ సభ్యులు తెలంగాణ హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరం స్థాపకురాలు, అధ్యక్షురాలు డాక్టర్ వ్యాసభట్ శ్రీవాణి చౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ వ్యాసభట్ శ్రీవాణి చౌదరి మాట్లాడుతూ సమాజంలో ప్రజలకు నిజమైన సమాచారం చేరవేయడంలో మాధ్యమాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకువచ్చి ప్రజల గొంతుకగా నిలబడాల్సిన బాధ్యత మాధ్యమాలపై ఉందన్నారు. ఉప్పల్ ముద్రిత మరియు దృశ్య మాధ్యమాల సంఘం నూతన కమిటీ సభ్యులు సామాజిక బాధ్యతతో ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడంలో మాధ్యమాల సహకారం ఎంతో అవసరమని ఆమె తెలిపారు. ఉప్పల్ ప్రాంత అభివృద్ధికి సంబంధించి మాధ్యమ ప్రతినిధులు ఎల్లప్పుడూ నిర్మాణాత్మకంగా సహకరించాలని కోరారు. సంఘం చేపట్టే మంచి కార్యక్రమాలకు తన పూర్తి మద్దతు ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఉప్పల్ ముద్రిత మరియు దృశ్య మాధ్యమాల సంఘం అధ్యక్షుడు, సీనియర్ పాత్రికేయుడు కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

## ఎన్‌జీఓ సంస్థ సేవలు అభినందనీయం

### 20వ వార్డు కౌన్సిలర్ నవీన సంతోష్ గౌడ్



**తాండూరు, ఫిబ్రవరి 23 (జనంసాక్షి) :** ఎన్.జీ.ఓ సంస్థ సేవలు అభినందనీయమని 20వ వార్డు కౌన్సిలర్ నవీన సంతోష్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం తాండూరు పట్టణం గాంధీ నగర్ వార్డు నం 20 లో అంగన్వాడి రెన్యువేషన్ సందర్భంగా వార్డు కౌన్సిలర్ నవీన సంతోష్ గౌడ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నవీన సంతోష్ గౌడ్ మాట్లాడుతూ గాంధీ నగర్ లోని అంగన్వాడి రెన్యువేషన్ చేయడానికి ఎన్.జీ.ఓ సంస్థ ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఎన్.జీ.ఓ సవస్థ ద్వారా మన పిల్లలకు కావాల్సిన అవకాశాలు వాటిని కల్పించినందుకు, వారికి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యునైటెడ్ వే బెంగుళూరు డోనార్ పిడిసి వారి కి అంగన్వాడి తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన సిడిపిఓ కాంతారావు , సూపర్వైర్ సుశీల, అంగన్వాడి రాధ, వార్డ్ ప్రజలు రేఖ షిందే, సురేఖ రెడ్డి, పద్మ, స్నేహ, సంబంధిత ఎన్.జీ.ఓ.ఎస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** చాలా సంవత్సరాల క్రితం బస్తీలు ఏర్పడి నివాసాలు ఉంటున్న ప్రభుత్వ (నోటరీ) స్థలాల్లో నిర్మించుకున్న కొత్త ఇండ్లకు విద్యుత్ కనెక్షన్లను ఇవ్వాలని కోరుతూ పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ పలు ప్రజా సంఘాల నాయకులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ న్యాయమేనా డిమాండ్లను అధికార దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారం చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అవసరమైతే ఇట్టి విషయంపై అసెంబ్లీలో చర్చించడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. అనంతరం రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ ఇప్పుడు ఏర్పడిన బస్తీలలో కొత్తగా నిర్మించుకున్న ఇండ్లకు కరెంటు మీటర్లను ఇవ్వకపోవడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా గతంలో ఒక ఇంటికి ఒక్క మీటర్ తీసుకుని ఉంటే ఇప్పుడు సోదరులు విడివిడిగా నిర్మాణాలు చేసుకున్నప్పటికీ కొత్త మీటర్ అనుమతించకపోవడంతో ఒకే మీటర్ పై విద్యుత్తు ఉపయోగించుకోవడం వలన అధికంగా కరెంట్ బిల్లు వస్తున్నాయని అన్నారు. ఇప్పటికైనా నిషేధిత జాబితా నుండి ఎప్పుడో నిర్మాణాలు జరిగిన బస్తీలను తొలగించి నూతన మీటర్లను ఇవ్వడానికి ప్రభుత్వం, అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, స్థానిక నాయకులు కే సందీప్ కుమార్, గోపాల్ రెడ్డి, శేషు, గణపతి, ఎల్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో పారిశుద్ధ్యం, వీధిదీపాలు, రోడ్ల సమస్యలు పరిష్కరించాలి

**ఉప్పల్, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో నెలకొన్న పారిశుద్ధ్యం, వీధిదీపాలు, రోడ్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని భగాయత్ సంక్షేమ సంఘం సభ్యులు అధికారులను కోరారు. మల్కాజిగిరి కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీ.ఎన్ రఘు ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. లేఅవుట్‌లో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడంతో దోమల బెడద తీవ్రంగా పెరిగిందని, దీని వల్ల నివాసితులు డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులకు గురవుతున్నారని వారు వివరించారు. చెత్త తొలగింపు చర్యలు సక్రమంగా లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా వీధిదీపాలు లేకపోవడంతో రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లేఅవుట్‌లోని రోడ్లు గుంతలమయంగా మారి వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే సంబంధిత కార్యాలయాలకు పలుమార్లు వినతులు అందజేసినా స్పందన లేకపోయిందని, ఇకనైనా కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఉప్పల్ పరిధిలోని లక్ష్మారెడ్డి కాలనీ, సూర్యనగర్ కాలనీ, రాజ్‌నగర్ కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణం సమయంలో రోడ్లపై పెద్ద ఎత్తున మట్టి కుప్పలు వేసి వాటిని తొలగించకుండా వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కూడా వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భగాయత్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకల మధుసూదన్ రెడ్డి, గరికపాటి శివప్రసాద్, ముజకరి పవన్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



## బాలికల భద్రత, సంరక్షణ షీ టీం లక్ష్యం




**తెలకపల్లి, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** బాలికల భద్రతా సంరక్షణ షి టీం లక్ష్యమని ఎస్సై రజిత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గర్ల్ చైల్డ్ ఎంపర్మెంట్ డెవలప్మెంట్ లో భాగంగా జిల్లాస్థాయి షి టీం నిర్వాహకులు విద్యార్థులకు ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎస్సై రజిత మాట్లాడుతూ షి టీం ఒక ఉద్దేశం బాలికల భద్రత గురించి సంరక్షణ అని అన్నారు. అమ్మాయిలను అమ్మడం లాంటి వాటిపైన విద్యార్థి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రజిత తోపాటు ఏఎస్ఐ విజయలక్ష్మి, అడ్వకేట్ గాయత్రి, కానిస్టేబుల్ వెంకటేష్, ప్రధానోపాధ్యాయులు శోభన్ బాబు, జిసిఈడి ఇన్చార్జి ఉపాధ్యాయురాలు సుజాత, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
24 ఫిబ్రవరి 2026

# పార్టీలకతీతంగా మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలి

- బాధ్యతలు చేపట్టిన నూతన మున్సిపల్ పాలకవర్గం
- ఎమ్మెల్యే సునీత రెడ్డి

**నర్సాపూర్, ఫిబ్రవరి 23 (జనంసాక్షి) :** పార్టీలకతీతంగా నర్సాపూర్ మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఎన్నికైన పాలకవర్గం సోమవారం నర్సాపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నూతన పాలకవర్గం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయంలో నూతన మున్సిపల్ చైర్ పర్సన్ మాచునూరి లక్ష్మీ రాజు యాదవ్ అధ్యక్షతన మున్సిపల్ మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమా వేషానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సునీత రెడ్డి హాజరు కాగా మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సునీత రెడ్డి సమక్షంలో నూతన పాలకవర్గం కు పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా



మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీ రాజు యాదవ్ మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్ లను సీట్లపై కూర్చుండ పెట్టారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే సునీత రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీరాజు యాదవ్ కు వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్ తోపాటు కౌన్సిలర్లు అందరికీ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ పార్టీలక తీతంగా నర్సాపూర్ మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మున్సిపల్ పాలకవర్గం అందరూ కలిసికట్టుగా ఉండి అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలి అన్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఏ వార్డులోనైనా నెలకొన్న సమస్యలు తమ దృష్టికి తెస్తే పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానన్నారు. మున్సిపల్ పాలకవర్గం మున్సిపల్ అధికారులు కలిసి నర్సాపూర్ మున్సిపాలిటీ ఆదర్శం మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలన్నారు. ఈ సమావేశంలో చైర్ పర్సన్ లక్ష్మీ రాజు యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవులు మాట్లాడుతూ పాలకొరకు అందరం కలిసి నర్సాపూర్ పట్టణ అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. ఈ మేరకు తమకు మున్సిపల్ పాలకవర్గం ఎన్నుకున్న నర్సాపూర్ పట్టణ ప్రజలకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్ కోసం రెండు నెలల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలి

- బిఎంఈఓ నిజాముద్దీన్



**కృష్ణ, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** విద్యార్థుల భవిష్యత్ కోసం ఉపాధ్యాయులు రెండు నెలల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని కృష్ణ ఏంఈ ఓ నిజాముద్దీన్ సూచించారు. సోమవారం కృష్ణా మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయుల సముదాయ సమావేశం స్థానిక ప్రధానోపాధ్యాయులు కిషోర్ సార్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మండల విద్యాధికారి నిజాముద్దీన్ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేస్తూ మిగితా రెండు నెలలకు విద్యార్థులకు చక్కగా తెలుగు, ఆంగ్లం, గణితం భోధించడానికి సరైన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అలాగే ఆర్ పిలు అన్ని విషయాలను ఉపాధ్యాయులకు వివరించడం జరిగింది, కార్యక్రమం లో ఆర్ పి నల్లే శివరాజ్, హనుమదాస్, ఖాసీం అలీ, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన




**కొల్చారం, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** రంగంపేట్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) సౌజన్యంతో రైతులకు ప్రకృతి వ్యవసాయం మరియు ప్రస్తుతం వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ మాట్లాడుతూ పంటలలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. నేలలో సేంద్రియ కర్బనం ప్రాముఖ్యత గురించి మరియు దానిని ఎలా పెంచుకోవాలో వివరించారు. రైతులకు వ్యవసాయంలో వస్తున్నటువంటి నూతన సాంకేతిక అంశాలు, యూరియా వాడకం తగ్గించడం, మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాల గూర్చి, భూగర్భ జలాల పరిరక్షణ కోసం సాగు నీటి వినియోగం పై అవగాహన, పంటల మార్పిడి వంటి అంశాల గూర్చి విస్తృతంగా రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాధికారి మాట్లాడుతూ సబ్సిడీలో వ్యవసాయ యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయని కావలసినవారు వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌడిపల్లి డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ అఫ్ అగ్రికల్చర్ పుణ్యవతి, మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి , ఏ ఈ ఓ లు రోజా, అంబికా మరియు రైతులు పాల్గొన్నారు.

## సమస్యలపై నిర్భయంగా ఫిర్యాదు చేయండి

- ప్రజావాణి కార్యక్రమంలో పిర్యాదులను స్వీకరించిన
- అదనపు జిల్లా ఎస్పీ ఎస్. మహేందర్



**మెదక్, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు జిల్లా ఎస్పీ ఎస్. మహేందర్ ప్రజల నుండి పిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని పలు గ్రామాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలు, వివాదాలు, పోలీసు సంబంధిత ఇబ్బందులను అదనపు ఎస్పీకి నేరుగా వివరించారు. ఈ సందర్భంగా ప్రతి ఫిర్యాదుదారునితో అదనపు ఎస్పీ వ్యక్తిగతంగా మాట్లాడి, వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. అందిన పిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని కేసుల విషయంలో సంబంధిత ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ మాట్లాడుతూ, పోలీస్ శాఖ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఎలాంటి పైరవీలు అవసరం లేకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలని సూచించారు. చట్టపరమైన మార్గంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు నిర్భయంగా తమ సమస్యలను వెల్లడించాలని, పోలీస్ వ్యవస్థ పూర్తిగా ప్రజల కోసమేనని స్పష్టం చేశారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఇప్పటికే అనేక సమస్యలు పరిష్కారమై, ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం మరింత పెరుగుతోందని అదనపు ఎస్పీ పేర్కొన్నారు.

# బీరంగూడ గుట్ట జాతర విజయవంతం

**అమీన్‌పూర్, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** బీరంగూడ గుట్ట శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి మహాశివరాత్రి జాతర మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించిన ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, ఉత్సవాల విజయవంతానికి సహకరించిన పోలీస్, జిహెచ్ఎంసి అధికారులను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జాతర ముగింపు సందర్భంగా వారికి స్వామివారి ప్రసాదాలను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. జాతరలో లక్షలాదిగా తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించిన సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్, శేరిలింగంపల్లి జోన్ డీసీపీ శ్రీనివాస్, జోన్ అడిషనల్ డిసిపి ఉదయ్ రెడ్డి, రామచంద్రపురం ఏసీపీ శ్రీనివాస్ కుమార్, క్షేత్రస్థాయిలో బందోబస్తును సమన్వయం చేసిన అమీన్‌పూర్ సిఐ నరేష్ లను చైర్మన్ సుధాకర్



యాదవ్ ప్రత్యేకంగా కలిశారు. పారిశుద్ధ్యం, ఇతర మౌలిక వసతులను పర్యవేక్షించిన అమీన్‌పూర్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్‌కు స్వామివారి శేషవస్త్రం కప్పి, ప్రసాదాలను అందజేశారు. చైర్మన్ సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ మహాశివరాత్రి జాతరను భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో నిర్వహించడంలో పోలీస్ యంత్రాంగం, జిహెచ్ఎంసి అధికారుల కృషి మరువలేనిదన్నారు. భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్, డీసీపీ, , అడిషనల్ డిసిపి, ఏసీపీ, సిఐ నరేష్ పర్యవేక్షణ విధులు నిర్వహించారన్నారు. అందుకే ఆలయ కమిటీ పక్షాన వారికి ధన్యవాదాలు తెలుపుతూ స్వామివారి ఆశీస్సులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్‌తో పాటు దేవాదాయ శాఖ జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, మహేష్, శ్రీనివాస్, రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

# ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

- జిల్లా ఎస్పీ డి.జానకి

**మహబూబ్ నగర్ రూరల్, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** జిల్లా ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించడం పోలీస్ శాఖ ముఖ్య బాధ్యత అని జిల్లా ఎస్పీ డి.జానకి, తెలిపారు. సోమవారం నిర్వహించిన ఫిర్యాదుల దినోత్సవం సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులను ఎస్పీ స్వయంగా కలుసుకుని వారి సమస్యలను క్షుణ్ణంగా విని స్పందించారు. ఈ సందర్భంగా మొత్తం 19 ఫిర్యాదులు స్వీకరించగా, ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యంగా పరిగణించి సంబంధిత అధికారులకు వెంటనే పంపించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కొన్ని అంశాలపై ఎస్పీ స్వయంగా సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్ ద్వారా మాట్లాడి, ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు పోలీస్ శాఖపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టడం అత్యంత ముఖ్యం అని, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం లేదా నిర్లక్ష్యం సహించబడదని తెలిపారు. ప్రతి ఫిర్యాదు



దారునికి గౌరవప్రదంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగం మరియు బాధ్యతాయుత వైఖరి పాటించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలకు సమయానికి స్పందించడం ద్వారా పోలీస్ శాఖపై విశ్వాసం మరింత బలపడుతుందని, ఫిర్యాదుదారులకు ప్రాధాన్యత ఇవ్వడం తమ విధి మరియు బాధ్యత అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

## కాంగ్రెస్ నాయకులు గూండా గిరి చేస్తే సహించేది లేదు

- కామారెడ్డి ఘటనపై నిందితులను కఠినంగా శిక్షించాలి
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కొండయ్య



**మక్తల్, ఫిబ్రవరి 23 (జనంసాక్షి) :** కాంగ్రెస్ నాయకులు చట్టాన్ని ఉల్లంఘిస్తూ గూండా గిరి చేస్తే సహించేది లేదని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కొండయ్య అన్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడిచేయడాన్ని, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్ర రావు, పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ లను అక్రమ అరెస్టుకు నిరసనగా సోమవారం మక్తల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో భారతీయ జనతా పార్టీ మక్తల్ శాఖ అధ్యక్షులు బాయికాటి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు కొండయ్య మాట్లాడుతూ కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి క్యాంపు కార్యాలయం పై దాడి చేసిన వారిని వదిలేసి భాజపా నాయకుల మీద కార్యకర్తల మీద అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడము కాంగ్రెస్ ప్రభుత్వ పక్షపాత వైఖరికి నిదర్శనం అన్నారు. అక్రమ అరెస్టులతో భాజపా ఎదుగుదలను ఆపలేరు అన్నారు. రాష్ట్ర పోలీసు యంత్రాంగము శాంతి భద్రతలను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు బలరాం రెడ్డి, డోకుర్ తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షులు కర్ని స్వామి, జిల్లా నాయకులు దేవరెంటి నరసింహారెడ్డి, చంద్రశేఖర్, సత్యనారాయణ, మాధ్వార్ సర్పంచు శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ లు పీకే నరసింహ, టప్ప కృష్ణ మాజీ కౌన్సిలర్లు కోల్పూరు కొండయ్య, ఈసారి నాగప్ప, సత్యనారాయణ కావలి, రేణుక నరసింహ, పట్టణ ప్రధాన కార్యదర్శులు నరేందర్, కురువ లింగం, బీజేవైఎం నాయకులు బ్యాటరీ రాజు, రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరగాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** ఈ నెల 25 నుంచే జరగబోయే ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. ఈ నెల 25 వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యనశీ 12 గంటల వరకు జరిగే ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరగాలని, ఈ సం: ఇంటర్ మొదటి సంవత్సరం లో 6309, రెండవ సం. 6025 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా 28 కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి ఇంటర్ బోర్డు నుంచి పర్యవేక్షణ జరుగుతుందన్నారు. ఏలాంటి పేపర్ లీకేజీ లేకుండా, విద్యార్థులు కింద కూర్చొని పరీక్షలు రాయకుండా, మాల్ ప్రాక్టీస్కు అవకాశం లేకుండా, పరీక్ష అనంతరం పరీక్ష పేపర్లను పోలీస్ ఎస్కార్ట్ వాహనంతో జాగ్రత్తగా పోస్టల్ డిపార్ట్మెంట్ కు తరలించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల హాల్ టికెట్ల మీద క్యూఆర్ కోడ్ ఉపయోగించుకుని పరీక్షా కేంద్రాల అడ్రస్ ను



సునాయాసంగా తెలుసుకోవచ్చు అన్నారు. పరీక్షా కేంద్రాల్లో ప్రతి హాలులో త్రాగునీరు, విద్యుత్ సరఫరా, గోడ గడియారం తప్పనిసరిగా ఉండాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, మెడికల్ కిట్టు, అత్యవసర మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలనీ సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో పరీక్షలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని తెలిపారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ నగేష్, ఇంటర్ విద్యాధికారి మాధవి, ఇంటర్ పరీక్షల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్

**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** మార్చి 14వ తేదీ నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించు పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ఎలాంటి సమస్యలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత జిల్లా స్థాయి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బి. ఎం.సంతోష్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 40 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 8,110 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాలను కలెక్టరేట్ స్ట్రాంగ్ రూమ్ నుంచి



జిల్లాలోని 9 పోలీస్ స్టేషన్లకు పంపించి అక్కడి నుంచి పరీక్షా కేంద్రాలకు తరలించేందుకు నాలుగు రూట్లను ఏర్పాటు చేశామని, పటిష్ట పోలీస్ బందోబస్తు నియమించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ తరపున ప్రతి పరీక్ష కేంద్రంలో ప్రాథమిక చికిత్స తో పాటు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులు నిర్దేశిత సమయంలోగానే తమ పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ తరపున అదనపు బస్సులను నడిపేందుకు కృషి చేయాలన్నారు. వేసవిలో విద్యుత్ డిమాండ్ అధికంగా ఉంటుండడంతో పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. తపాలా, ట్రెజరీ,మున్సిపల్, రెవెన్యూ,రవాణా శాఖ అధికారులు కూడా పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,అదనపు ఎస్పీ శంకర్, డీఈవో విజయలక్ష్మి, ఆర్డీవో శ్రీనివాసులు, వైద్య ఆరోగ్యశాఖ నుండి జి. రాజు,సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



**కృష్ణ, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ ,వార్డు సభ్యులు ప్రధానంగా ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్యం పట్ల, శ్రద్ధ వహించాలని కృష్ణ ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. స్థానిక రైతు వేదికలో నూతన,వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధం, లేఅవుట్, పారిశుధ్యం, పన్నుల వసూలు పై అవగాహన కల్పించారు. ఎంపిడిఓ విజయ్ లక్ష్మీ తెలిపారు. కొత్తగా ఎన్నికైన వార్డు సభ్యులకు ఐదు రోజులపాటు ఈ శిక్షణ అవగాహన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఐదు రోజుల తర్వాత ఎగ్జామ్ ఆన్లైన్లో రాయాలి అని అన్నారు. అనంతరం రాసిన వాళ్లకు సర్టిఫికెట్ ఇస్తారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్యాంసుందర్ రెడ్డి, కె వీరన్న, బుచ్చారెడ్డి, రమేష్, సూపర్డెంట్ రామకృష్ణారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పది పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో 10 వ తరగతి పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, వైద్య, సమాచార, పంచాయతి రాజ్, రవాణా, విద్యుత్తు, ఆర్టీసీ, ట్రెజరి, పోస్టల్, మున్సిపల్ అధికారులతోసమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 2026లో పరీక్షలు నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వ పరీక్షల నియంత్రణాధికారి, హైదరాబాద్ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం ఎస్ఎస్సి పబ్లిక్ పరీక్షలు మార్చి 14నుండి ఏప్రిల్ 16 వరకు జరుగనున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణలో ఎటువంటి అంతరాయం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు అవసరమైన భద్రతా చర్యలు, రవాణా సౌకర్యాలు, వైద్య సదుపాయాలు, విద్యుత్ సరఫరా, ప్రశ్నాపత్రాల రవాణా భద్రత తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ బందోబస్తు మధ్య ప్రశ్న, జవాబు పత్రాలు తరలించాలని సూచించారు. జిల్లాలో 21 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పర్యవేక్షణకు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసి వేయాలని,144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అత్యవసర సేవలకు వైద్య కేంద్రాలు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని, అలాగే 108 వాహనాలు, ప్రధాన ఆసుపత్రిలో అత్యవసర వార్డులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి అనువుగా అదనపు బస్సులు నడపాలని తెలిపారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రం చేయాలని పంచాయతి, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఏఎస్పి నరేష్ కుమార్, డీఈఓ రాజేందర్, వైద్యాధికారి మధుసూదన్, ఆర్టిఓ సంధాని, ఆర్టీసీ డిఎం ఇందు, డిపిఓ శ్రీలత, విద్యుత్, పోస్టల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అంతరాష్ట్ర సైబర్ మోసగాళ్ల గ్యాంగ్ అరెస్ట్

- నిందితుల్లో ఒకరు మైనర్
- 1500 సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్స్ స్వాదీనం
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ ప్రతిని (జనంసాక్షి) :** సైబర్ క్రైమ్ పై ఉక్కు పాదం మోపుతూ, సైబర్ క్రైమ్ నేరాలను తగ్గించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం మరో అడుగు ముందుకు వేసిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. అంతరాష్ట్ర సైబర్ నేరగాళ్ల ముఠా గ్యాంగ్‌ను అరెస్టు చేసి పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం సుమారు 04.00 గంటల సమయంలో ఎన్టీఆర్ చౌక్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో నలుగురు సైబర్ మోసగాళ్లను పోలీసులు అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఈ విషయమై అదే రోజు సాయంత్రం 06.30 గంటలకు జి. రమ్య, ఎస్ఐపీ, ఆదిలాబాద్ వన్ టౌన్ లో వారు ఫిర్యాదు చేశామని తెలిపారు. నిందితులు కొంతకాలంగా ఆదిలాబాద్ పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజల వద్ద నుండి పాత మొబైల్ ఫోన్లను తక్కువ ధరలకు కొనుగోలు చేసి, వాటిలోని మదర్‌బోర్డులు, బ్యాటరీలు, సాకెట్లు వేరుచేసి ఇతర రిపేర్ చేసిన ఫోన్లలో అమర్చేవారు. పాత మొబైల్ ఫోన్ల ద్వారా కస్టమర్ల డేటా, ఐఎంఈఐ నంబర్లు సేకరించి బ్యాంకు అధికారులమని చెప్పి అమాయక ప్రజలను మోసం చేసి, ఓటీపీలు పొందుతూ వారి ఖాతాల నుండి డబ్బులు దోచుకునే సైబర్ మోసాలకు పాల్పడే ఉద్దేశంతో వ్యవహరిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. మిగిలిన స్క్రాప్ మొబైల్ ఫోన్లను ఢిల్లీలో తెలియని వ్యక్తులకు విక్రయించి లాభాలు ఆర్జించేవారు. ఆదివారం రెండు బ్యాగులు, చిన్న కవర్లలో స్క్రాప్/పాత మొబైల్ ఫోన్లు దాదాపుగా 1500 తీసుకుని ఆదిలాబాద్ బస్ స్టాండ్ వైపు వెళ్తుండగా వారిని ఎన్టీఆర్ చౌక్ వద్ద పోలీసులు పట్టుకోవడం జరిగింది. వారి వద్ద నుండి పరస్పర సమాచారం పంచుకోవడానికి ఉపయోగించిన నాలుగు సెల్ ఫోన్లు, పాత మొబైల్ ఫోన్లు, మదర్‌బోర్డులు, బ్యాటరీలు తదితర వస్తువులను స్వాధీనం చేసుకుని ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని అన్నారు. ముఖ్యంగా ప్రజలు తక్కువ ధరకు తమ మొబైల్ ఫోన్లను విక్రయిస్తూ మోసపోవడం జరుగుతుందని, పరోక్షంగా నేరాలలో తమ పాత్ర ఉండేలా జరుగుతుందని వాటి వల్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా ఈ సైబర్ నేరగాళ్లు ఇతర దేశాల నుండి మరియు ఇతర రాష్ట్రాల నుండి మీకు చెందిన మొబైల్ ఫోన్ల ద్వారా సైబర్ నేరాలు చేసే అవకాశాలు ఉన్నాయి. వాటిలో మీరు చిక్కుకునే ప్రమాదం ఉన్నందున, తెలియని వారికి మొబైల్ ఫోన్లను అమ్మ వద్దని సూచించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, వన్ టౌన్ సిఐ బి సునీల్ కుమార్, ఎస్సైలు నాగనాథ్, అశోక్, రమ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతులను త్వరగా పరిష్కరించాలి

- హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి



**హనుమకొండ ప్రతినిధి ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన వినతులను అధికారులు త్వరగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, ఇతర అధికారులతో కలిసి వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు 165 వినతులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. సమాచార హక్కు చట్టం కింద అడిగిన సమాచారాన్ని పి ఐ ఓ లు ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వై వి గణేష్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టానికి సంబంధించిన దరఖాస్తులు కూడా పెండింగ్ లో ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తులను పబ్లిక్ డోమైన్ లో పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, సిపిఓ సత్యనారాయణరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దారులు , ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మరింత శ్రమిస్తే జాతీయ స్థాయిలోనూ రాణించగలం

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్




**వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** మరింత శ్రమిస్తే జాతీయ స్థాయిలో కూడా పతకాలను సాధించగలమని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్ వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో పతకాలను సాధించిన వరంగల్ కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులకు అభినందన సభను సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయము ఏర్పాటు చేసారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ముఖ్య అతిధిగా పాల్గోన ఈ అభినందన కార్యక్రమములో పోలీస్ కమిషనర్ ముందుగా పతాకాలను సాధించిన క్రీడాకారులను వ్యక్తిగతంగా కలిసి అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా హాకీ క్రీడాకారులు సంయుక్తంగా కలసి వరంగల్ పోలీస్ కమిషనర్‌కు హాకీ జెర్సీని బహుకరించడంతో పాటు, ఈ రాష్ట్ర స్థాయిలో క్రీడల్లో టెబుల్ టెన్నిస్ క్రీడలో కాంస్య పతకాన్ని సాధించిన వరంగల్ పోలీస్ కమిషనర్‌కు ఈస్ట్‌జోన్ డిసిపి అంకిత్ కుమార్ చేతుల మీదుగా సీపీ పతకాన్ని అందజేసారు. అనంతరం పోలీస్ కమిషనర్ క్రీడాకారులను ఉద్యేశిస్తూ మాట్లాడుతూ ముందుగా పతకాలను గెలిచిన క్రీడాకారులతో పాటు, ఈ క్రీడల్లో పాల్గోన్న క్రీడాకారులకు సైతం అభినందనలు తెలియజేస్తూ, వరంగల్ కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులు ఈ రాష్ట్రా స్థాయిలో క్రీడల్లో అద్భుత ప్రదర్శనతో గత ఏడాది కంటే ఎక్కువ సంఖ్యలో పతకాలను కైవసం చేసుకోవడం చాలా సంతోషాన్ని కలిగిస్తోందని. ఇదే ప్రదర్శన రాబోవు రోజుల్లో కనబర్చాలని, ముఖ్యంగా జాతీయ స్థాయిలో జరిగే క్రీడల్లో పతకాలను సాధించేందుకుగా ముమ్మరంగా సాధన చేయాలని, క్రీడల్లో రాణించే వారికి తప్పక సహకారం అందించడం జరుగుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ కార్యక్రమములో డిసిపిలు దార కవిత, అంకిత్ కుమార్, ట్రైనీ ఐపిఎస్ మనిషా నేహ్రా, అదనపు డిసిపిలు సురేష్ కుమార్, రవి,శ్రీనివాస్, ఏసిపిలు నాగయ్య, సురేంద్ర, జితేందర్ రెడ్డి, మధుసూదన్, అంతయ్య, ఆర్.ఐలు స్పర్జన్ రాజ్, సతీష్,ఇన్స్‌స్పెక్టర్ షూకూర్, ఆర్.ఎస్.ఐ శరత్,మణికష్ణ ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గోన్నారు.



## కౌన్సిలర్ రద్దుపై కోర్టు స్టేకు కృషి చేస్తా

- గుండ స్నేహకు కేటీఆర్ హామీ

**అసిఫాబాద్, ఫిబ్రవరి 23 (జనంసాక్షి) :** ఇటీవల జరిగిన ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఎన్నికలలో విప్ ధిక్కరించి బిఆర్ఎస్ కు మద్దతుగా నిలిచారని కౌన్సిలర్ సభ్యత్వాన్ని రద్దు చేసిన నేపథ్యంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి తో కలిసి హైదరాబాద్ లోని కేటీఆర్ క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో పరిస్థితిని ఆయనకు వివరించామని, కేటీఆర్ మాట్లాడుతూ కౌన్సిలర్ పదవికి ఎటువంటి డోకా లేదని హామీ ఇచ్చినట్లు గుండ శ్యామ్ దంపతులు తెలిపారు. తన వ్యక్తిగత లాయర్ తో మాట్లాడి వారం రోజుల్లోపు కౌన్సిలర్ రద్దు పై స్టే వచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపినట్లు వివరించారు. ఎమ్మెల్యే కోవలక్ష్మి తో కలిసి పని చేయాలని సూచించడంతో పాటు రానున్న రోజుల్లో తమ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిర్యాని బీఆర్ఎస్ నాయకుడు జగదీష్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడల్లో ఆదిలాబాద్ ప్రభంజనం

- 35 పతకాలతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం
- విజేతలను అభినందించిన కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** రాష్ట్ర రాజధాని హైదరాబాద్లో ఈ నెల 17న నిర్వహించిన తొలి రాష్ట్రస్థాయి ప్రత్యేక అవసరాల గల పిల్లల క్రీడా పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. వివిధ విభాగాల్లో సమిష్టి ప్రతిభతో మొత్తం 35 పతకాలు సాధించి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా విజేత విద్యార్థులను, వారికి శిక్షణనిచ్చిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేసి, క్రీడల్లో మరింత రాణించాలని ప్రోత్సహించారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో అపారమైన ప్రతిభ దాగి ఉందని, క్రీడల్లో వారు సాధించిన ఈ విజయం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. సరైన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం ఉంటే వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో కూడా రాణించగలరని పేర్కొన్నారు. జిల్లా నుంచి మొత్తం 26 మంది విద్యార్థులు ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. ప్రత్యేక అవసరాలు ఉన్నప్పటికీ తమ ప్రతిభను నిరూపించుకుంటూ రాష్ట్రస్థాయిలో అగ్రస్థానాన్ని సాధించడం విశేషమని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కోచ్‌ల సహకారం కీలకమని, భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొనేలా అవసరమైన సహకారం అందిస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ అధికారులు తిరుపతి, రఘు రమణ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలి

- పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- మొత్తం 78 దరఖాస్తులు స్వీకరణ
- జిల్లా అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్



**జనగామ ప్రతినిధి, ఫిబ్రవరి 23 (జనంసాక్షి) :** జిల్లా లోని వివిధ ప్రాంతాల ప్రజలు ప్రజావాణిలో అందచేసిన అర్జీలపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో స్టేషన్ ఘన్‌పూర్ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.ఎస్. వెంకన్న తో కలిసి అదనపు కలెక్టర్ ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసి, దరఖాస్తులను పరిశీలించి , త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తుల పై సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసి అందజేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజావాణి యొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు. అలాగే జిల్లాలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ లో వచ్చిన ధరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అవరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి, త్వరితగతిన పరిష్కరించి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు, పెండింగ్లో ఉన్న అర్జీలపై జాప్యం లేకుండా ప్రత్యేక దృష్టి సారించి, తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటి వరకు స్వీకరించిన దరఖాస్తులలో ఏమైనా పెండింగ్ లో ఉంటే సత్వరమే పరిష్కరించి, అట్టి వివరాలను సంబంధిత వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులకు ఆదేశించారు. మొత్తం 78 అర్జీలు స్వీకరించామని ఆయన తెలిపారు. ఈ ప్రజావాణిలో జిల్లా పరిపాలన అధికారి సిహెచ్. శ్రీకాంత్, వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీదారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ రాష్ట్రస్థాయి క్రీడల్లో తండ్రీ కొడుకుల ఘనత

### బాస్కెట్‌బాల్ పోటీలో బ్రాంజ్ మెడల్



**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 23 (జనంసాక్షి):** హైదరాబాద్‌లో జరిగిన 4వ తెలంగాణ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోలీస్ మీట్‌లో రామకృష్ణాపూర్‌కు చెందిన తండ్రి కొడుకుల ఘనత రాష్ట్రస్థాయిలో ప్రతిభను చాటింది. మొండాల్ శ్రీనివాస్, ఆయన కుమారుడు శివకృష్ణ జోన్ తరపున బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించారు. పోటీలకు వేదికైన హైదరాబాద్లో వీరి ఆటతీరు ప్రశంసలు పొందింది. తండ్రి శ్రీనివాస్ గతంలోనూ అనేక మెడల్స్ సాధించగా, కుమారుడు శివకృష్ణ ఆల్ ఇండియా పోలీస్ మీట్‌లో పాల్గొని తన ప్రతిభను నిరూపించాడు. ఈ విజయాన్ని గుర్తించిన రామగుండం పోలీస్ కమిషనర్ వీరిద్దరినీ ప్రత్యేకంగా అభినందించి రివార్డు ప్రకటించారు. ప్రస్తుతం శ్రీనివాస్ భూపాలపల్లి జిల్లాలో హెడ్ కానిస్టేబుల్‌గా, శివకృష్ణ మంచిర్యాల జిల్లాలో క్లూస్ టీం విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరి విజయంపై ఆర్కేపీ ఠాగూర్ స్పోర్ట్స్ క్లబ్ తరపున క్రీడాకారులు నూనె శ్రీనివాస్, బెల్లం శ్రీను, ఈశ్వరచారి, చిన్నయ్య, పలువురు అభినందనలు తెలిపారు. రామకృష్ణాపూర్‌కు గర్వకారణంగా నిలిచిన ఈ తండ్రికొడుకులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజావాణి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి ,ఫిబ్రవరి 23,(జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి అర్జీదారుల నుండి నుండి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల మండల కేంద్రానికి చెందిన రైతులు తమకు 2007 సంవత్సరంలో ఇచ్చిన భూమిలో తాము సాగు చేసుకుంటున్నామని, డిజిటల్ పాస్ పుస్తకాలు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు.బెల్లంపల్లి మండలం గంగారం నగర్ బస్తికి చెందిన చిప్ప హరీష్ బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని వ్యాపారం కొనసాగిస్తున్న విషయంపై వెంటనే స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామ ప్రజలు తమ గ్రామంలోని బి సి కాలనీలో జిల్లా కలెక్టర్ ఆదేశాలను ఉల్లంఘిస్తూ చట్టవిరుద్ధంగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ అక్రమంగా చేపట్టిన పనులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎడ్ సెట్ 2026 షెడ్యూల్ విడుదల

- ఆన్లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- మే నెల 12న ప్రవేశ పరీక్ష
- వివరాలు వెల్లడించిన కేయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య ప్రతాపరెడ్డి




**వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 2026 విద్యా సంవత్సరానికి బి.ఎడ్ ప్రవేశాల కోసం నిర్వహించబడనున్న టీజీ ఎడ్ సెట్2026 పూర్తి షెడ్యూల్‌ను కాకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో విడుదల చేశారు. టీజీ ఎడ్ సెట్-2026 చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి 23వ తేదీ, సోమవారం వాణిజ్య-వ్యవస్థాపక శాస్త్రాల సభాభవనంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫిబ్రవరి 20న ప్రకటన విడుదల చేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి 23 నుండి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఓసి/బిసి అభ్యర్థులు రూ. 750 పరీక్షా రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ/ఎస్టీ/వికలాంగ అభ్యర్థులు రూ. 550 చెల్లించి నమోదు చేసుకోవచ్చు.దరఖాస్తుల సమర్పణకు ఏప్రిల్ 15ను చివరి తేదీగా నిర్ణయించారు. రూ. 250 అపరాధ రుసుముతో ఏప్రిల్ 22 వరకు, మరోసారి రూ. 250 అపరాధ రుసుముతో ఏప్రిల్ 27 వరకు, రూ. 1000 అపరాధ రుసుముతో ఏప్రిల్ 30 వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయి. మే 2 నుండి దరఖాస్తుల్లో మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం కల్పించబడుతుంది. మే 4న పరీక్షా కేంద్రాల కేటాయింపు జరుగుతుంది. రూ. 5000 అపరాధ రుసుముతో మే 8, 9 తేదీలలో ప్రత్యేక అవకాశం కల్పించబడుతుంది. ప్రవేశ పత్రాలు మే 9 నుండి పొందవచ్చు.ప్రవేశ పరీక్ష మే 12న ఉదయం 10.00 గంటలకు, మధ్యాహ్నం 2.00 గంటలకు రెండు విడతలలో నిర్వహించ బడుతుంది. మే 15న ప్రాథమిక సమాధాన సూచిక విడుదల అవుతుంది. మే 17 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. తుది ఫలితాలు మే 30న ప్రకటించబడతాయి. టీజీ ఎడ్ సెట్--2026 నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 16 నగరాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కన్వీనర్ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌ను 4 భాగాలుగా విభజించారు. నల్గొండ, కోదాడ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్ నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, సిద్దిపేట్ నగరాల్లో పరీక్షా కేంద్రాలు ఉంటాయి. ఈ సమావేశంలో కన్వీనర్ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, విద్యాశాఖ డీన్ ఆచార్య ఎన్. రామనాథ కిషన్, విద్యా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజీ ఎడ్ సెట్-2026 అధికారిక వెబ్‌సైట్‌ను కూడా ఆవిష్కరించారు.

# టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

• కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 23 (జనంసాక్షి) :** త్వరలో నిర్వహించు ఇంటర్మీడియట్, పదవ తరగతి వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ఇంటర్మీడియట్, పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు ఇంటర్మీడియట్, మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు పదవ తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించబడతాయని, ఇట్టి వార్షిక పరీక్షలకు సంబంధిత శాఖలు అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఎటువంటి అంతరాయం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు అవసరమైన భద్రతా చర్యలు, రవాణా సౌకర్యాలు, వైద్య సదుపాయాలు, విద్యుత్ సరఫరా, ప్రశ్నాపత్రాల రవాణా మరియు భద్రత తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ బందోబస్తు మధ్య ప్రశ్న, జవాబు పత్రాలు డోర్ క్లోజ్డ్ వాహనాలలో మాత్రమే తరలించాలని సూచించారు. జిల్లాలో 69 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహణకు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పర్యవేక్షణకు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి అనువుగా అదనపు బస్సులు నడపాలని తెలిపారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రం చేయాలని పంచాయతి, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డిఈఓ అశోక్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి భాను నాయక్, డిపిఓ యాదగిరి, పోలీస్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవు

• కార్మికుల భద్రతే ప్రథమ ప్రాధాన్యం
• విజె సాయి కెమికల్ కంపెనీ ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని దోతిగూడెం గ్రామం విజె సాయి కెమికల్ కంపెనీలో ఇటీవల జరిగిన ప్రమాదం నేపథ్యంలో ఆయన సోమవారం పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రమాద స్థలాన్ని సమీక్షించిన ఎమ్మెల్యే, కంపెనీ యాజమాన్యానికి కఠిన హెచ్చరికలు జారీ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సమగ్ర భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశ్రమలో ఉత్పత్తి ప్రక్రియలో కాలుష్య నియంత్రణ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, కార్మికుల భద్రతే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపి మధుసూదన్ రెడ్డి, సిఐ రాములు, ఎస్సై భాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, జిల్లా నాయకులు సామ మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై సత్వరమే చర్యలు తీసుకోవాలి

• కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 23 (జనంసాక్షి) :** ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, వివిధ శాఖలలో చాలా కాలం పెండింగ్ లో ఉన్న పిర్యాదులపై శాఖల వారీగా ప్రత్యేక శ్రద్ద పెట్టి పరిష్కరించాలని అన్నారు. రాష్ట్ర స్థాయి ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను కూడా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూ సమస్యలకి సంబంధించి 48 దరఖాస్తులు, జిల్లా పంచాయతీ అధికారి 8, వైద్య ఆరోగ్య శాఖ అధికారి 7, డిఆర్డిఓ 6, మిగిలిన 30 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 99 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ దరఖాస్తులను పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.సీతారామారావు , మహిళా, శిశు సంక్షేమ అధికారి కె.నర్సింహారావు, డిఎస్సిడి ఓ కే. దయానంద రాణి, డిఈఓ అశోక్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శంకర్, పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట పట్టణ మరింత సుందరీకరణే లక్ష్యం

• ప్రణాళికాబద్ధంగా పారిశుధ్య పనులు
• త్వరితగతిన అండర్ గ్రౌండ్,డ్రైనేజీ నిర్మాణపు పనులు పూర్తి



**సూర్యాపేట, ఫిబ్రవరి 23 (జనంసాక్షి) :** సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా రూ.50 లక్షల నిధులతో నాలా కల్వర్టు పనులను చేపడుతున్నామని, త్వరలోనే పనులు చేపట్టి రెండు నెలల్లో పూర్తి చేస్తామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని 60 ఫీట్ల రోడ్డులోని నాలా కల్వర్టు పనులకు 47వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్,మున్సిపల్ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కల్వర్టు నిర్మాణం లేకపోవడంతో ముఖ్యంగా స్కూల్, కాలేజి విద్యార్థులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. త్వరితగతిన అండర్ గ్రౌండ్,డ్రైనేజీ నిర్మాణపు పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. సూర్యాపేట మరింత సుందరీకరణే తమ లక్ష్యమని తెలిపారు. అనంతరం 47వ వార్డులోని వాసవి కన్యకపరమేశ్వరి గుడి వెనుక వీధిలో సీసీ రోడ్డు, సీపీఎం కార్యాలయం వెనుక వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజద్ అలి, మున్సిపల్ కౌన్సిలర్ నాగుల వాసు, జిల్లా వాణిజ్య సెల్ చైర్మన్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరెని శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బైరు వెంకన్న గౌడ్, అయూబ్ ఖాన్, రాచకొండ శ్రీనివాస్,దంతాల సాయినవీన్, దంతాల వీరయ్య, అంతటి జానీ, బషీర్, సాజిద్, పిడమర్తి ఉపేందర్, నరేందర్ నాయుడు, పిల్లల నాగరాజు, కుమ్మరికుంట్ల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్ టాపర్లను అభినందించిన ఎమ్మెల్యే



**కోదాడ, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో 99. 56 పర్సంటైల్ సాధించిన రేస్ ఐఐటీ మెడికల్ అకాడమీ విద్యార్థులు ముక్కా చరణ్ సాయి గౌడ్, ఐ. కృష్ణ చరణ్, (95.63,) సిహెచ్ భాను శంకర్, (94.78) విజయ్ చరణ్ (92.52),, జె ప్రవీణ్ (92.16 ) లను సోమవారం క్యాంప్ ఆఫీసు నందు ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో కోదాడ లాంటి పట్టణం నుండి విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు ఈ కళాశాల నుండి పలువురు విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ పర్సంటైల్ సాధించి ఎన్ఐటీ, జేఈఈ అడ్వాన్స్ లో ప్రవేశానికి అర్హత సాధించడం గర్వకారణమని, జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలకు కూడా ఇదే స్ఫూర్తితో సిద్ధమై మరిన్ని విజయాలు సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ బాణాలవసంత వెంకటరెడ్డి, సిరికొండ శ్రీనివాస్, కె. శివ శంకర్, గద్దె సతీష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నాగార్జునసాగర్ నియోజకవర్గ అభివృద్ధికి బాటలు



**గుర్రంపోడు, ఫిబ్రవరి 23 (జనంసాక్షి) :** నాగార్జునసాగర్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా గుర్రంపోడు మండలంలోని గ్రామాలకు రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఆదివారం గుర్రంపోడు మండలంలో రూ. 511.30 లక్షల భారీ అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన బీటీ రోడ్డు పనులకు ఆయన ఘనంగా శంకుస్థాపన చేశారు. మహబూబ్ నగర్ – నల్లగొండ పి.డబ్ల్యు.డి. రోడ్డు 135/4 కిలోమీటరు నుండి సుల్తానుపురం వరకు, తేనెపల్లి తండ, యల్లమోనిగూడెం గ్రామాల మీదుగా ఈ రహదారిని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి పల్లెకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత పాటించాలని, నిర్ణీత కాలవ్యవధిలో రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ శంకుస్థాపన మహోత్సవంలో స్థానిక సర్పంచులు, మండల స్థాయి ప్రజాప్రతినిధులు పార్టీ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమ గ్రామాల మీదుగా బీటీ రోడ్డు మంజూరు చేయడంపై మండల నాయకులు మరియు గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు మరియు ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టణ అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలి

• కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి



**హుజూర్‌నగర్, ఫిబ్రవరి 23 (జనంసాక్షి) :** హుజూర్ నగర్ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి కోరారు. సోమవారం హుజూర్ నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నూతన పాలకవర్గం కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిని కలిసి మాట్లాడారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్ రావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోతిసంపత్ రెడ్డి, మంజుల, ఊహ, కోలా ఉదయభాను, జక్కుల మల్లయ్య, జ్యోతి, నాగలక్ష్మి, పద్మా రెడ్డి, తండు ప్రసాద్ గౌడ్, కామేశ్వరి, సుష్మ, ధనమ్మ, నాగమణి, సైదులు, సావిత్రమ్మ, నందిగామ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

## రాజేష్ కుటుంబానికి ప్రభుత్వం అండ

• ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రం అందజేసిన కలెక్టర్



**కోదాడ, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** కర్ల రాజేష్ కుటుంబానికి ప్రభుత్వం తరపున పూర్తి స్థాయిలో చేయూత అందిస్తామని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ హామీ ఇచ్చారు. రాజేష్ తల్లి లలితమ్మను కలెక్టర్ కోదాడలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగానికి సంబంధించిన నియామక పత్రం కూడా సిద్ధమైందని, మరో రెండు మూడు రోజుల్లోనే లలితమ్మకు నియామక పత్రాన్ని కూడా అందజేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాల బెనిఫిట్స్ ను ఆ కుటుంబానికి వర్తింపజేసి, అన్ని విధాలా అండగా ఉంటామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఆర్డిఓ సూర్యనారాయణ, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి,జిల్లా సంక్షేమ అధికారి దయానందరాణి, తహసిల్దార్ వాజీద్ అలీ,యాతాకుల రాజన్న మాదిగ,ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లా కన్వీనర్, ఎంఎస్పి రాష్ట్ర నాయకులు కొండపల్లి ఆంజనేయులు, ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకులు యలమర్తి రాము మాదిగ, ములకలపల్లి రవి మాదిగ, పిడమర్తి చిన్న వెంకట్రావు, లంజపల్లి శ్రీను, ఆకారపు కొండలు, కొండపల్లి సూర్యప్రకాష్, బొడ్డు కుటుంబరావు, సిరి పంగి లింగస్వామి, ఎమ్మార్పీఎస్ పట్టణ నాయకులు కర్ల శివ, కర్ల కమల్, తదితరులు పాల్గొన్నారుతదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక వాడ ఏర్పాటుకు ఈర్లపల్లి పరిధిలో భారీ బందోబస్తు

• కొనసాగిన భూ సర్వే
• మొత్తం 362.29 ఎకరాలకు కొనసాగిన సర్వే





**బొంరాస్‌పేట దుద్యాల, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** దుద్యాల మండలం ఈర్లపల్లి గ్రామంలో గ్రామ పరిధిలో సోమవారం పారిశ్రామిక వాడ ఏర్పాటుకు సంబంధించి 362.29 ఎకరాలకు భూ సర్వే రెవిన్యూ అధికారులు భారీ బందోబస్తు మధ్య చేపట్టారు. గతంలో జరిగిన సంఘటనలో దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా 150 మంది పోలీసు సిబ్బందితో పరిగి డిఎస్పీ శ్రీనివాస్,కోడంగల్ సిఐ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈర్లపల్లి,సంత్రకుంటతండా,నాన్యనాయక్ తండ, పరిధిలో జిల్లా రెవిన్యూ అధికారి మంగీలాల్ ,తహాసిల్దార్ కిషన్ నాయక్ ఆధ్వర్యంలో 88 సర్వే నంబర్ లో గల 213.37 ఎకరాల అసైన్డ్ భూములకు,ఆయా గ్రామాల 15 సర్వే నంబర్లకు సంబంధించి 148.92 ఎకరాల పట్టా భూములకు రెవెన్యూ పోలీసు సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు తమ హద్దులను చూపించడంతో రెవెన్యూ సిబ్బంది చివరి హద్దులను గుర్తించారు. ఆయా సర్వే నంబర్లలో ఎంతమంది రైతుల భూములు ఉన్నాయని గుర్తించేందుకు ఎంజాయ్ మెంట్ సర్వే నిర్వహించడం జరుగుతుందని తహసిల్దార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు శ్రీశైలం,బాల వెంకటరమణ, సత్యనారాయణ,రాజ్ కుమార్,రమేష్ కుమార్,వసంత్,రాఘవేందర్,డిప్యూటీ తహాసిల్దార్ శివకుమార్, ఆర్ఐ నవీన్ కుమార్, సర్వేయర్లు మహేష్, ఆనంద్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కాలువ పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే రాగమయి



**పెనుబల్లి, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** ఖమ్మం జిల్లా పెనుబల్లిమండలం రామచంద్రపురంగ్రామంలో ఆదివారంసత్తుపల్లి ఎం ఎల్ ఏ డాక్టర్ మట్టా రాగమయి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీ 6 కు కాలువ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు పై లక్షలాది కోట్ల రూపాయలను వెచ్చించి ప్రజాదనాన్ని దుర్వినియోగం చేసిందని సీతారామ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తిగా అశ్రద్ధ చేసి వదిలేసిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీతారామ కాలువ పనులు ప్రారంభించడం ఆనందదాయకమని అన్నారు. దీని వెనుక మంత్రి తుమ్మల కృషితోపాటు , మంత్రులు బట్టివిక్తమార్క ,పొంగులేటిశ్రీనివాసరెడ్డి సహకారంతో సీతారామ ప్రాజెక్టు పూర్తి చేసుకున్నామని ఆమె అన్నారు. రూ.327 కోట్లు వ్యయంతో 309 కిలోమీటర్లు కాలువ నిర్మాణం చేపట్టి 58,095 ఎకరాలకు నీరు పుష్కలంగా అందుతుందని అన్నారు. ఈ కాలువ నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం అందిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రిజ్వాన, తాసిల్దార్ వీరభద్ర నాయక్ ఎంపీడీఓ అన్నపూర్ణ, నీటిపారుదల శాఖ అధికారులు, కేఎన్ఆర్ ప్రాజెక్ట్ మేనేజర్ జనార్ధన్,జీ ఎం జాషువా,పెనుబల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు, మండలం కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# మాడుగులపల్లి తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్ లేక అవస్థలు




**మాడుగులపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో పాలన అస్తవ్యస్తంగా మారింది గత ఆరు నెలలుగా కార్యాలయంలో అటెండర్ పోస్టు ఖాళీగా ఉండటంతో అటు అధికారులు, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు మండల కేంద్రంలోని అత్యంత కీలకమైన రెవెన్యూ కార్యాలయంలో కింది స్థాయి సిబ్బంది లేకపోవడం వల్ల నిత్యం వందలాది మంది వచ్చే ప్రజలకు పనులు కాక చుక్కలు కనిపిస్తున్నాయి సాధారణంగా తహసీల్దార్ కార్యాలయానికి ధరణి సమస్యలు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఇతర భూ సంబంధిత పనుల నిమిత్తం ప్రతిరోజూ ప్రజలు వస్తుంటారు అయితే కార్యాలయంలో అటెండర్ లేకపోవడంతో ఒక సెక్షన్ నుండి మరో సెక్షన్‌కు ఫైళ్లను చేరవేయడం, రికార్డు రూమ్ నుండి పాత దస్త్రాలను వెతకడం వంటి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఉన్న సిబ్బందే అటెండర్ పనులు కూడా చేయాల్సి రావడంతో ఇతర పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది ప్రజల ఆవేదన చిన్న పని కోసం వచ్చినా గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది ఆఫీసులో ఫైళ్లు వెతకడానికి ఎవరూ లేరని సిబ్బంది చెబుతున్నారు అటెండర్ లేకపోవడం వల్ల సామాన్యుల పనులు ముందుకు సాగడం లేదు అని మండల వాసులు వాపోతున్నారు. గత ఆరు నెలలుగా ఈ సమస్య వేధిస్తున్నా, సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని, మాడుగులపల్లి తహసీల్దార్ కార్యాలయానికి శాశ్వత అటెండర్‌ను నియమించాలని, తద్వారా కార్యాలయ పనులు సక్రమంగా జరిగేలా చూడాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




# నిస్తేజంగా 8.5 లక్షల ఈపీఎఫ్ ఖాతాలు

### పదేళ్లుగా క్లెయిమ్ చేయని చందాదారులు

హైదరాబాద్: దేశవ్యాప్తంగా 8.5 లక్షల పీఎఫ్ ఖాతాలు పదేళ్లకు పైగా నిర్వహణలో లేకుండా నిస్తేజంగా ఉన్నాయని కేంద్ర కార్మిక భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) గుర్తించింది. వీటిలో 13,705 ఖాతాల్లో గరిష్ఠంగా సగటున రూ.40 లక్షలకు పైగా నగదు ఉన్నట్లు వెల్లడైంది. ఈ ఖాతాల్ని వీలైనంత వేగంగా పరిష్కరించేందుకు ఎస్‌బీఐ, ఇతర బ్యాంకుల తరహాలో ముందుకు వెళ్లాలని, ఆర్‌బీఐ సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని ఇటీవల జరిగిన సమావేశంలో టాస్క్‌ఫోర్స్ కమిటీకి ఈపీఎఫ్‌వో సూచించింది. అధికారులు ఆధార్‌కు అనుసంధానమైన పీఎఫ్ ఖాతాదారుల ఫోన్ నంబర్లకు ఎస్ఎంఎస్‌లు పంపి.., యాజమాన్యాలతో ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్లు నిరంతరం సమీక్షలు నిర్వహించి క్లెయిములు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నారు. అధికారులు ఆధార్‌కు అనుసంధానమైన పీఎఫ్ ఖాతాదారుల ఫోన్ నంబర్లకు ఎస్ఎంఎస్‌లు పంపి.., యాజమాన్యాలతో ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్లు నిరంతరం సమీక్షలు నిర్వహించి క్లెయిములు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈపీఎఫ్‌వో గణాంకాల ప్రకారం దాదాపు 25 వేలకు పైగా ఖాతాల్లో కనీస నిల్వ ఒక్కో దాంట్లో రూ.5 లక్షలకు మించి ఉంది. దాదాపు 13,705 నిస్తేజ ఖాతాల్లో సగటున ఒక్కోదాంట్లో రూ.40 లక్షలకు పైగా నగదు ఉంది.దీర్ఘకాలంగా రూ.10 లక్షల కన్నా ఎక్కువ నిల్వలున్న ఖాతాల్లో మొత్తం రూ.5,235.32 కోట్లు ఉన్నాయి. వీటిలో 2,431 ఖాతాలను సెటిల్ చేసి చందాదారులకు రూ.1,028.75 కోట్లు చెల్లించారు.విదేశీ కార్మికులకు చెందిన 3,033 ఖాతాల్లో రూ.704.72 కోట్లు ఉన్నాయి. ఇవన్నీ నిర్వహణలో లేకపోవడంతో వడ్డీ జమ కావడం లేదు. నిర్వహణలో లేని ఖాతాల పరిష్కారం కోసం క్షేత్రస్థాయి అధికారులు ప్రయత్నాలు వేగవంతం చేశారు. ఉద్యోగంలో చేరినపుడు పీఎఫ్ ఖాతా తెరిచిన విషయం తెలియకపోవడం, ఈ పథకంపై సరైన అవగాహన లేకపోవడం ఈ సమస్యకు ప్రధాన కారణమని తెలిసింది. కొందరు ఉద్యోగులు కొత్త కంపెనీలకు వెళ్లిన తరువాత పూర్వ కంపెనీలోని ఖాతాను బదిలీ చేయకపోవడంతో.. అవి నిస్తేజమవుతున్నాయి. కొత్త సంస్థలకు మారినపుడు ఆయా పీఎఫ్ ఖాతాలను బదిలీ చేసుకోవాలని ఈపీఎఫ్‌వో ఇప్పటికే సూచించింది. కొందరికి ఖాతాలున్నా అందులో ఎంత నగదు ఉందో తెలియడం లేదు. విదేశీ కార్మికుల వర్గీకరణ సరిగా లేకపోవడమూ మరో కారణం. కార్మికుల కేవైసీ వివరాలు.. ఈపీఎఫ్ ఖాతాలోని వివరాలతో సరిపోలకపోవడంతో నగదు సెటిల్ చేయడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

# లాభాలతో ముగిసిన సూచీలు

### 25,700 ఎగువకు నిఫ్టీ



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాలతో ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంక్, హెల్త్‌కేర్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ట్రంప్ వివిధ దేశాలపై విధించిన సుంకాలు చెల్లుబాటు కావంటూ ఆ దేశ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కారణంగా ప్రపంచ మార్కెట్లతో పాటు మన సూచీలు రాణించాయి. సెన్సెక్స్ ఉదయం 82,906.83 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,814.71) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లో కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 83,486.15 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 479.95 పాయింట్ల లాభంతో 83,294.66 వద్ద ముగిసింది. నిఫ్టీ 141.75 పాయింట్ల లాభంతో 25,713 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.88గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. క్వాలిటీ వాల్స్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, ట్రెంట్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.38 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5147 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**లాభాలతో మొదలైన స్టాక్ మార్కెట్లు**

దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాలతో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, ట్రంప్ టారిఫ్‌ల రద్దు వంటి పరిణామాలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చాయి. దీంతో సూచీలు ఉత్సాహంగా కదలాడుతున్నాయి. సెన్సెక్స్ 600 పాయింట్లకు పైగా ఎగబాకగా.. నిఫ్టీ 25,700 మార్క్ పైన కదలాడుతోంది.ఉదయం 9.30 గంటల సమయంలో సెన్సెక్స్ 643.74 పాయింట్ల లాభంతో 83,458.45 వద్ద, నిఫ్టీ 193.85 పాయింట్లు పెరిగి 25,765.10 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 19 పైసలు పెరిగి 90.75 వద్ద కొనసాగుతోంది. ఎన్ఎస్ఈలో యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మ్యాక్స్ హెల్త్‌కేర్, టెక్ మహీంద్రా, హిందుస్థాన్ యునిలివర్ షేర్లు రాణిస్తున్నాయి. సిప్లా, ఓఎన్జీసీ, ఏషియన్ పెయింట్స్, కోల్ ఇండియా, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ఒత్తిడికి గురవుతున్నాయి.గత శుక్రవారం అమెరికా మార్కెట్లు లాభాలతో ముగిశాయి. నేటి ఆసియా-పసిఫిక్ మార్కెట్లు రాణిస్తున్నాయి. దక్షిణ కొరియా కోస్పి 1.7శాతం, ఆస్ట్రేలియా ఏఎస్ఎక్స్ 0.17శాతం మేర పెరిగాయి. ప్రపంచ దేశాలపై ట్రంప్ విధించిన టారిఫ్‌లు చెల్లవని గతవారం అమెరికా సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ప్రపంచ దేశాల ఉత్పత్తులపై రెండు విడతలుగా 15% పన్ను విధిస్తున్నట్లు ట్రంప్ మళ్లీ ప్రకటనలు చేశారు. దీంతో ఇంతకుముందే మనదేశ ఉత్పత్తులపై సుంకాన్ని 50% నుంచి 18 శాతానికి తగ్గించగా.. ఇప్పుడది 15% కానుంది.

## భారీగా పతనమైన ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేర్లు

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేర్లు సోమవారం నాటి ట్రేడింగ్ ఆరంభం నుంచి భారీగా పతనం అవుతున్నాయి. ఒకానొక దశలో దాదాపు 20%శాతం పతనమయ్యాయి. ఆ తర్వాత కొద్దిగా కోలుకొన్నా.. భారీ నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. తమ బ్యాంక్ చండీగఢ్ బ్రాంచిలో రూ.590 కోట్ల మేరకు కుంభకోణం జరిగినట్లు అనుమానిస్తున్నామని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రకటించింది. గవర్నమెంట్ ఖాతాల నిర్వహణలో ఈ మోసం జరిగినట్లు భావిస్తున్నారు. ఫలితంగా ఇన్వెస్టర్లలో ఆందోళన తీవ్రమైంది. దీంతో నేడు ట్రేడింగ్ మొదలైన వెంటనే ఈ షేర్లు లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. ఇక ఉదయం 11.08 సమయంలో 15.28శాతం నష్టంతో రూ.70.75 వద్ద ట్రేడవుతున్నాయి.హరియాణా ప్రభుత్వ విభాగం ఒకటి ఈ బ్యాంకులో తమ ఖాతాను క్లోజ్ చేసి నిధులను బదిలీచేయమని కోరగా ఈ కుంభకోణం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సదరు విభాగ పుస్తకాల్లో నగదు.. బ్యాంక్‌ఖాతాలో మొత్తానికి సరిపోలకపోవడంతో అనుమానాలు మొదలయ్యాయి. దీంతో హరియాణా ప్రభుత్వంలోని పలు శాఖలు తమ ఖాతాలను సరిచూసుకోవడం మొదలుపెట్టాయి. అయితే చండీగఢ్ శాఖలోని ఖాతాల్లోనే ఈ సమస్య ఉన్నట్లు తెలుస్తోంది.

## ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.590 కోట్ల మోసం

ముంబయి: హరియాణా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఖాతాల్లో తమ ఉద్యోగులు, ఇతరులు చేసిన రూ.590 కోట్ల మోసాన్ని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఆదివారం వెల్లడించింది. బ్యాంకింగ్ నియంత్రణ సంస్థ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఈ విషయాన్ని వెల్లడించడంతో పాటు పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది. చండీగఢ్‌లోని ఒక శాఖలో కొంతమంది ఉద్యోగులు హరియాణా రాష్ట్ర ప్రభుత్వ ఖాతాల్లో ప్రాథమికంగా అనధికారిక, మోసపూరిత కార్యకలాపాలు నిర్వహించినట్లు గుర్తించినట్లు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ పేర్కొంది. ఇతర వ్యక్తులు/సంస్థలు/కౌంటర్‌పార్టీలు కూడా ఇందులో భాగమయ్యే అవకాశం ఉందని తెలిపింది. ప్రస్తుతం మోసం విలువను రూ.590 కోట్లుగా అంచనా వేసింది.తదుపరి సమాచారం, క్లెయిమ్‌ల ధ్రువీకరణ, రికవరీల ఆధారంగా తుది మొత్తాన్ని నిర్ణయిస్తామని వివరించింది. హరియాణా ప్రభుత్వ విభాగం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌తో బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహిస్తోందని.. రుణదాతకు వెల్లడించని తేదీన క్లోజర్, బ్యాలెన్స్ బదిలీ కోసం మరొక బ్యాంకుకు అభ్యర్థన అందిందని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ తెలిపింది. ఈ ప్రక్రియలో ఖాతాలోని బ్యాలెన్స్‌తో పోలిస్తే, పేర్కొన్న మొత్తంలో వ్యత్యాసం కనిపించింది. అలాగే ఈ నెల 18 నుంచి హరియాణా ప్రభుత్వ సంస్థల ఇతర ఖాతాల్లో కూడా ఇలాంటి సమస్యలు గమనించినట్లు వివరించింది.

## ఏటా 10,000 టన్నుల పెన్-జీ ఉత్పత్తి లక్ష్యం

### 12 నెలల్లో చేరొచ్చు: అరబిందో ఫార్మా

**హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ సెజ్‌లో ఉన్న ప్లాంటులో పెన్సిలిన్-జీ వార్షిక ఉత్పత్తిని 10,000 మెట్రిక్ టన్నులకు పెంచాలని చూస్తున్నట్లు అరబిందో ఫార్మా ముఖ్య ఆర్థిక అధికారి (సీఎఫ్ఓ) ఎస్.సుబ్రమణియన్ తెలిపారు. 'ఇందుకవసరమైన విస్తరణ పనులు అంచనాల ప్రకారం సాగుతున్నాయి. రాబోయే రోజుల్లో లాభదాయకత పెంచడానికి ఇది సిద్ధమవుతోంది. రాబోయే 12 నెలల్లో వార్షిక ప్రాతిపదికన 10,000 మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ ఉత్పత్తిని ఇక్కడ ఆశిస్తున్నాం' అని అనలిస్ట్ కాల్‌లో సుబ్రమణియన్ వెల్లడించారు. ఈ ప్లాంట్ పూర్తిస్థాయి సామర్థ్యం 15,000 టన్నులు. పెన్-జీ, 6ఏపీఏ, అమోక్సిసిలిన్ కనీస దిగుమతి ధర విషయంలో ప్రభుత్వం ఏడాది మినహాయింపు ఇవ్వడం మంచి నిర్ణయమని అరబిందో ఫార్మా తెలిపింది. 'ప్రభుత్వం ఇచ్చిన మినహాయింపు కంపెనీపై సానుకూల ప్రభావం చూపుంది. యాంటీబయాటిక్స్‌లో మన దేశం స్వయం సమృద్ధి సాధించడానికి, సరఫరాలో అంతరాయాల ముప్పు తగ్గించడానికి ప్రభుత్వ నిర్ణయం దోహదపడుతుంది. ఏపీఐ (యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రేడియెంట్), కేఎస్ఎం (ప్రాథమిక ముడిసరకు) దేశీయ తయారీని పెంచుతుంది' అని సుబ్రమణియన్ పేర్కొన్నారు. పెన్-జీ, 6ఏపీఏ, అమోక్సిసిలిన్‌పై కంపెనీ వ్యూహం, వ్యయాలను, విదేశీ ఆధారాన్ని తగ్గించడానికి, భవిష్యత్తులో మార్జిన్‌ల బలోపేతానికి దోహదం చేస్తుందన్నారు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,43,150 | ₹ 1,56,170 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,70,000

# బంగారం, వెండి దిగుమతులపై ఆందోళన లేదు

### వాటిని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎప్పటికప్పుడు పరిశీలిస్తోంది: నిర్మల



ముంబయి: దేశంలోకి బంగారం, వెండి దిగుమతులు ఆందోళనకర స్థాయిలో ఏమీ లేవని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. వాటిని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎప్పటికప్పుడు పరిశీలిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర బ్యాంకులు పెద్ద మొత్తంలో పసిడి కొనుగోలు చేస్తుండడమే బంగారం ధరల పెరుగుదలకు కారణమని చెప్పారు. బంగారం దిగుమతులపై ఆందోళన చెందడం లేదని, కరెంట్ ఖాతా లోటు నిర్వహించదగిన స్థాయిలోనే ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రాతో కలిసి ఏర్పాటు చేసిన సంయుక్త విలేకర్ల సమావేశంలో సోమవారం ఆమె మాట్లాడారు.బ్యాంకులు తమ కోర్ బిజినెస్‌పై దృష్టి సారించాలని నిర్మలా సీతారామన్ సూచించారు. బీమా ఉత్పత్తులను మిస్ సెల్ చేయొద్దన్నారు. భారత్ వృద్ధి పథంలో పయనిస్తోందని, ఇందులో అందరూ భాగస్వాములు కావాలన్నారు. పారిశ్రామికవేత్తలు తమ పెట్టుబడులను పెంచాలని కోరారు. ఈ సందర్భంగా టారిఫ్‌ల అంశం ప్రస్తావనకు వచ్చింది. వివిధ దేశాలపై ట్రంప్ విధించిన టారిఫ్‌లను అక్కడి సుప్రీంకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే. దీంతో భారత్ సహా అన్ని దేశాలపై 15 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ మార్పుల వల్ల భారత్‌పై ఎలాంటి ప్రభావం ఉండబోతోందని మీడియా ప్రశ్నించగా.. వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ అంశాన్ని సమీక్షిస్తోందని నిర్మలా సీతారామన్ అన్నారు. దీనిపై అప్పుడే వ్యాఖ్యానించడం తొందరపాటు నిర్ణయం అవుతుందన్నారు.

**ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌లో మోసంపై ఆర్‌బీఐ**

హరియాణాలోని చండీగఢ్ ఐడీఎఫ్‌సీ బ్యాంక్ శాఖలో జరిగిన రూ.590 కోట్ల మోసం ఘటనపై ఆర్‌బీఐ స్పందించింది. ఈ అంశాన్ని తాము పరిశీలిస్తున్నామని, ఇందులో వ్యవస్థీకృత మోసం ఏమీ గుర్తించలేదని గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. హరియాణా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఖాతాల్లో తమ ఉద్యోగులు, ఇతరులు చేసిన రూ.590 కోట్ల మోసాన్ని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఆదివారం బయటపెట్టిన సంగతి తెలిసింద

## సెకనుకు 10 కోట్ల లావాదేవీలు!

### ఎన్ఎస్ఈలో ఏప్రిల్ తరవాత

### ప్రస్తుతం 50-60 లక్షల ట్రాన్సాక్షన్స్

షేర్ల ట్రేడింగ్ అంటేనే క్షణాల్లో తలరాతలు మారిపోతాయ్. యువత మొబైల్‌పై ట్రేడింగ్ చేయడం పెరిగాక, షేర్ల లావాదేవీల సంఖ్య అనూహ్యంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఒక సెకనులోనే 10 కోట్ల లావాదేవీలు నిర్వహించేలా దేశంలోనే పెద్దదైన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)ని తీర్చిదిద్దుతున్నారు. ఇందుకోసం లావాదేవీ స్పందనకు పట్టే సమయాన్ని మైక్రోసెకన్ల (సెకనులో 10 లక్షలవ వంతు) నుంచి నానో సెకన్ల (సెకనులో 100 కోట్ల వంతు)కు మార్చనున్నారు. అంటే ప్రస్తుతం కంటే 1,000 రెట్లు వేగంగా కార్యకలాపాలు సాగేందుకు అనువుగా ఎన్ఎస్ఈ సాంకేతికతను తీర్చిదిద్దనున్నారని ఆంగ్లపత్రికలు పేర్కొన్నాయి. ఏప్రిల్ 11 నుంచి ఈ మార్పు అమల్లోకి రానుంది. ఎన్ఎస్ఈలో ప్రస్తుతం 25 కోట్ల మందికి పైగా మదుపర్లు ఉన్నారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ నుంచి 1,17,94,921 మంది, తెలంగాణ నుంచి 57,82,143 మంది ఉన్నారు. ప్రస్తుతం ఎన్ఎస్ఈలో సెకనుకు 50-60 లక్షల లావాదేవీలు సాగుతున్నాయి. ఒక మదుపరి ఇచ్చిన ఆర్డర్‌పై ఎన్ఎస్ఈ స్పందించే సమయం 100 మైక్రోసెకన్లుగా ఉంది. దీన్ని నానో సెకన్లకు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటు న్నామని ఎన్ఎస్ఈ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆశిష్‌కుమార్ చౌహాన్ వెల్లడించారు. అసోసియేషన్ ఆఫ్ ఎన్ఎస్ఈ మెంబర్స్ ఆఫ్ ఇండియా సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు.

## ఒడిశాలో ఆర్‌బీఐ సురక్షిత డేటా కేంద్రం



**న్యూఢిల్లీ:** కీలకమైన ఆర్థిక డేటాను కాపాడటానికి, ప్రధాన వ్యవస్థల కొనసాగింపును బలోపేతం చేసే ప్రయత్నాల్లో భాగంగా.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఒడిశాలో అత్యంత సురక్షిత (హై-సెక్యూరిటీ) డేటా కేంద్రాన్ని నిర్మించింది. దాడులకు సుదూరంగా, వ్యూహాత్మక ప్రదేశంలో, భూకంప తీవ్రత లేనిచోట దీనిని నిర్మించారు. ఇందుకోసం టైర్ 4 సర్టిఫికేషన్ డిజైన్‌ను వినియోగించారని సమాచారం. దేశ పశ్చిమ, ఉత్తర సరిహద్దులకు దూరంగా ఉన్న ఈ ప్రాంతంపైకి మిస్సైల్, డ్రోన్ దాడులు ఉండే అవకాశం తక్కువ. ఈ డేటా కేంద్రం ఆర్‌బీఐకి రెండోది. ప్రాథమిక డేటా కేంద్రం నవీ ముంబయిలోని ఖార్ఘర్‌లో ఉంది. ఈ కొత్త కేంద్రం ఆర్‌బీఐ కరెన్సీ నిర్వహణ, చెల్లింపు-పరిష్కార కార్యకలాపాలు, నియంత్రణ డేటా విధులకు మద్దతు ఇచ్చే ప్రధాన కంప్యూటింగ్ వ్యవస్థలను ఉంచడానికి రూపొందించారని అధికారులు వెల్లడించారు. 2023లో ఒడిశా (ఖోర్ధా)లోని ఇన్ఫో వ్యాలీ-2లో ఆర్‌బీఐ తన 18.55 ఎకరాల క్యాంపస్‌లో డేటా కేంద్రం పని ప్రారంభించినప్పుడు, అక్కడ ఎందుకనే సందేహాలు తలెత్తాయి. రవాణా, కార్యకలాపాలకు సంబంధించిన సమస్యల కంటే వ్యూహాత్మక అంశాలను పరిగణనలోకి తీసుకుంటే తాజా నిర్మాణాన్ని చేపట్టినట్లు సమాచారం. భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధం జరిగినప్పుడు, ఒక వాణిజ్య బ్యాంక్ తమ డేటా కేంద్ర కార్యకలాపాలను హఠాత్తుగా జయపుర నుంచి ముంబయికి తరలించింది. ఈ నేపథ్యంలోనే రక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తూ కొత్త కేంద్రాన్ని నిర్మించారు. పైగా డేటా కేంద్రాలకు కావాల్సిన విద్యుత్తు, నీటికి ఈ ప్రాంతంలో కొదవ ఉండదు.

## వికసిత బెంగాల్ బాధ్యత నాది

ఉంటుంది. సోనార్ బంగ్లా కోసం యువకులు, పెద్దలు, మహిళలు కన్న కలలు కల్లలుగా మిగిలిపోతున్న పరిస్థితి ఇవాళ ఉంది. వారి బాధలు నన్ను కలిచివేస్తున్నాయి. ఇందుకోసం హృదయపూర్వకంగా ఒక తీర్మానం చేసుకున్నాను. వికసత్ బంగ్లా సాధనకు నిర్ణయం తీసుకున్నాను' అని ఆ లేఖలో మోదీ పేర్కొన్నారు. గత 11 ఏళ్లుగా దేశ ప్రజల ఆశీస్సుల బలంతో ప్రజాసంక్షేమానికి, దేశ సర్వతోముఖాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం పాటుపడిందని, రైతుల సంక్షేమం నుంచి యువత కలల సాకారం, మహిళా సాధికారత వరకూ కృషి చేసిందని చెప్పారు. ప్రభుత్వ విధానాల వల్ల సాధించిన సానుకూల ఫలితాలను ఇవాళ ప్రజలు చూస్తున్నారని అన్నారు. బెంగాల్ అభివృద్ధి విషయంలో మమతాబెనర్జీ ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తోందని మోదీ ఆ లేఖలో విమర్శించారు. అయినప్పటికీ ప్రజాసంక్షేమానికి కట్టుబడి కేంద్రం ముందుకు వెళ్తోందన్నారు. 'జన్-ధన్ యోజన'తో పశ్చిమబెంగాల్‌లోని సుమారు 5 లక్షల మందికి బ్యాంకు అకౌంట్లు తెరిచామని, స్వచ్ఛభారత్ అభియాన్ కింద 85 లక్షల టాయిలెట్లను రాష్ట్రంలో నిర్మించామని చెప్పారు. చిన్న వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రూ.2.82 లక్షల కోట్లు రుణాలిచ్చామని, 56 లక్షల మంది సీనియర్ సిటిజన్లకు అటల్ పెన్షన్ యోజన కింద లబ్ధి చేకూర్చామని, ఉజ్వల్ యోజన కింద కోటికి పైగా ఎల్పీజీ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. 'కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా 52 లక్షల మంది రైతులకు నేరుగా ఆర్థిక సాయం అందించామని వివరించారు.'నేతాజీ సుభాష్ చంద్రబోస్ పుట్టిన గడ్డలో ఇవాళ అక్రమ చొరబాట్లు, మహిళలపై హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. రబీంద్రనాథ్ ఠాగూర్ కలలుకన్న సోనార్ బంగ్లా ప్రమాదంలో పడింది. ఇవాళ బెంగాల్ పూర్వ గౌరవాన్ని పునరుద్ధరించాలి. మార్పు అనివార్యం. బెంగాల్ అభివృద్ధి ప్రయాణంలో అంతా కలిసిరావాలి. 2026లో వికసిత్ వెస్ట్ బెంగాల్ కోసం ప్రతినబూనుదాం' అని విజ్ఞప్తి చేశారు.

# అత్యధిక బొగ్గు ఉత్పత్తి గనిగా గెవ్రా!

### 2026-27లో 63 మి.టన్నుల లక్ష్యం

### ఎస్ఈసీఎల్ సీఎండీ హరీశ్ దుహాన్



కోర్బా: ఛత్తీస్‌గఢ్‌లో కోల్ ఇండియాకు చెందిన గెవ్రా గని, వచ్చే ఏడాది 63 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించడం ద్వారా, ప్రపంచంలోనే అత్యధిక బొగ్గు ఉత్పత్తి చేసే గనిగా అవతరిస్తుందని సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్ (ఎస్ఈసీఎల్) సీఎండీ హరీశ్ దుహాన్ వెల్లడించారు. కోల్ ఇండియా అనుబంధ సంస్థ అయిన ఎస్ఈసీఎల్ నిర్వహిస్తున్న గెవ్రా గని, మన దేశంలో అతి పెద్ద ఓపెన్‌కాస్ట్ బొగ్గు గని. 1981 నుంచి ఈ గనిలో తవ్వకాలు సాగుతున్నాయి. ఈ ఏడాది 56 మి.టన్నుల బొగ్గు ఇక్కడ వెలికి తీయనున్నారు. ఈ గని సామర్థ్యాన్ని సంవత్సరానికి 70 మి.టన్నులకు విస్తరించడానికి ఇప్పటికే పర్యావరణ అనుమతి లభించింది కూడా. వచ్చే ఏడాదిలో గెవ్రా గని 63 మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి, ప్రపంచంలోనే నంబర్ వన్ గనిగా మారుతుందని హరీశ్ ధీమా వ్యక్తం చేశారు. అమెరికా (వయామింగ్)లోని పౌడర్ రివర్ బేసిన్‌లో ఉన్న బ్లాక్ థండర్ గని 61-62 మి.టన్నుల ఉత్పత్తితో ప్రపంచంలోనే అతి పెద్ద బొగ్గు గనిగా ఉంది. దీని తర్వాత నార్త్ యాంటెలోప్ రోషెల్ గని ఉంది. గెవ్రా గని ప్రతిష్ఠాత్మక లక్ష్యానికి అవసరమైన 4 ముఖ్యమైన వనరులు - భూమి, యంత్రాలు, మానవ వనరులు, బొగ్గు స్వీకరించే వినియోగదార్ల గిరాకీ అని వివరించారు. కచ్చితమైన ముందస్తు ప్రణాళికతో, అవసరమైన అన్ని వనరులను తమ బృందం కలిగి ఉందని హరీశ్ పేర్కొన్నారు. తగినంత భూమి, అవసరమైన అన్ని పరికరాలు, బొగ్గు సరఫరా కాంట్రాక్టులు, వినియోగదార్ల నుంచి బొగ్గుకు గిరాకీ కూడా బలంగా ఉందని వెల్లడించారు. భారతీయ రైల్వేల మద్దతుతో బలమైన మౌలిక సదుపాయాలు బొగ్గు తరలింపునకు సహాయపడతాయని తెలిపారు. ఎస్ఈసీఎల్‌లోనే 700 మెగావాట్ల సౌర ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని కంపెనీ యోచిస్తోందని సీఎండీ తెలిపారు. ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ కోసం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ఖనిజాల్లో కొన్ని ప్రాజెక్టులను చేయడానికి కూడా జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు వివరించారు.'2026-27లో గెవ్రా గని నుంచి ఉత్పత్తిని 63 మి.టన్నులకు పెంచాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇది ప్రస్తుతం 62 మి.టన్నులు ఉత్పత్తి చేస్తున్న ప్రపంచంలోనే అతి పెద్దదైన అమెరికాలోని బ్లాక్ థండర్ గనిని అధిగమిస్తుంద'ని ఎస్ఈసీఎల్ ఏరియా జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ త్యాగి కూడా పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో చిరుజల్లులు

హైదరాబాద్(జనంసాక్షి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో భాగ్యనగరంలో పలుచోట్ల వర్షం కురిసింది. సోమవారం మధ్యాహ్నం వరకు భానుడు తన ప్రతాపం చూపినప్పటికీ, మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మబ్బుపట్టి చల్లని గాలులు వీచడంతో నగరంలో ఆహ్లాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయి. చాలా రోజుల తర్వాత కురిసిన చిరు జల్లులు భాగ్యనగరాన్ని మురిపించాయి.ఇప్పుడిప్పుడే ఎండలు ముదురుతున్న తరుణంలో హైదరాబాద్ నగర ప్రజలను వరుణుడు పలకరించాడు. నగరంలో ఆకాశం మేఘావృతం కాగా.. ఖైరతాబాద్, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్, కాచిగూడ సహా పలుచోట్ల చిరు జల్లులు కురుస్తున్నాయి. మరోవైపు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మారింది. ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తోంది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావం వల్లే వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా అబిడ్స్, బషీర్ బాగ్, సైఫాబాద్, ట్యాంక్ బండ్, సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. అలాగే మీర్ పేట్, బడంగ్ పేట్ ప్రాంతాల్లోనూ వాన పడింది. ఎల్బీ నగర్, మలక్ పేట్, సరూర్ నగర్, చార్మినార్, బీఎన్ రెడ్డి, ఉప్పల్, నాగోల్, అంబర్ పేట్, వనస్థలిపురం, హయత్ నగర్ వంటి ప్రాంతాల్లో ఈదురు గాలులు బలంగా వీచాయి. వికారాబాద్ ప్రాంతంలో వీస్తున్న భారీ ఈదురు గాలులు ప్రస్తుతం హైదరాబాద్ దిశగా వేగంగా కదులుతున్నాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY



### కుల దురహంకారంతో
## పసి పాపను చంపిన దోషులను శిక్షించాలి : ఐద్వా




**ముషీరాబాద్, ఫిబ్రవరి 23 (జనం సాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లాలోని కుమ్మెర మల్లన్న జాతర లో అన్నగారిన కులాలకు చెందినవారు, గుడిలోకి ప్రవేశించారనే కారణంతో ఒక కుటుంబంపై దాడి చేసి 2 నెలల పసికందును కాళ్లతో తన్ని ఆ పాపను చంపిన దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. అరుణ జ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సుందరయ్య పార్కు వద్ద నిరసన తెలియజేశారు. సందర్భంగా ఆమె మాట్లాడుతు కుల దురహంకారం తలకెక్కిన కుల, మతోన్మాదులు తెలంగాణ రాష్ట్రంలో ఇటువంటి దాడులకు పాల్పడడం సిగ్గుచేటని దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలని లేని పక్షంలో ఐద్వా మహిళా సంఘం గా రాష్ట్ర వ్యాప్తంగా అందోళనలు చేపడతామన్నారు. ఈ ఘటన పోలీసుల సమక్షంలో నే జరిగినా పోలీసులు చోద్యం చూస్తూ నేరస్తుల పై కాక బాధితుల పైనే కేసులు పెట్టడం దుర్మార్గమని దోషులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర సహాయకార్యదర్శి బుగ్గవీటి సరళ, పి. ప్రభావతి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండి. పద్మ, కె. నాగలక్ష్మి, ఎమ్. వినోధ, పి. శశికళ, వై. వరలక్ష్మి, ఎమి షబానా బేగం, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి

- జీవో 252 సవరించకుండా కమిటీ నియామకం చేయొద్దు
- ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలి
- భవిష్యత్ ఉద్యమాలు ఉధృతం చేస్తాం : టీడబ్ల్యూజెఎఫ్



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 23 (జనంసాక్షి):** వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, జీవో 252ని సవరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యం లో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు ధర్నా చేపట్టారు. జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో జర్నలిస్టులు హాజరయ్యారు. గత అసెం బ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తా మని, రెట్టింపు అక్రిడిటేషన్ కార్డులు ఇస్తామని హామీ ఇచ్చిందని రఘు గుర్తుచేశారు. కానీ ఇప్పుడు ఉన్న కార్డుల్లోనే కోతలు విధిస్తున్నారని, కొత్త జీవోలతో సమస్యలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఫేక్ జర్నలిస్టుల పేరుతో వర్కింగ్ జర్నలిస్టులకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. నియోజక వర్గాలు, మున్సిపాలిటీలు, మండలాల్లో పనిచేసే జర్నలిస్టులతో పాటు డెస్క్ జర్నలిస్టులకు కూడా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో 252 సవరించకుండా అక్రిడిటేషన్ కమిటీ నియామకం చేయొద్దని జిల్లా అధ్యక్షులు గణేష్, కార్యదర్శి సైదులు జిల్లా కలెక్టర్, డీపీఆర్వోలను కోరారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు తప్ప మరేమీ ఇవ్వలేని పరిస్థితి ఉందని, ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోతే టీడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అనంతరం డీఆర్ఓ, డీపీఆర్వోలకు వినతిపత్రం అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చిలువేరు సురేష్, ఎండి కాజా పాషా, జిల్లా డెస్క్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర నాయకులు అజయ్ కుమార్, రాజేందర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేష్, సుదర్శన్, మణి, నర్సింహారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు క్రాంతి, అంజి, శ్రీశైలం, శ్రీనివాస్, శివ, నియోజకవర్గాల అధ్యక్ష కార్యదర్శులు పల్లటి జగన్, రాఘవేందర్ గౌడ్, శంకర్, సురేందర్, నర్సింహా, భూచ్చన్న, భగవంతు తదితరులు పాల్గొన్నారు.

## స్వగ్రామం చేరిన మృతదేహం

**కథలాపూర్, ఫిబ్రవరి 23(జనం సాక్షి) :**
కథలాపూర్ మండలంలోని బొమ్మెన గ్రామ లోలం శ్రీనివాస్ మస్కట్లో ఈనెల 19న మృతి చెందిన శ్రీనివష్ మృతదేహం ఇంటికి చేరింది. ఈనెల 19 మస్కట్లో కాలు జారిపడి ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించగా బ్రెయిన్ డెడ్ అయిందని డాక్టర్లు తెలిపినట్లు ఆ కుటుంబ సభ్యులు మస్కట్లో ఉన్న వారితో సంప్రదింపులు జరిపి సోమవారం మృతాదెయం ఇంటికి తీసుకువచ్చారు, కుటుంబ సభ్యుల ఆరోధనలు మిన్నంటాయి, రెండు నెలలు ఇండియా నుండి డబ్బులు సంపాదిస్తా అని మస్కట్ కి వెళ్లి మృతదేహం తో వచ్చావని కుటుంబ సభ్యుల రోదనలు గ్రామంలో విషాదాన్ని నింపాయి. శ్రీనివాస్ కు ఇద్దరు కొడుకులు భార్య ఉన్నారు. శ్రీనివాస్ కుటుంబం బీద కుటుంబం అని ప్రభుత్వం వారిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## రెవెన్యూ ఆఫీసులో పోస్టులు భర్తీ చేయాలి

### ప్రజావాణిలో వినతి పత్రం అందజేసిన సిపిఐ నాయకులు



**గన్నేరువరం, ఫిబ్రవరి 23 (జనంసాక్షి):**
గన్నేరువరం మండలంలోని రెవెన్యూ ఆఫీసులో ఖాళీగా ఉన్నటువంటి పోస్టులను భర్తీ చేయాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ మండల కార్యదర్శి చోక్కల శ్రీశైలం, జిల్లా కౌన్సిల్ సభ్యులు కాంతాల అంజిరెడ్డి సోమవారం రోజు కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయం ప్రజావాణి లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గన్నేరువరంలో భూ సమస్యలు చాలా వరకు పెండింగ్లో ఉన్నాయి. భూ భారతిలో వచ్చినటువంటి దరఖాస్తులు వెంటనే పరిష్కారం చూపాలని సిబ్బందిని నియమించి వచ్చిన సమస్యను పరిష్కారం కొరకై చొరవ చూపాలని అన్నారు. వివిధ గ్రామాలకి ఇన్చార్జి జిపిలను మాత్రమే నియమించారు, మండలంలో ఒక్కరే రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఉన్నారని తద్వారా ఈ చివరన ఉంటే ఆ చివరికి చేరుకోలేకపోతున్నారని భూ సమస్యలు ఆలస్యం అవుతున్నాయని అన్నారు.

### మహిళల రక్షణ కై ప్రత్యేక చట్టాలు

**మహిళ సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ దయ అరుణ**

**పెద్దపల్లి,ఫిబ్రవరి 23(జనంసాక్షి) :**
మహిళల రక్షణకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చాయని వాటి పై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ దయ అరుణ అన్నారు. సోమవారం పెద్దపల్లి మండలం పెద్దబొంకూరు మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో సర్పంచ్ లకు రెండో విడత శిక్షణ లో బాగంగా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దయ అరుణ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారంను వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న టోల్ ఫ్రీ నెంబర్లు 1098, 181, 14567, 155326, 15100ల గురించి నూతన సర్పంచ్ లకు వివరించారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో చైల్డ్ లైన్ సతీష్,అధికారులు పాల్గొన్నారు.

## కార్మికుల సహజ మరణానికి 5లక్షలకు పెంచాలి





- సెస్సు రెండు శాతానికి పెంచాలి
- జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్కు వినతి పత్రం
- తెలంగాణ బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ తరపున ప్రజావాణిలో విజ్ఞప్తి

**చిగురుమామిడి ఫిబ్రవరి 23(జనంసాక్షి):** తెలంగాణ బిల్డింగ్,కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ కార్మికులకు సెస్సు 2శాతంకు పెంచాలని, సహజ మరణానికి 5లక్షలకు పెంచాలని కోరుతూ జిల్లా అధ్యక్షుడు గందె కొమురయ్య ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేసినట్లు గందె కొమురయ్య తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొమురయ్య మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రంలో జరిగిన ఏఐసిటిసి డబ్ల్యూ జాతీయ కమిటీ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయం మేరకు దేశవ్యాప్తంగా అన్ని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కు పలు సమస్యలతో కూడిన వినతి పత్రాలను అందించుటకు జాతీయ కంటే నిర్ణయించిందన్నారు. ఇన్సూరెన్సును ప్రైవేట్ కంపెనీలకు ఇచ్చే ఆలోచనను విరమించుకోవాలని, ప్రస్తుతి సహాయమును లక్షకు పెంచాలని, తెలంగాణలో జీవో నెంబర్ 12సవరించాలని, పెండింగ్ లో ఉన్న క్లైమ్లను వెంటనే పరిష్కరించాలని అందులో కోరారు.ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న లేబర్ కార్డులు వెంటనే అప్రూవల్ ఇవ్వాలని,రెన్యువల్ అప్డేట్ వెంటనే చేయాలని కోరారు. కార్మిక శాఖలో ఓబీసీకి ప్రత్యేక యంత్రాంగాన్ని నియమించాలని కార్మిక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని తదితర సమస్యలను ప్రజావాణిలో అందజేసినట్లు గందె కొమురయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కటికి రెడ్డి బుచ్చన్న యాదవ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు రేగుల కుమార్, ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య,కార్మికులుపుట్ట మహేష్,రమేష్,సత్తయ్య,తదితరులు ఉన్నారు.

## పకడ్బందీగా ఇంటర్ పరీక్షలను నిర్వహించాలి

- పరీక్షలకు సర్వసన్నాహాలు పూర్తి చేయాలి
- ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడపాలి
- ప్రశ్నపత్రాల లీకేజీకి అవకాశం ఇవ్వకూడదు
- అర్జీలు సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్



పెద్దపల్లి, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) : జిల్లాలో ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు జరిగే ఇంటర్ పబ్లిక్ థియరీ పరీక్షలను పకడ్బందీగా, కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జనరల్, వొకేషనల్ కలిపి మొత్తం 10,367 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్న నేపథ్యంలో 22 పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో అదనపు కలెక్టర్లు జె. అరుణ శ్రీ, డి. వేణు లతో కలిసి ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్, పరీక్షా కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధిలో పార్కింగ్కు అనుమతి ఇవ్వకూడదని, ప్రవేశ ద్వారం వద్ద ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేసే వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలకు ముందే కేంద్రాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేసుకోవాలని, సెల్ఫోన్లు, స్టడీ మెటీరియల్లు తీసుకురాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని, సీసీ కెమెరాల సమక్షంలోనే ప్రశ్నపత్రాల కవర్లు ఓపెన్ చేయాలని, లీకేజీకి ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షా కేంద్రాల రూట్లలో ఆర్టీసీ స్పెషల్ బస్సులు సకాలంలో నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతేకాకుండా పరీక్షా కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కనీస మందులతో పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలని, పారిశుద్ధ్య నిర్వహణను స్థానిక సంస్థలు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు.

అదే సమయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన దరఖాస్తులను స్వీకరించిన కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పెండింగ్లో ఉంచకుండా సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూమి పట్టాలు, అక్రమ నిర్మాణాల తొలగింపు, పట్టా పుస్తకాల జారీ వంటి అంశాలపై వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఇక ఆర్ అండ్ బి శాఖ ద్వారా చేపట్టిన వివిధ అభివృద్ధి, మరమ్మతు పనులను నిర్దిష్ట సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్, నాన్ ప్లాన్, డిజాస్టర్ మేనేజ్మెంట్ నిధులతో చేపట్టిన పనులపై సమీక్ష నిర్వహించిన ఆయన, సమన్వయంతో పని చేసి గడువులోనే పూర్తి చేయాలని సూచించారు.

## ఇన్ఫోసిస్ ఉచిత శిక్షణతో ఉద్యోగ అవకాశాలు విస్తరించనున్నాయి

- ఏఐ-రోబోటిక్స్లో భవిష్యత్తు ఉంది
- పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్యాలు అత్యవసరం
- ఇంటర్న్షిప్లు, సర్టిఫికేషన్లు కీలకం
- విద్యార్థులకు ఘన స్పందన




**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల అండ్ సైన్స్ కాలేజీలో విద్యార్థుల భవిష్యత్ ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకొని "ఇన్ఫోసిస్ ఫ్రీ ట్రైనింగ్ ఞ ప్లేస్మెంట్ ఓరియంటేషన్" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సదస్సులో ఇన్ఫోసిస్, ఐబీఎం సంస్థల సర్టిఫికేషన్ ప్రోగ్రామ్లు, ఏఐ--రోబోటిక్స్ రంగాల్లో ఉన్న విస్తృత ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు.

కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఇన్ఫోసిస్ శిక్షకుడు పి. అశోక్ మాట్లాడుతూ, ఇన్ఫోసిస్ అందిస్తున్న ఉచిత శిక్షణా కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్ వంటి ఆధునిక రంగాల్లో నైపుణ్యాలు సంపాదించుకుంటే దేశీయంగానూ అంతర్జాతీయంగానూ విస్తృత అవకాశాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా తమ ప్రతిభను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ మాట్లాడుతూ, నేటి తీవ్రమైన పోటీ ప్రపంచంలో కేవలం డిగ్రీ సాధించడం సరిపోదని, కాలేజీ విద్యతో పాటు స్కిల్ ఆధారిత కోర్సులు, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన శిక్షణ తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. విద్యార్థులు తమ కెరీర్ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకొని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ప్రోత్సహించారు. మెరీనా పెయింట్స్ కంపెనీ డైరెక్టర్ జి. పవన్ తమ సంస్థలో ఉన్న వివిధ స్థాయిల ఉద్యోగ అవకాశాలను వివరిస్తూ, సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే యువతకు విశాల భవిష్యత్తు ఉందని అభిప్రాయపడ్డారు. టీఎస్కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, చదువుతో పాటు ఇంటర్న్షిప్ అవకాశాలను వినియోగించుకొని ప్రాక్టికల్ అనుభవం సంపాదించాలని, ఇది ప్లేస్మెంట్లలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ హర్జోత్ కౌర్ డిజిటల్ యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం, డేటా అనలిటిక్స్, సాఫ్ట్ స్కిల్స్లో నైపుణ్యం సంపాదించడం ద్వారా గ్లోబల్ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని వివరించారు. కెరీర్ గైడెన్స్ కోఆర్డినేటర్ కె. సుధాకర్ మాట్లాడుతూ, స్కిల్ ఆధారిత కోర్సులు పూర్తి చేసి స్వయం ఉపాధి, స్టార్టప్లు, డిజిటల్ సర్వీసుల ద్వారా స్వతంత్రంగా ఎదగవ చ్చని, సృజనాత్మకతను వినియోగించి నూతన అవకాశాలను సృష్టించు కోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ ఓరియంటేషన్ సదస్సులో వివి ధ శాఖల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. విద్యార్థుల భవిష్యత్ ఉపాధి అవకాశాలకు దోహదపడేలా నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## కాంగ్రెస్ నాయకులు ఊసరవెల్లి రాజకీయాలు మానుకోవాలి

- ఇచ్చిన హామీలు అమలు చేయాలి...
- మాకొక న్యాయం వారికొక న్యాయమా?
- పైలెట్ రోహిత్ రెడ్డి విమర్శలు



తాండూరు, ఫిబ్రవరి 23 (జనం సాక్షి): కాంగ్రెస్ నాయకులు ఊసరవెల్లి రాజకీయాలు మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. సోమవారం తాండూరు పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల అనంతరం 13వ తేదీన ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్లోకి కాంగ్రెస్ నాయకులను ఎలా అనుమతించారని ప్రశ్నించారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి రాష్ట్ర పత్రికలకు కూడా అనుమతి లేదని, అయితే ఎమ్మెల్యే తోపాటు 30 మంది కాంగ్రెస్ నాయకులు చొరబడ్డారని ఆరోపించారు. ఎన్నికల ఫలితాలు తారుమారు చేయడానికి కాంగ్రెస్ నాయకులు వ్యూహం అమలు చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులకు, తనకు అనుమతి ఇవ్వకుండా పోలీసులు అడ్డుకున్నారని, ప్రజాస్వామ్య బద్ధంగా ప్రచారం చేసి ప్రజల తీర్పును శిరసావహించామని తెలిపారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, కానీ కాంగ్రెస్ నాయకులు అబద్ధపు మాటలతో ఓటర్లను మబ్బు పెట్టారని మండిపడ్డారు. 6వ వార్డులో గట్టి పోటీ ఇచ్చామని, ప్రజలకు కాంగ్రెస్ పార్టీపై నమ్మకం పోయిందని, 12 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు గెలిచామని వెల్లడించారు. కాంగ్రెస్ ఆరాచక పాలనను ఎండగడతామని, ప్రజాక్షేత్రంలో సమస్యలపై పోరాడతామని చెప్పారు. రాబోయే రోజుల్లో తాండూరు అభివృద్ధి కోసం కంకణబద్ధులమవుతామన్నారు. తోపులాటలో పోలీసులకు క్షమాపణలు చెప్పిన పైలెట్ రోహిత్ రెడ్డి, పోలీసులు అధికార పార్టీకి దాసోహం కాకూడదని, వారికి రాజమర్యాదలు మాకేమో అక్రమమా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని కుదిపేసింది అధికార యంత్రాంగమేనని, న్యాయం తమ వైపే ఉందని, భగవంతుడు అంతా చూస్తాడని తెలిపారు. కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. "నంగనాచి... ఊసరవెల్లి లాంటోడు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి" అని విమర్శించారు. అరుగ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి తాండూరుకు 1000 కోట్లు తీసుకురావాలని డిమాండ్ చేశారు. అదనపు నిధులతో పట్టణ అభివృద్ధి సాధించాలన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు పట్లోళ్ల నర్సింహ, తాండూరు మండల అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, సిద్రాల శ్రీనివాస్, యాలాల మండల అధ్యక్షులు రవీందర్, బషీరాబాద్ మండల అధ్యక్షులు నర్సిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరుకుల నరేందర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ రఘు, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 25న ఆందోళన పాటించనున్న బిఎంఎస్

**ముషీరాబాద్, ఫిబ్రవరి 23 (జనం సాక్షి):**
వివిధ రంగాల పరిశ్రమల్లో కార్మికుల ఎదుర్కొంటున్న దీర్ఘకాల సమస్యల పరిష్కారానికై, కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకై దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 25 న ఆందోళనలు చేపట్టనున్నట్లు, ఆందోళన దినంగా పాటించినట్లు భారతీయ మజ్దూర్ సంఘ్ తెలంగాణ ప్రకటించింది. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బిఎంఎస్ అఖిలభారత అధ్యక్షులు మల్లేశం తెలంగాణ ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ రాష్ట్ర కార్యదర్శి రమేష్ జిహెచ్ఎంసి యూనియన్ ప్రధాన కార్యదర్శి కృష్ణ ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై పలుమార్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టికి తీసుకువచ్చిన ప్రభుత్వ నుండి తగిన స్థాయిలో స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంత్యోదయ భావనకు అనుగుణంగా అన్ని రంగాల్లో అన్ని వర్గాల కార్మికులకు కార్మిక చట్టాల కఠిన సమగ్రంగా అమలు జరగాలన్నారు. ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ 2020 ఆక్యుపేషనల్ సేఫ్టీ హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్ లలో కార్మికుల ఆందోళనలు పరిష్కరించేలా సవరణలు జరపాలన్నారు.

ఇండియన్ లేబర్ కాన్ఫరెన్సు తక్షణమే నిర్వహించి వివిధ త్రైపాక్షక కమిటీలను పునర్ వ్యవస్థీకరించి సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్మికులకు ఈపీఎఫ్ 95 కింద పెన్షన్ 1000 నుండి 7500 పెంచి ద్రవ్యోల్బణ బత్యం కల్పించాలన్నారు. ఈఎస్ఐ ఈపీఎఫ్ కవరేజీ పరిమితులను పెంచి మరింత బంద్ కార్మికులకు ప్రయోజనాలు కల్పించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మిక వ్యవస్థను ఎత్తివేసి ఉద్యోగ భద్రతతో కూడిన హామీ ఉద్యోగాలు కల్పించాలన్నారు. దేశాభివృద్ధి, కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## బీసీ, ఈబీసీ విద్యార్థుల ఉపకార వేతనాల ప్రక్రియ వేగవంతం చేయాలి

- ప్రిన్సిపాల్స్ త్వరగా ధృవీకరణ పత్రాలు సమర్పించాలి
- ఆధార్-బ్యాంకు అనుసంధానం తప్పనిసరి
- డీబీటీ యాక్టివేషన్ ద్వారా నేరుగా ఖాతాల్లో జమ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 23 (జనం సాక్షి):**
జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలల ప్రిన్సిపాల్స్ బీసీ, ఈబీసీ విద్యార్థుల ఉపకార వేతనాల మంజూరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి టి. ఝాన్సీ రాణి విజ్ఞప్తి చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి మైన్టెనెన్స్ ట్యూషన్ ఫీజు (ఎంటీఎఫ్) కింద ప్రభుత్వం నిధులు విడుదల చేసిన నేపథ్యంలో అర్హులైన బీసీ, ఈబీసీ విద్యార్థులు దరఖాస్తు చేసిన ఫారాలకు ధృవీకరణ పత్రాలు జతపరిచి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయానికి వెంటనే సమర్పించాలని సూచించారు. పోస్ట్మెట్రిక్ స్కాలర్షిప్ పథకం కింద నమోదు చేసుకున్న విద్యార్థుల బ్యాంకు ఖాతాలను ఆధార్ నంబర్తో అనుసంధానం చేయడం తప్పనిసరని తెలిపారు. సంబంధిత బ్యాంకు లేదా ఎన్పీసీఐ పోర్టల్ ద్వారా ఆధార్ సీడింగ్ పూర్తి చేయాలని తెలంగాణ జాయింట్ డైరెక్టర్ ఆదేశించినట్లు పేర్కొన్నారు.

భవిష్యత్తులో స్కాలర్షిప్ మొత్తాలను నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేయడానికి డీబీటీ యాక్టివేషన్ తప్పనిసరి కావడంతో జూనియర్, డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్, ఇంజనీరింగ్ తదితర కళాశా లల ప్రిన్సిపాల్స్ తమ కళాశాలల బీసీ, ఈబీసీ విద్యార్థులకు అవగాహన కల్పించి వెంటనే ఆధార్ను బ్యాంకు ఖాతాలకు అనుసంధానం చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆధార్ సీడింగ్ కోసం విద్యార్థులు తమ సంబంధిత బ్యాంకు శాఖలను సంప్రదించాలని అధికారులు సూచించారు.

### రజక (చాకలి) కులస్థులపై దాడి చేసిన
## కులతత్వ దూరహంకారులను కఠినంగా శిక్షించాలి

**తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ**




**ముషీరాబాద్,ఫిబ్రవరి 23 (జనం సాక్షి):**
రజక (చాకలి) కులస్థులపై దాడి చేసిన కులతత్వ దూరహంకారులను కఠినంగా శిక్షించాలనీ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం చిక్కడపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టియుజెఎసి రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రఫుల్ రామ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కల్లెపు చంద్రశేఖర్ ప్రసాద్ లు మాట్లాడారు. క్రూరమైన దాడిని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (టియు జెఎసి) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. టికెట్ లేకుండా గుడిలోకి ప్రవేశించారనే సాకుతో రజక (చాకలి) కులస్థులు అయిన గణేష్, చంద్రకళ,మౌనికల పై గ్రామ సర్పంచ్ తుకారాం రెడ్డి నాయకత్వంలో సతీష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,మధు రెడ్డి మొదలగు వారు అగ్రకుల దురహంకారంతో భయంకరంగా దాడి చేసి కొట్టారనీ, రెండు నెలల పసిపాపను కాలుతో తొక్కి చంపారు. హంతకులపై మర్డర్ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని టియుటీజేసి డిమాండ్ చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అండగా నిలిచి తగురక్షణను, నష్టపరిహారాన్ని అందించాలనీ, హంతకులను శిక్షించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని,దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్రంలో రోజూ ఏదో ఒక చోట దళిత బహుజనులపై అగ్రకులాల దాడులు, హత్యలు జరుగుతున్నాయన్నారు. గ్రామాలలో, బస్తీలో కుల వివక్షత అమలు జరుగుతుంది, కులదురహంకారం, కులతత్వ నీచ సంస్కృతి పథకం ప్రకారం పెంచి పోషించబడుతుందాని చెప్పారు. అందువల్ల దాడులు పెరుగుతున్నాయనీ,వీటిని అరికట్టడానికి తక్షణమే దళిత బహుజన ప్రజాస్వామిక శక్తులతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించి తగు చర్యలు చేపట్టాలన్నారు.దాడులకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలతో పాటు వారి ఆస్తులను జప్తు చేసి బాధితులకు పంచడానికి అవసరమైన ప్రత్యేక చట్టం తీసుకురావాలనీ సూచించారు. అందుకోసం దళిత బహుజనులు ఐక్యమై పోరాడాలన్నారు. ఈ సమావేశంలో మోహన్ బైరాగి, పిడమర్తి లింగయ్య, యాదగిరి, ఈట్టె ప్రభాకర్, మల్లేష్, ఎన్,సాగర్, రవి తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
24 ఫిబ్రవరి 2026



## పునరావాస కేంద్రాలా..?
# ఏటీడీవో కార్యాలయాలా?

- పరిమితికి మించి సిబ్బంది
- అబాసుపాలవుతున్న గిరిజన అభివృద్ధి శాఖ

**ఖమ్మం, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** ఖమ్మం జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ పరిధిలో పాలన అస్తవ్యస్తంగా తయారైంది. ఏటీడీవో కార్యాల యాలు పునరావాస కేంద్రాలుగా తయారయ్యాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కార్యాలయంలో ఉండాల్సిన సిబ్బంది కంటే ఎక్కువమంది సిబ్బంది విధులు నిర్వర్తించడం ఆ శాఖ విమర్శల పాలవ్వడానికి కారణం అవుతోంది. అనా రోగ్య కారణాలు, ఏదైనా తప్పుచేసిన ఉద్యోగులను ఏటీడీవో కార్యాలయా లకు పంపించడం పరిపాటిగా మారింది.

**కారణం ఏదైనా డిప్యూటేషన్ ఏటీడీవో కార్యాలయానికే..!**

గిరిజన అభివృద్ధి శాఖ పరిధిలో జిల్లా వ్యాప్తంగా ఆశ్రమ పాఠశాలలు, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు మొత్తం కలిపి 30 ఉన్నాయి. వీటిని ఖమ్మం, వైరా డివిజన్లుగా విభజిస్తూ ఏటిడిఓ పోస్టులు కేటాయించారు. వీటిని సమన్వయం చేస్తూ పారదర్శక పాలన అందించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్యార్థుల సంక్షేమం, వసతి కల్పించేందుకు నిత్యం పర్యవేక్షణ చేయడం ఏటీడీవోల ప్రధాన విధి. వీరిని సమన్వయం చేస్తూ జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయం పనిచేస్తుంది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఖమ్మం, వైరా ఏటీడీవో కార్యాలయాల్లో సిబ్బంది లెక్కకు మించి ఉండటం ఇక్కడ పాలనలోని నిర్లక్ష్యాన్ని, లోటుపాట్లను ఎత్తిచూపుతోంది. సాధారణంగా గతంలో ఏటీడీవో కార్యాలయంలో ఏటీడీఓతో పాటు ఒక జూనియర్ అసిస్టెంట్, ఒక నాలుగో తరగతి సిబ్బంది ఉండేవారు. ఈ కార్యాలయాలతో కేవలం గిరిజన అభివృద్ధి శాఖ పరిధిలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల పర్యవేక్ష ణ ముడిపడి ఉండడం మాత్రమే కావడంతో ప్రజలకు సంబంధించి ఎక్కువ పనులు ఉండవు. దీంతో సిబ్బంది పరిమిత సంఖ్యలో ఉంటే సరిపోతుంది. అయితే ప్రస్తుత పరిస్థితి అందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. ఖమ్మం ఏటీడీవో కార్యాలయంలో ఏటిడిఓతో పాటు ఒక జూనియర్ అసిస్టెంట్, ఒక అటెండర్ ఉండగా, ఇటీవల కాలంలో వివిధ కారణాల చేత మరో ఇద్దరికి డిప్యూటేషన్ కల్పించారు. ఫలితంగా ఆ కార్యాలయంలో సిబ్బంది సంఖ్య ఏటీడీవో కాకుండా నలుగురికి చేరుకుంది. ఇద్దరు సిబ్బంది ఉంటే సరిపోయే కార్యాలయానికి నలుగురు ఉద్యోగులు పనిచేయడం ఆ శాఖ పరిపాలన తీరును తెలియజేస్తుంది.

ఇక వైరా ఎటిడిఓ కార్యాలయంలో ఏటీడీవోతో పాటు ఇద్దరు నాలుగో తరగతి సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ఇటీవల ఒక వసతి గృహ సంక్షేమ అధికారిని డిప్యూటేషన్ ఇవ్వడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. అసలు వసతి గృహ సిబ్బంది పనిచేయాల్సింది వసతిలో. ఈ శాఖలో ఏటీడీవో కార్యాలయంలో ఆ వసతి గృహ సంక్షేమ అధికారి ఎందుకు పనిచేస్తున్నాడో ఎవరికీ అంతుచిక్కని ప్రశ్న. వీరికి ఐటిడిఓ పిఓ డిప్యూటేషన్లు ఇస్తున్నట్లు ప్రచారం ఉంది. అదే నిజమైతే పీవోను సైతం తప్పుదారి పట్టిస్తున్న జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న ఆ ఉద్యోగులు ఎవరో గిరిజన అభివృద్ధి శాఖకు చెడ్డ పేరు తెచ్చే విధంగా ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఐటిడిఓ పిఓ, జిల్లా కలెక్టర్ దృష్టి సారించి జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ పనితీరును చక్కదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో ఆ శాఖ రానున్న రోజుల్లో మరింత అబాసుపాలయ్యే అవకాశం లేకపోలేదు.

**ఐటీడీఏ పీవో డిప్యూటేషన్ ఇచ్చారు..**

**విజయలక్ష్మి, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి, ఖమ్మం**

ఖమ్మం, వైరా ఏటీడీవో కార్యాలయాల్లో డిప్యుటేషన్‌పై ఉద్యోగులు పని చేస్తున్న మాట వాస్తవమే. అయితే వారికి డిప్యూటేషన్ ఇచ్చింది మాత్రం ఐటీడీఏ పీవోనే.

## బాధ్యతలు స్వీకరించిన కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 23 (జనం సాక్షి) :** కామారెడ్డి మున్సిపల్ ఇప్ప ఉమారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దీంతోకామారెడ్డి మున్సిపాలిటీలో సరికొత్త అధ్యాయం మొదలైంది. పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇప్ప ఉమారాణి సోమ వారం అత్యంత వైభవంగా బాధ్యతలు స్వీకరించారు.కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షట్కార్ హాజరై, నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తుందని పునరుద్ఘాటించారు.ఆదర్శ పాలన పట్టణాన్ని అవినీతికి తావులేకుండా, రాష్ట్రంలోనే ఒక మోడల్ సిటీగా తీర్చిదిద్దుతాం.
గతంలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని చూసే ప్రజలు నేడు ఈ పీఠాన్ని అప్పగించారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధికి మారుపేరుగా నిలుపుతాం.సొంత గడ్డపై మమకారం, ఇక్కడి ప్రతి గల్లీ సమస్య నాకు తెలుసు. నిధుల కొరత లేకుండా చూస్తూ, మౌలిక సదుపాయాల కల్పనలో పట్టణాన్ని అగ్రగామిగా నిలబెడతామని ధీమా వ్యక్తం చేశారు.జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షట్కార్ మాట్లాడుతూ,స్థానిక సంస్థల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ప్రజా పాలనలో భాగంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నూతన చైర్మన్‌కు సూచించారు.రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి కనీస వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీరిద్దరికీ చైర్ పర్సన్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి మరియు పార్టీ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ కామారెడ్డిని సుందర నగరంగా తీర్చిదిద్దుతానని ఆమె ప్రతిజ్ఞ చేశారు.

## డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి

- కరీంనగర్ కలెక్టరేట్ ముందు డెస్క్ జర్నలిస్టుల నిరసన
- జర్నలిస్టుల నిరసనకు టిడబ్ల్యూజేఎఫ్ సంపూర్ణ మద్దతు



**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 23 (జనంసాక్షి) :** డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కో కన్వీనర్, జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపూరావు డిమాండ్ చేశారు. డెస్క్ జర్నలిస్టుల ఫోరం ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ముందు సోమవారం చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన సంపూర్ణ మద్దతు తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయం ఎదుట పెద్ద సంఖ్యలో డెస్క్ జర్నలిస్టులు, రిపోర్టర్లు, ఫోటోగ్రాఫర్లు, మీడియా ప్రతినిధులు హాజరై తమ న్యాయమైన డిమాండ్లను గట్టిగా వినిపించారు. ఈ సందర్భంగా హాజరైన కుడుతాడి బాపూరావు మాట్లాడుతూ.. జీవో 252 వెంటనే సవరించి డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలన్నారు. పత్రికా రంగంలో డెస్క్ జర్నలిస్టుల పాత్ర అమోఘమని అన్నారు. వార్తలను సేకరించడం మాత్రమే కాదు, వాటిని సరిచూసి, విశ్లేషించి, సమగ్రంగా ప్రజలకు అందించడంలో డెస్క్ జర్నలిస్టుల కృషి అత్యంత కీలకమని వివరించారు. డెస్క్ జర్నలిస్టులు కూడా పత్రికా రంగంలో సమాన బాధ్యతలు నిర్వర్తిస్తుంటే, వారికి అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వకపోవడం వల్ల అనేక ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరు కావడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి, ఆరోగ్య బీమా, ప్రయాణ సౌకర్యాలు వంటి అంశాల్లో కూడా వారు వెనుకబడి పోతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ పక్షాన డెస్క్ జర్నలిస్టులకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, వారి హక్కుల సాధన కోసం అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. జర్నలిస్టుల ఐక్యతే తమ బలం అని, న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పలువురు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు ఐక్యంగా పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు. పత్రికా స్వేచ్ఛను కాపాడటంలో, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత ముఖ్యమని వారు పేర్కొన్నారు. డెస్క్ జర్నలిస్టుల కృషి గుర్తింపు పొందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించి, తమ డిమాండ్లను వివరించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి డెస్క్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే(143) జిల్లా అధ్యక్షుడు చెరుకు గోపాలకృష్ణ, నాయకులు సీహెచ్. వేణుగోపాల్ రావు, డెస్క్ జర్నలిస్టుల అడ్‌హక్ కమిటీ కన్వీనర్ పోలు సంపత్, కోకన్వీనర్లు అల్లాడి శ్రీనివాస్, బాడిసె సంపత్ కుమార్, దాముక రాజశేఖర్, దుబ్బాక శ్రీనివాస్, బొమ్మరవేని బాలకృష్ణ, గంగిళ్ళ జీవన్‌రెడ్డి, గోసికొండ ప్రవీణ్, బోయిని సంపత్, అన్ని పత్రికల డెస్క్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

### కాకినాడలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీని సందర్శించిన
## సుందరగిరి పెద్దమ్మ తల్లి ఫిషరీస్ ఎఫ్‌పీఓ మహిళలు

- పోస్ట్ హార్వెస్టింగ్ టెక్నాలజీపై శిక్షణ
- విలువాధిక్య ఉత్పత్తులు, ఎక్స్‌పోర్ట్ అవకాశాలు
- ఆదాయం రెట్టింపు.. ఆన్‌లైన్ మార్కెటింగ్
- ప్రధాని మత్స్య సంపద యోజన సబ్సిడీలు



**చిగురుమామిడి, ఫిబ్రవరి 23 (జనం సాక్షి):** నాబార్డ్ సౌజన్యంతో జనవికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సుందరగిరి పెద్దమ్మ తల్లి ఫిషరీస్ ఎఫ్‌పీఓ మహిళా సభ్యులు, పెద్దమ్మ తల్లి మ్యాక్స్ సొసైటీ ఫిషర్మెన్ కమ్యూనిటీ మహిళలు కాకినాడలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీని సందర్శించారు. పోస్ట్ హార్వెస్టింగ్ టెక్నాలజీ, విలువాధిక్య ఉత్పత్తుల తయారీ, ఫిష్ ఫుడ్ అవుట్‌లెట్స్ ద్వారా మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్ అవకాశాలపై శిక్షణ పొందారు. ఈ విధానాలతో పెద్దమ్మ తల్లి ఫిషరీస్ రైతు ఉత్పత్తిదారుల సంస్థకు అధిక ఆదాయం రావడమే కాకుండా మ్యాక్స్ సొసైటీ సభ్యులకు కూడా ఆన్‌లైన్ మార్కెటింగ్, బ్రాండింగ్ అవగాహన కల్పించే అవకాశం ఉందని వివరించారు. చేపల పెంపకం, క్లీనింగ్, గ్రేడింగ్, బ్రాండింగ్, యజమాన్య పద్ధతుల ద్వారా రైతుల ఆదాయం రెట్టింపు చేయవచ్చని సిఐఎఫ్టీ విశాఖపట్నం నుంచి వచ్చిన వెంకటరమణ వెంకటరావు, ఎం.వి. రావు వివరించారు. స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ అడిషనల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ అంజలి మేడమ్ మాట్లాడుతూ ఆక్వాకల్చర్ రైతులకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద సబ్సిడీలు పొందవచ్చని తెలిపారు.
ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఫిషరీస్ సురేష్, అసిస్టెంట్ డైరెక్టర్ జాస్మిన్, ఫీల్డ్ మేనేజర్ నాగేంద్ర, జనవికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యదర్శి, కోఆర్డినేటర్ రాజు, సోమేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. సుందరగిరి పెద్దమ్మ తల్లి ఫిషరీస్ ఎఫ్‌పీఓ సభ్యులు 25 మంది ఈ సందర్శనలో పాల్గొన్నారు. నాబార్డ్ సేవలకు మహిళలు ధన్యవాదాలు తెలియజేశారు.

### ఎంపీ అరవింద్‌ను కలిసిన కౌన్సిలర్లు

**జనం సాక్షి రాయికల్ :**మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన రాయికల్ బీజేపీ కౌన్సిలర్లు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ భోగ శ్రావణి సమక్షంలో ఈ భేటీ జరిగింది. అభివృద్ధి కార్యక్రమాల కు తన సహకారం అందిస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్ర మంలో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, పట్టణ అధ్యక్షుడు కుర్మా మల్లారెడ్డి, కౌన్సిలర్లు కల్లెడ ధర్మపురి, వేముల మౌనిక, కునారపు మానస, తోపారపు ప్రశాంతి, పుర్రె శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## 10.40 దాటినా జాడే లేదు

- సమయపాలన పాటించని గంభీరావుపేట ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు
- ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి... ప్రజలు ఆగ్రహం
- ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని మండల ప్రజల డిమాండ్



**గంభీరావుపేట, ఫిబ్రవరి 23 (జనం సాక్షి):** "మాదే ఆఫీసు... మా ఇష్టం వచ్చిన సమయానికి వస్తాం... మమ్మల్ని ఎవరేం చేయలేరు" అన్నట్లు వ్యవహరిస్తున్నారు రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు. మండలంలో ఏ పని జరగాలన్నా మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి వచ్చే ప్రజలు సోమవారం 10.40 గంటలకు కూడా కార్యాలయం ఖాళీగా ఉండటంతో అసహనానికి గురవుతున్నారు. ఖాళీ కుర్చీలు దర్శనమిస్తుండటంతో ప్రజలు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. పనులు నిలిచిపోతున్నాయి. సమయపాలన పాటించని ఉద్యోగులపై పై అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి నిర్లక్ష్యం వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికైనా సరైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నంబర్ ప్లేట్లపై కరీంనగర్ ట్రాఫిక్ పోలీసుల కొరడా

- 43 వాహనాలను సీజ్ చేసిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీమ్ ఉల్లా ఖాన్




**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 23 ( జనంసాక్షి) :** నగర పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు, కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు సోమవారం నగరంలోని 'వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కార్నర్' వద్ద వాహనాల నంబర్ ప్లేట్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీం ఉల్లా ఖాన్ ఆధ్వర్యంలో సిబ్బంది ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా ప్రధానంగా, నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఫ్యాన్సీ నంబర్ ప్లేట్లు, అస్పష్టంగా ఉన్న లేదా ట్యాంపరింగ్ చేసిన నంబర్ ప్లేట్లు, ఇర్రెగ్యులర్ నంబర్ ప్లేట్లు కలిగి ఉన్న వాహనాల పై చర్యలు తీసుకున్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో మొత్తం 43 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వాహన యజమానులపై జరిమానా విధించడంతో పాటు, నిబంధనల ప్రకారం సరైన నంబర్ ప్లేట్లను బిగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీమ్ ఉల్లా ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కరీం ఉల్లా ఖాన్ మాట్లాడుతూ, "వాహనదారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్పష్టమైన నంబర్ ప్లేట్లను కలిగి ఉండాలని, నంబర్ ప్లేట్లను మార్చడం లేదా అస్పష్టంగా ఉంచడం చట్టరీత్యా నేరం. నేరాల నియంత్రణలో నంబర్ ప్లేట్లు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని స్పష్టం చేశారు. తనిఖీల్లో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



### ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య సోదరుడికి
# ప్రభుత్వ ఉద్యోగం

**నియామక పత్రం అందజేసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నిజామాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 23,(జనంసాక్షి):** ఎక్సైజ్ కానిస్టేబుల్ కుమారి గాజుల సౌమ్య సోదరుడు గాజుల శ్రవణ్ కు ప్రభుత్వం ఉద్యోగ అవకాశం కల్పించగా, ఈ మేరకు కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం తన చాంబర్ లో ఉద్యోగ నియామక పత్రం అందజేశారు. విధి నిర్వహణలో భాగంగా ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య గత నెల 23వ తేదీన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో గంజాయి స్మగ్లర్లు కారుతో ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడి తొమ్మిది రోజులు మృత్యువుతో పోరాడి జనవరి 31న చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విదితమే. సౌమ్య అంత్యక్రియలను ప్రభుత్వం అధికార లాంచనాలతో జరిపించడమే కాకుండా, ఇటీవలే నిజామాబాద్ పర్యటనకు హాజరైన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన చేతుల మీదుగా సౌమ్య కుటుంబ సభ్యులకు కోటి రూపాయల ఎక్స్ గ్రేషియాను అందించారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించారు. ఈ మేరకు సౌమ్య సోదరుడు గాజుల శ్రవణ్ కు ఎక్సైజ్ శాఖ లో జూనియర్ అసిస్టెంట్ గా ప్రభుత్వం ఉద్యోగం కల్పించగా, కలెక్టర్ ఇలా త్రిపాఠి నియామక పత్రం అదించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సంఘటన జరిగిన నెల రోజుల లోపే సౌమ్య కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా, సౌమ్య సోదరుడు శ్రవణ్ కు ప్రభుత్వ ఉద్యోగం కల్పించిందని అన్నారు. బాధిత కుటుంబానికి ఇకముందు కూడా ప్రభుత్వ యంత్రాంగం తోడ్పాటుగా నిలుస్తుందని కలెక్టర్ భరోసా కల్పించారు. సౌమ్య మరణానికి కారకులైన వారిని కఠినముగా శిక్ష పడేలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లోఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, సీ.ఐ స్వప్న, ఎస్.ఐ మల్లేష్ పాల్గొన్నారు.

## ప్రజావాణితో సమస్యల పరిష్కారం

**ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఫిబ్రవరి 23 (జనంసాక్షి):** ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.మొత్తం 154 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు పంపారు. ముందుగా గత ప్రజావాణిలో వచ్చిన అర్జీల పరిష్కారంపై ఆయా శాఖల జిల్లా అధికారులు, రెవిన్యూ, పంచాయతీ రాజ్ శాఖా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్జీని పరిష్కరించాలని ఆదేశించారు.రెవెన్యూ శాఖకు 72, గృహ నిర్మాణ శాఖకు 17, జిల్లా పంచాయతీ అధికారికి 15,డీఆర్డీఓకు 8, జిల్లా సంక్షేమ శాఖకు 7, ఎండీ సెస్ కు 6, ఎస్డీసీకి 5, జిల్లా విద్యాధికారి, ఉపాధి కల్పన అధికారికి 4 చొప్పున, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, జిల్లా వైద్యాధికారికి మూడు చొప్పున, ఎస్పీ కార్యాలయానికి 2, జిల్లా అటవీశాఖ అధికారి, జిల్లా ఎక్సైజ్ శాఖ, జిల్లా ట్రెజరీ శాఖ, పశు సంవర్ధక శాఖ, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, సిరిసిల్ల, ఎంపీడీఓ ఎల్లారెడ్డిపేట, డీఎం ఆర్టీసీ సిరిసిల్లకు ఒకటి చొప్పున వచ్చాయి. ఇట్టి ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్ తదితరులు పాల్గొన్నారు.



## సుడా అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షా సమావేశం

**నాణ్యతతో పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచన**

**సుడా వైస్ చైర్మన్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి సమీక్షా**

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 23 (జనంసాక్షి):** సుడా అభివృద్ధి పనులు, నగర పరిసర ప్రాంతాల సుందరీకరణ పనులు తదితర అంశాలపై సుడా వైస్ చైర్మన్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు టెండర్ ప్రక్రియ పూర్తయి పెండింగ్ లో ఉన్న పనులను వెంటనే త్వరితగతిన పూర్తి చేయాలని నగరంతో పాటు పరిసర గ్రామాల ప్రధాన రహదారులు జంక్షన్లు డివైడర్ల సుందరీకరణ కు అధిక ప్రాధాన్యతనిస్తూ పనులకు రూపకల్పన చేయాలని అధికారులను ఆదేశించారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వర్టికల్ గార్డెన్లు,జంక్షన్ల సుందరీకరణ, పార్కుల పనులు వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఐడిఎస్ఎంటీ లో బ్యాలెన్స్ పనులు వారం రోజులలో పూర్తి చేయాలని ఫుడ్ కోర్టు పనుల శంకుస్థాపనకు అన్ని ఏర్పాట్లు చేయాలని డివైడర్ల మధ్యన పాట్స్ ఏర్పాటు చేసి వాటిలో రకరకాల పూల మొక్కలతో సుందరీకరణ చేయాలని నిర్ణయించారు. ఎన్టిఆర్ విగ్రహం కూడలితో పాటు నూతనంగా జంక్షన్ల సుందరీకరణ కు రూపకల్పన చేయాలని అధికారులకు సూచించారు. పనులు నడుస్తున్న రాజీవ్ చౌక్, యూనివర్సిటీ ముందు జ్యోతిబా పూలే జంక్షన్ వెంటనే పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ శివానంద్, డిఈ ఏ.రాజేంద్ర ప్రసాద్, ఏఈలు పి.సతీష్,టి. సతీష్, వర్క్ ఇన్స్పెక్టర్ అజ్మల్ పాల్గొన్నారు.

# కేజీబీవీ బెడ్స్ టెండర్లలో రూ.100 కోట్ల కుంభకోణం

- లోకాయుక్తలో ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్వీ నేత గెల్లు శ్రీనివాస్



హైదరాబాద్, ఫిబ్రవరి23 (జనంసాక్షి) : కేజీబీవీ బంకర్ బెడ్స్ టెండర్లలో జరిగిన రూ.100 కోట్ల కుంభకోణంపై వెంటనే సీబీఐ విచారణ జరపాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంభకోణం విషయంలో ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం లో చలనం లేదని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అవినీతి అడ్డుకట్టలేకుండా కొనసాగుతోందని విమర్శించారు. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ , మైనారిటీ విద్యార్థులు చదువుకునే కేజీబీవీ పాఠశాలల్లో మౌలిక వసతుల పేరుతో ఈ టెండర్లలో భారీ అవినీతి జరిగిందని పేర్కొన్నారు .నాసిరకం బంకర్ బెడ్స్ సరఫరా చేసి టెండర్లలో నియమ నిబంధనలను ఉల్లంఘించి ట్రూఫా , ముఫత్లాన్ కంపెనీలకు టెండర్లు కట్టబెట్టారని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూ. 12 వేల ఒక బెడ్డును లోకల్ ఎంఎస్ఎంఈలకు లకు లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో టెండర్లో భాగస్వామ్యం చేసారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అదే బెడ్డును రూ. 35 వేలకు మధ్యప్రదేశ్ నుంచి కొనుగోలు చేస్తూ ఒక్కో బొడ్డుపై 22 వేల రూపాయలను ఎస్టీమేషన్ కాస్ట్ పెంచి కాంట్రాక్టర్కు లబ్ధి చేకూర్చారని ఆరోపించారు. మొత్తం 45,360 బెడ్లకు గాను ఒక్కో బెడ్డుకు రూ. 33,446 అందజేస్తున్నాని, దాదాపుగా రూ. 164 కోట్ల రూపాయలను ఢిల్లీలో రాహుల్ గాంధీకి చేరవేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కుంభకోణంపై వెంటనే సీబీఐతో న్యాయ విచారణ జరపాలని, అక్రమాలకు పాల్పడిన అధికారులపై, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు.

# రైల్వేశాఖ మాజీ మంత్రి ముకుల్ రాయ్ మృతి



కోల్కతా, ఫిబ్రవరి23 (జనంసాక్షి) : రైల్వే మాజీ మంత్రి, తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు ముకుల్ రాయ్ మృతి చెందారు. ఆదివారం తెల్లవారుజామున 1:30 గంటలకు కోల్కతాలోని సాల్ట్ లేక్ అపోలో ఆసుపత్రిలో గుండెపోటుతో మరణించారు. రాయ్ మతిమరుపు వ్యాధితో బాధపడుతున్నారు. అనేక అనారోగ్యాలతో బాధపడుతున్న రాయ్ కొన్ని రోజుల క్రితం కోమాలో ఉన్నారు. మృతదేహాన్ని ఆయన నివాసానికి తీసుకెళ్లి, అంత్యక్రియలు నిర్వహించారు. గత రెండు సంవత్సరాలుగా ముకుల్ రాయ్ ఆసుపత్రిలో, ఆయన నివాసంలో చికిత్స పొందుతున్నారు. తెలిసిన ముఖాలను కూడా ఆయన గుర్తించే సామర్థ్యాన్ని కోల్పోయారు. ఆయన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి సన్నిహితుడు. ఆయన 2017లో బిజెపిలో చేరారు. ముకుల్ రాజీనామా తర్వాత, తృణమూల్ నుండి అనేక ఫిరాయింపులు జరిగాయి.

# బంగ్లాదేశ్లో ఆగని దారుణాలు

- హిందూ దివ్యాంగురాలుపై సామూహిక అత్యాచారం

ఢాకా, ఫిబ్రవరి23 (జనంసాక్షి) : బంగ్లాదేశ్లో హిందువులపై దాడులు, అకృత్యాలు రోజురోజుకూ తీవ్రమవు తున్నాయి. తాజాగా మరో దారుణం చోటుచేసుకుంది. చాంద్పుర్ జిల్లాలో హిందూ మహిళపై ముగ్గురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి 9గంటల సమయంలో ఒంటరిగా ఉన్న దివ్యాంగురాలైన మహిళను బలవంతంగా ఎత్తుకెళ్లి దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. నిర్మానుష్య ప్రాంతంలో స్పృహ కోల్పోయి ఉన్న మహిళను గుర్తించిన స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. స్థానికంగా నివాసం ఉండే రకీబ్, సోహైల్, రస్సెల్ అనే ముగ్గురు వ్యక్తులు తనపై అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు పేర్కొంది. వారు తనను తీవ్రంగా హింసించి గాయపరిచినట్లు తెలిపింది. ఇప్పటి వరకు పోలీసులు నిందితులను అరెస్టు చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాలు, మానవ హక్కుల కార్యకర్తలు నిరసనలకు దిగారు.

# ఎఫ్ఐఆర్, కేస్ డైరీ లేకుండా ఎలా అరెస్టు చేశారు?

- సునీల్ నాయక్ అరెస్ట్ను తప్పుపట్టిన పాట్నా కోర్టు

పాట్నా, ఫిబ్రవరి23 (జనంసాక్షి) : బీహార్లో పని చేస్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ను ఏపీ పోలీసులు అరెస్ట్ చేయడాన్ని పాట్నా కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఎలాంటి ఎఫ్ఐఆర్, కేస్ డైరీ లేకుండా ఎలా అరెస్టు చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టు రక్షణ ఉన్నప్పటికీ సునీల్ నాయక్ను బలవంతంగా అరెస్ట్ చేయడాన్ని నిలదీసింది. పాట్నా హైకోర్టు చెప్పినప్పటికీ ఏపీ పోలీసులు రావడమేంటని ప్రశ్నించింది. 30 రోజుల వరకూ సునీల్ నాయక్ను అరెస్ట్ చేయొద్దంటూ ఆదేశాలు జారీ చేసింది. దీనిలో భాగంగా రఘురామకృష్ణరాజు కేసు విషయానికి సంబంధించి సునీల్ నాయక్ను ట్రాన్సిట్ రిమాండ్ను పాట్నా సివిల్ కోర్టు తిరస్కరించింది. బలవంతపు అరెస్టును బిహార్ లాయర్లు తీవ్రంగా ఖండించారు. ఏపీ పోలీసులు గోడదూకి మరీ అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. బిహార్ పోలీసులు సైతం.. ఏపీ పోలీసుల తీరును తప్పుబట్టారు. సునీల్ నాయక్ గతంలో ఆంధ్రప్రదేశ్లో డిప్యూటేషన్లో పని చేశారు. ఈ క్రమంలోనే రఘురామకృష్ణరాజు కేసు విషయంలో ఆరోపణలు వచ్చాయి. అయితే తాజాగా సునీల్ నాయక్ను ఏపీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఏపీ సీఐడీ పోలీసులు.. సునీల్ నాయక్ నివాసానికి వెళ్లి అరెస్ట్ చేశారు. దీన్ని బిహార్ డీజీపీ కూడా తీవ్రంగా ఖండించారు. గోడదూకి వచ్చి తమ అధికారిని ఎలా అరెస్ట్ చేస్తారంటూ ప్రశ్నించారు.

# ఇండియా కూటమి నేతగా రాహుల్ తప్పుకోవాలి

- నాయకత్వాన్ని ప్రాంతీయ పార్టీలకు అప్పగించాలి
- కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ సంచలన వ్యాఖ్యలు



కోల్కతా, ఫిబ్రవరి23 (జనంసాక్షి) : కాంగ్రెస్ వెటరన్ నేత మణిశంకర్ అయ్యర్ మరోసారి సొంత పార్టీపై విమర్శల దాడి చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ప్రశ్నించారు. 'ఇండియా' కూటమి సారథ్య బాధ్యతల నుంచి రాహుల్గాంధీ తప్పుకోవాలని, ఆ బాధ్యతలను ప్రాంతీయ పార్టీల నేతలకు అప్పగించాలని కోల్కతాలో మీడియాతో మాట్లాడుతూ ఆయన సూచించారు. మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్, ఎంకే స్టాలిన్, తేజస్వి యాదవ్ వంటి సమర్థులైన నేతలు రాహుల్ గాంధీ నుంచి పగ్గాలు చేపట్టాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇటీవల పలు ఎన్నికల్లో వైఫల్యాలను చవిచూడడాన్ని అయ్యర్ ప్రస్తావిస్తూ, మమతా బెనర్జీని దూరం చేసుకోవడం వల్లే కాంగ్రెస్ బలహీనపడిందని అభిప్రాయపడ్డారు. మమతా బెనర్జీ లేకుంటే 'ఇండియా' కూటమి ఉనికికే ప్రమాదమని అన్నారు. కూటమి బాధ్యతలను తన చేతిలో పెట్టుకోకుండా ప్రాంతీయ పార్టీల నేతలైన స్టాలిన్, మమతా దీదీ, అఖిలేష్, తేజస్వి, ఇంకెవరికైనా రాహుల్ గాంధీ అప్పగిస్తారని ఆశిస్తున్నానని, వారయితే ఎక్కువ సమయం కేటాయించగలరని అయ్యర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీపై మణిశంకర్ అయ్యర్ నిశిత విమర్శలు చేయడం ఇదే మొదటిసారి కాదు. ఇటీవల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పాల్గొన్న ఒక కార్యక్రమానికి అయ్యర్ హాజరయ్యారు. పినరయి విజయన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారంటూ ఆయనపై ప్రశంసలు కురిపించారు. త్వరలో కేరళ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పినరయి విజయన్ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీని ఇరకాటంలో నెట్టింది. మణిశంకర్ అభిప్రా యం పార్టీ అభిప్రాయం కాదని, ఆయన వ్యాఖ్యలు, వ్యాసాలు పూర్తిగా ఆయన వ్యక్తిగతమని పేర్కొంది. కాగా, 'ఇండియా' కూటమి నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకోవాలంటూ అయ్యర్ చేసిన తాజా వ్యాఖ్యలపై కాంగ్రెస్ వెంటనే స్పందించింది. రాహుల్ గాంధీ మాత్రమే ఇండియా కూటమిని సమర్థవంతంగా ముందుకు నడిపించగలరని, బీజేపీని ఎదుర్కొనగలిగే సత్తా రాహుల్కే ఉందని ఆ పార్టీ నేత ఇమ్రాన్ మసూద్ వ్యాఖ్యానించారు.

# మహిళల సమగ్రాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

- మహిళా భద్రత, సాధికారతపై కీలక నిర్ణయాలు
- పాఠశాల స్థాయి నుంచే స్వీయరక్షణ శిక్షణ తప్పనిసరి
- మహిళా సంక్షేమంపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క



హైదరాబాద్ (జనంసాక్షి) : మహిళల అభివృద్ధి, సాధికారత, సమాన అవకాశాలు, భద్రత అంశాలపై పలు కీలక శాఖలతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్య, వైద్యం, పోలీస్, అటవీ, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ, మున్సిపల్ శాఖల ఉన్నతాధికారులు హాజరై తమ సూచనలు వెల్లడించారు. సమావేశంలో డీజీ చారు సిన్హా, పీసీసీఎఫ్ డా. సి. సువర్ణ, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ దివ్యా దేవరాజన్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టరేట్కు చెందిన సంగీతా సత్యనారాయణ, విద్యాశాఖ స్పెషల్ సెక్రటరీ వెంకటేశ్ దోత్రే, మున్సిపల్ శాఖ కమిషనర్లు పాల్గొన్నారు. మహిళల సమగ్ర సంక్షేమం కోసం శాఖల మధ్య సమన్వయం పెంపొందిస్తూ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. అభివృద్ధి, సమాన అవకాశాలు, రక్షణ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారుల అభిప్రాయాలు తెలుసుకుని, అంశాల వారీగా సబ్ కమిటీల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ లింగ వివక్షను నిర్మూలించి మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థలోనే లింగ సమానత్వ భావనను బలపరిచే విధంగా పాఠ్యాంశాలలో మార్పులు చేయాల్సిన అవసరాన్ని చర్చించారు. ఉద్యోగ రంగంలో మహిళలకు సమాన హక్కులు, ప్రైవేటు రంగంలోనూ మహిళలకు మెటర్నిటి బెనిఫిట్ యాక్ట్ అమలు వంటి అంశాలపై విధాన పరమైన మార్పులు అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో మహిళా భద్రత అంశంపై విస్తృత చర్చ జరిగింది. మహిళా శిశు సంక్షేమ, పోలీస్ శాఖల సమన్వయంతో మహిళా భద్రత విషయంలో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలు, డేటింగ్ యాప్స్, మ్యాట్రిమోనియల్ సైట్ల ద్వారా జరుగుతున్న మోసాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక షీ సైబర్ ల్యాబ్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించనున్నారు. పోక్సో కేసులు, మానవ అక్రమ రవాణా బాధితుల కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలనే అభిప్రాయం వ్యక్తమైంది. పాఠశాల స్థాయి నుంచే స్వీయరక్షణ శిక్షణను తప్పనిసరి చేయడం ద్వారా బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాల్సిన అవసరాన్ని మంత్రి సీతక్క ప్రస్తావించారు. ఆరోగ్యం, పోషణ అంశంలో కూడా ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. పాఠశాలలు, హాస్టళ్లలో కిషోర బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి రక్తహీనత వంటి సమస్యలను ముందుగానే గుర్తించాలని సూచించారు. అదనపు పోషకాహారం అందించడం ద్వారా ఆరోగ్య పరిస్థితులను మెరుగుపరచాలని నిర్ణయించారు. మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు గ్రామ స్థాయిలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి బ్రెస్ట్ క్యాన్సర్, సర్వికల్ క్యాన్సర్ వంటి వ్యాధుల స్క్రీనింగ్ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అలాగే టీనేజీ బాలికల మానసిక ఆరోగ్యం, సోషల్ మీడియా మంచి చెడులపై అవగాహన కల్పించేందుకు కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. మహిళా సంక్షేమానికి, ఆర్థిక సాధికారతకు సీఎం రేవంత్ రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని పేర్కొన్నారు. సమాజంలో మహిళల గౌరవాన్ని కాపాడే దిశగా కూడా చర్యలు అవసరమని మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు. . మూవి థియేటర్లలో మహిళా హక్కులు, చట్టపరమైన శిక్షలపై అవగాహన ప్రకటనలు జారీ చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. పిల్లలపై లైంగిక నేరాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని, మానవ అక్రమ రవాణా నియంత్రణకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో వెలువడిన సూచనల అమలుకు అంశాల వారీగా సబ్ కమిటీలు ఏర్పాటు చేసి, తక్షణమే కార్యాచరణ బృందాలను నియమించాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రతి శాఖ సమన్వయంతో సమగ్ర చర్యలు చేపట్టాలని, నిర్ణయాల అమలుపై నిరంతర సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, "మహిళల సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి పునాది. మహిళలకు భద్రత, సమాన అవకాశాలు, ఆరోగ్యం, గౌరవప్రద జీవనం కల్పించడం ప్రభుత్వ ధర్మం. ఈ సమావేశంలో వచ్చిన ప్రతి సూచనను కార్యాచరణ ప్రణాళికగా మార్చి వేగవంతంగా అమలు చేస్తాం" అని పేర్కొన్నారు.

# రేవంత్వి డైవర్షన్ పాలిటిక్స్

- మున్సిపల్ ఎన్నికలల్లో డ్రామా నడిపించారు
- డ్రామాలతో కాలం గడుపుతున్న సిఎం రేవంత్
- మండిపడ్డ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



హైదరాబాద్, ఫిబ్రవరి23 (జనంసాక్షి) : సీఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ విమర్శించారు. మున్సిపల్ ఎన్నికలు మొత్తాన్ని ఒక డ్రామా నడిపించారని అన్నారు. హైదరాబాద్లోని తెలంగాణ భవన్లో మెతుకు ఆనంద్తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి ఏ ఒక్క రోజూ మున్సిపాలిటీల అభివృద్ధి గురించి చెప్పలేదని సంజయ్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని నమ్ముకున్న వ్యక్తిగా, ఒక డాక్టర్గా, రాజ్యాంగాన్ని నమ్ముకున్న వ్యక్తిగా అన్ని వాస్తవాలను ప్రజల ముందు పెడుతున్నానని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ముందు మా నాయకుడు హరీశ్రావు సిట్ పేరుతో నోటీసులు ఇచ్చి మొదటి డ్రామాకు తెరలేపారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏమైనా ఉందా అంటే మన్ను లేదు మశానం లేదని అన్నారు. దావోస్ పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విహార యాత్రకు చేశాడని.. మొత్తం 12 రోజుల పాటు వెళ్లిన ముఖ్యమంత్రి , దావోస్ నుండి తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు గురించి చెప్పలేదని పేర్కొన్నారు. పెట్టుబడులపై మంత్రి శ్రీధర్ బాబు అయినా మాట్లాడతాడని అనుకుంటే ఆయన కూడా మాట్లాడలేదని చెప్పారు. అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనను విహార యాత్ర అంటున్నామని విమర్శించారు. డైవర్షన్ పాలిటిక్స్లో భాగంగా తెలంగాణ జాతిపిత అయిన కేసీఆర్కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులిచ్చి రెండో డ్రామాకు తెరలేపారని సంజయ్ మండిపడ్డారు. ప్రజల దృష్టి మరల్చడంలో రేవంత్ రెడ్డి ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. ఈ బ్జడెట్ సమావేశాల్లో నిజాయితీగా ప్రజల సమస్యల పై చర్చ చేయాలన్నారు. ఈ బ్జడెట్ లో మహిళలకు, రైతులకు, నిరుద్యోగులకు ఇస్తామని చెప్పిన హామీలకు నిధులు కేటాయించకపోతే వారందరూ కలిసి కాంగ్రెస్కుబుద్ధి చెప్పడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ బ్జడెట్ సమావేశాల్లో రేవంత్ రెడ్డికి ఫేవరేట్ స్జబెక్ట్ అయిన రియల్ ఎస్టేట్ గురించి మాట్లాడుదామని తెలిపారు. సమావేశాలకు వచ్చే ముందు దేవాదుల ఏ బేసిన్లో ఉందో తెలుసుంటే బావుంటుందని రేవంత్ రెడ్డిపై సెటైర్లు వేశారు. ఎట్టకేలకు దేవాదుల ప్రాజెక్టు దగ్గరకు వెళ్లినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు శ్రీరామ రక్ష అని రేవంత్ రెడ్డికి తెలుసు అని సంజయ్ అన్నారు. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ చేయాల్సిందేనని తెలిపారు. బ్జడెట్ సమావేశాల్లో మాకు మైక్ ఇవ్వమని చెప్పండి, జలాల పై చర్చకు సిద్ధమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గజిని లాంటి వాడు, ఆయన చెప్పేది ఒకటి చేసేది ఒకటి అని విమర్శించారు. ఈసారి అయిన అసెంబ్లీనీ గౌరవించి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి మాట్లాడే అవకాశం ఇవ్వాలని సూచించారు. పార్టీ మారారని ఆసిఫాబాద్ మున్సిపల్ కౌన్సిలర్పై అనర్హత వేటు వేశారని సంజయ్ తెలిపారు. 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినా స్పీకర్ వారిపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ కు మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ మారిన ఎమ్మెల్యేలు ప్రచారం చేసినా చర్యలు తీసుకోలేదని అన్నారు.

# వాట్సాప్ ద్వారా విద్యుత్ సేవలు

- సేవలను సులభంగా చేయాలన్న లక్ష్యం
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ



హైదరా బాద్, ఫిబ్రవరి 23 (జనం సాక్షి) : దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) విని యోగదారులకు మరింత సులభమైన సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. విద్యుత్ సేవలను నేరుగా తమ మొబైల్ ఫోన్ ద్వారానే పొందేలా వాట్సాప్ చాట్ సేవలను ప్రారంభించినట్లు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ వాట్సాప్లో 8712441912 నంబర్ను సేవ్ చేసుకుని హాయ్ అని మెసేజ్ పంపడం ద్వారా ఫిర్యాదుల నమోదు, బిల్లింగ్ వివరాలు, విద్యుత్ సరఫరా స్థితి, సమాచారం వంటి వివిధ సేవలను సులభంగా పొందవచ్చని తెలిపారు. సైబర్ నేరగాళ్లు పంపించే మెసేజ్లకు వాట్సాప్ చాట్బాట్ చెక్ పెడుతుందన్నారు సీఎండీ. విద్యుత్ సరఫరాలో ఫిర్యాదుల నమోదుతో పాటు బిల్లు జారీచేయకపోయినా, ఆన్లైన్ బిల్లు చెల్లించాక ఆ సమాచారం అప్డేట్ కాకపోయినా, ట్రాన్స్ఫార్మర్ వద్ద ఏవైనా సమస్యలు తలెత్తినా, విద్యుత్ లైన్లకు చెట్లకొమ్మలు తగిలినా, విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నా.. ఇలా పలురకాల ఫిర్యాదులను వాట్సాప్ చాట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

# కేయూలో చికెన్ కోసం కొట్లాట

- ఓ గ్రూపు విద్యార్థులకు తీవ్ర గాయాలు



హనుమకొండ ప్రతినిధి ఫిబ్రవరి 23 (జనం సాక్షి) : హనుమకొండ కాకతీయ యూనివర్సిటీ కామన్ మెస్లో ఆదివారం రాత్రి విద్యార్థుల మధ్య తలెత్తిన చిన్న గొడవ తీవ్రమైన భౌతిక దాడులకు దారి తీసింది. ఒకరిపై కర్ర దాడు చేసుకోవడంతో ఓ విద్యార్థి తల పగిలి తీవ్ర రక్తస్రావం కాగా మరో విద్యార్థి చేయి విరిగింది. హాస్టల్ ఉంటున్న ఎంబీఏ, ఎకానామిక్స్, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ విభాగాల విద్యార్థులు ఫిబ్రవరి నెలకు సంబంధించి కామన్ మెస్ కమిటీని నిర్వహిస్తున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో మెస్లో మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు చికెన్, గుడ్లను వడ్డిస్తారు. కమిటీలో ఉన్న మూడు విభాగాల విద్యార్థులు నిష్పక్షపాతంగా అందరికీ సమానంగా భోజనాలు వడ్డించేలా సమన్వయం చేస్తారు. కానీ చికెన్ వడ్డింపు విషయంలో ఎంబీఏ, ఎకానామిక్స్ విద్యార్థుల మధ్య వివాదం తలెత్తింది. మెస్లో జరిగిన చిన్న వివాదం న్యూ పీజీ హాస్టలు చేరింది. అక్కడ రాత్రి ఎంబీఏ విద్యార్థులు ఎకానామిక్స్ విద్యార్థిని ఒక్కడిని చేసి రూంలో వేసి దాడి చేశారు. ఈ ఘటన ఆ విభాగం మిగితా విద్యార్థులు, ఓ విద్యార్థి సంఘం నాయకులకు తెలియడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారంతా గుంపుగా హాస్టల్ కు చేరుకొని ఎంబీఏ విద్యార్థులపై కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో ఒకరి తలకు తీవ్రగాయాలు కాగా, ఎకానామిక్స్ విభాగం విద్యార్థి చేతి విరిగినట్లు తెలిసింది.

### హాస్టల్ జేడీలు ఏం చేస్తున్నట్టు?

హాస్టళ్ల నిర్వహణ సక్రమంగా చేపట్టేందుకు హాస్టల్ జాయింట్ డైరెక్టర్లను నియమిం చారు. హాస్టళ్లను పర్యవేక్షించడంలో వీరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతోనే తరుచుగా విద్యార్థుల మధ్య ఘర్షణలు తలెత్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఆదివారం రాత్రి మెస్ లో చికెన్ వడ్డన సమయంలో అదికారులు ఉంటే ఈ గొడవ జరిగేది కాదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. జేడీల పర్యవేక్షణ లోపంతోనే విద్యార్థు లు రెచ్చిపోయి భౌతిక దాడులకు దిగారు. ఆదివారం రాత్రి తోటి విద్యార్థుల తలపగిలి, రక్తాలు కారిపోయేలా దాడులు చేయడం హాస్టల్ నిర్వాహకుల తీరుకు అద్దం పడుతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

# జాతరలో అమానుష ఘటనపై చర్యలు తీసుకోండి

- డీజీపీకి మాజీ మంత్రి శ్రీనివాస్గౌడ్ ఫిర్యాదు



హైదరాబాద్, ఫిబ్రవరి23 (జనంసాక్షి) : కుమ్మేరా జాతరలో అమానుష ఘటనపై మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. సోమవారం హైదరాబాద్లోని కార్యాలయంలోకి వెళ్లి డీజీపీ శివధర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ అగ్రకులానికి చెందిన నాయకుడు రజక కులానికి చెందిన రెండు నెలల పసికందును తన్ని చంపిన వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి నిజాలు వెలికితీయాలని , బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట బీసీ కమిషన్ మాజీ సభ్యులు కిషోర్ గౌడ్, ఉపేందర్ చారి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ బాలరాజు యాదవ్, నేతలు స్వామి యాదవ్ ,రాజు తదితరులున్నారు.

# మలుపు తిరిగిన కన్నడ రాజకీయాలు

మంత్రి పదవులు కోరుతూ 31 మంది లేఖ

బెంగళూరు, ఫిబ్రవరి23 (జనంసాక్షి) : కర్ణాటకలో నాయకత్వ మార్పు కోసం జరుగుతున్న పోరు మరో మలుపు తిరిగింది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో తమకు చోటు కల్పించాలని కోరుతూ తొలిసారి గెలిచిన 31 మందికి పైగా ఎమ్మెల్యేలు పార్టీ అధిష్టానానికి సోమవారంనాడు లేఖ రాశారు. లోక్సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను ఉద్దేశించి ఎమ్మెల్యేలు ఈ లేఖ రాశారు. కర్ణాటక ప్రజలు కాంగ్రెస్ పార్టీ నుంచి 38 మంది కొత్త వారిని ఎమ్మెల్యేలుగా అసెంబ్లీకి పంపిన విషయం మీకు తెలుసు. తద్వారా అసెంబ్లీలో కొత్త వారిని చూడాలని అనుకుంటున్నట్టు ప్రజలు స్పష్టమైన సందేశాన్నిచ్చారని అధిష్టానానికి రాసిన లేఖలో ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. అయితే మంత్రివర్గంలో 34 మందికి చోటు కల్పించినప్పటికీ కొత్తగా ఎన్నికైన ఒక్క ఎమ్మెల్యేకు కూడా అవకాశం కల్పించలేదని అన్నారు. పార్టీ అధిష్ఠానానికి రాసిన లేఖపై సంతకాలు చేసిన ఎమ్మెల్యేలలో ఏఎస్ పొన్నన్న, అశోక్ రాయ్, శ్రీనివాస్ ఎన్టీ, పి.రవికుమార్, ఏసీ శ్రీనివాస్, హెచ్ఏ ఇక్బాల్ హుస్సేన్, బి.దేవేంద్ర, నారా భరత్ రెడ్డి, విశ్వాస్ వి వైద్య, బసవరాజ్ వి శివగంగ తదితరులు ఉన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370